

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 6-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 81 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా.9.15 తదుపరి ద్వాదశి; నక్షత్రం: విశాఖ రా.10.42 తదుపరి అనూరాధ, వర్జ్యం: తె.3.07-4.53; దుర్ముహూర్తం: సా.5.06-5.58; అమృతఘడియలు: మ.12.51-2.38; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.50 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణ బీఆర్‌ఎస్ జాగీరా?

తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే తెలంగాణ సర్వనాశనం అయిపోతోందని, తెలంగాణ అస్తిత్వమే ప్రమాదంలో పడిందని యావత్ తెలంగాణ సమాజం భావించాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని మీడియా సంస్థలకు ఆ పార్టీ నాయకుడు జగదీశ్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.

పెద్ద సారు, చిన్న సారుకు వ్యతిరేకంగా మీడియాలో కథనాలు వస్తే తెలంగాణ అస్తిత్వం ఎందుకు, ఎలా ప్రమాదంలో పడుతుందో వారికే తెలియాలి. చిన్న సారు తప్పులను ఎత్తి చూపితే తెలంగాణ సమాజానికి కలిగే నష్టం ఏమిటో జగదీశ్ రెడ్డి లాంటి వారే చెప్పాలి.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన 'ఆంధ్రజ్యోతి' సంస్థకు ఆ ఉద్యమ ప్రస్థానంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. తెలంగాణ ఏర్పాటు అంశాన్ని పరిశీలించడానికి ఏర్పాటైన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో 'ఆంధ్రజ్యోతిని కట్టడి చేస్తే తెలంగాణ ఉద్యమం చప్పబడిపోతుంది' అని వ్యాఖ్యానించడం నిజం కాదా? రాజకీయ పార్టీలైనా, మీడియా అయినా ప్రజల మనోభావాలకు అనుగుణంగానే వ్యవహరించాలి. లేని పక్షంలో వాటికి మనుగడ ఉండదు. ఈ వాస్తవాన్ని విస్మరించి జగదీశ్ రెడ్డి వంటి వారు మరోసారి 'ఆంధ్రా' అన్న పదాన్ని అందుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి?

మెరుగైన అవకాశాల కోసం ఆంధ్రా వారితో పాటు తెలంగాణ వారు కూడా విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ఆయా దేశాల స్థానికులు కూడా ఇలా సంకుచితంగా ఆలోచించడం మొదలు పెడితే అక్కడ మన వాళ్ల పరిస్థితి ఏమిటి? అంతెందుకు.. మెరుగైన విద్య కోసం ఇదే జగదీశ్ రెడ్డి తన కొడుకును లండన్‌లో చదివించడం లేదా? కేటీఆర్ ఒకప్పుడు గుంటూరులో చదువుకోలేదా? తెలంగాణ రాష్ట్ర సమితి నిలదొక్కుకోక ముందు కేటీఆర్, కవిత అమెరికాలో ఉద్యోగాలు చేయలేదా? అప్పుడు ఎక్కడ ఉంటున్నాం? ఎవరి తిండి తింటున్నాం? అని వారు ఆలోచించారో లేదో జగదీశ్వర రెడ్డి కనుక్కుంటే మంచిది.

తాము బలహీనపడుతున్నామన్న అనుమానం కలిగిన సందర్భాలలో ఏపీ సీఎం చంద్రబాబును భూతంగా చిత్రీకరించడం, మీడియానూ వివాదాల్లోకి లాగడం బీఆర్ఎస్ నేతలకు పరిపాటిగా మారింది. 2018 ఎన్నికల్లో ఈ అస్త్రం ప్రయోగించి రాజకీయంగా లబ్ధి పొందారు. ఇప్పుడు మళ్లీ అదే అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా తమకు దూరమైన వర్గాలను దగ్గర తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కేసీఆర్ ఆ ప్రయత్నం చేయకుండా వ్యక్తులపై అలిగినట్టుగా తెలుగుదేశం సానుభూతిపరులను కూడా శత్రువులుగా ప్రకటించుకున్నారు.



కొత్త పలుకు

తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో గుర్తించే ప్రయత్నం చేసి దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు మీడియా పైనో మరొకరి పైనో రంకెలు వేసే అవసరం వచ్చేది కాదు. తమను తెలంగాణ సమాజమే తిరస్కరించిందన్న కఠోర సత్యాన్ని విస్మరించి తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడిందని ఏడ్వడం ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణ అస్తిత్వానికి ఎవరూ ముప్పు తలపెట్టడం లేదు. పదకొండు సంవత్సరాల కిందట ఏర్పడిన తెలంగాణ అస్తిత్వం ఇవాళ మాత్రమే కాదు రేపు కూడా పదిలంగానే ఉంటుంది.

4

సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగవచ్చు. అన్ని పార్టీల వాళ్లూ బాధితులుగానే ఉంటున్నారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ప్రత్యేకంగా బాధపడటం అనవసరం. ఈ వ్యక్తిత్వ హననాలు, దుష్ప్రచారాలు చేయడంలో కేటీఆర్ కూడా ఏమీ తీసిపోలేదు. ఓటమి తర్వాత ఆయన సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ పిచ్చి భ్రమలో ఉన్నారు.

జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్టు ప్రత్యర్థులను రప్పా రప్పా నరుకుతామని ఆంధ్రాలో వైసీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ పోకడలను జగన్ రెడ్డి కూడా సమర్థిస్తున్నారు. ఈ ధోరణిని ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారు.

ఉడత ఊపులకు చింతకాయలు రాలవు. మా వరకు మేము ఇలాంటి దాడులను, బెదిరింపులను ఎన్నో చూశాం. రాజశేఖర రెడ్డి హయాంలో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత కేసీఆర్ పాలనలోనూ 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై దాడులు జరిగాయి. వివిధ రూపాల్లో నిర్బంధాలు ఎదురయ్యాయి. అయినా వాటన్నింటినీ తట్టుకొని నిలబడ్డాం. భవిష్యత్తులో కూడా నిలబడతాం.

న్యాయమంటే శిక్షలే కాదు..
బాధితులకు భరోసా

లైంగిక దాడుల బాధిత పిల్లలకు న్యాయం, గౌరవంతోపాటు బాల్యాన్నీ తిరిగివ్వాలి

- ఆ చిన్నారులకు అన్ని దశల్లో సర్కారు అండగా ఉంటుంది
- చైల్డ్ పోర్నోగ్రఫీ విషయంలో అత్యంత కఠినంగా ఉండండి
- సోషల్ మీడియా దోషుల్ని వదలొద్దు
- లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత సదస్సులో సీఎం
- బాలల భద్రత జాతీయ బాధ్యత
- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్
- పోక్సో నిందితుల్లో 98% మంది కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగే: జస్టిస్ సుజోయ్ పాల్


జస్టిస్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జస్టిస్ పాల్

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల పట్ల అశ్రద్ధ, వ్యవస్థాగత వైఫల్యం నేరపరమైన లోపం మాత్రమే కాదు.. అది బాల్యానికి చేస్తున్న తీవ్రమైన ద్రోహం. తెలంగాణలోని భరోసా కేంద్రాలు చట్టపరంగానే కాకుండా వైద్య, మానసిక సంరక్షణను సమగ్రంగా అందించే జాతీయ బాలల రక్షణ ఫ్రేమ్ వర్క్‌ను సాకారం చేస్తున్నాయి.

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

6

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): "న్యాయమంటే కేవలం శిక్షలు విధించడమే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించడం. లైంగిక దాడుల బాధిత చిన్నారులకు అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకోవడమే కాదు.. వారు తమ బాల్యాన్ని తిరిగి పొందడానికి అందరూ ప్రయత్నించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లలు, మహిళల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. సోషల్ మీడియా విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, దానిని దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపాల్సిన అవసరం లేదని, దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. లైంగిక దాడులకు గురైన చిన్నారుల రక్షణ, భద్రత విషయమై శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో సదస్సు జరిగింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నల్సార్ అధ్యక్షుడు జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించిన ఈ సదస్సుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైంగిక దాడుల బాధితులైన చిన్నారులకు అన్ని దశల్లో అండగా ఉంటామని, వారి బాల్యాన్ని మళ్లీ వారికి అందించడానికి అన్ని శాఖల సిబ్బంది మానవతా దృక్పథంతో పని చేయాలని కోరారు. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, ఇతర భాగస్వామ్య సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "న్యాయం అనేది కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ చిన్నారులకు అందాలి. పోలీసు స్టేషన్ నుంచి బాలల సంక్షేమ కేంద్రాల వరకు అన్నిచోట్ల పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలి. బాలికలు, మహిళల రక్షణ కోసం ఇప్పటికే తెలంగాణలో భరోసా ప్రాజెక్టు అమల్లో

మిగతా 13వ పేజీలో...

వైద్య విద్యలో కీలక సంస్కరణలు
220 పడకలుంటే బోధనాస్పత్రి

- అక్కడే కొత్తగా పీజీ సీట్ల మంజూరు
- స్పెషలిస్టుకు పదేళ్ల అనుభవం ఉంటే.. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పరిగణన
- రెండేళ్ల అనుభవానికి అసిస్టెంట్ ప్రొఫెసర్
- కొత్త మెడికల్ కాలేజీల్లోనూ నేరుగా పీజీ
- వైద్య విద్యాసంస్థల నియంత్రణ-2025 నిబంధనల విడుదల

2



శభాష్.. గిల్

- ఒకే టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ
- గవాస్కర్ తర్వాత రెండో భారత క్రికెటర్
- టీమిండియా రెండో ఇన్నింగ్స్ 427/6 డిక్లేర్డ్.. 2వ టెస్టులో ఇంగ్లండ్‌పై పట్టు

11


హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాంచందర్‌రావు. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ

కాంగ్రెస్ సర్కారుపై
ధర్మయుద్ధం

- 600 రోజులైనా ఆరు గ్యారంటీల అమలేదీ?
- సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేసి బీసీకి ఇస్తే.. నేనూ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం
- బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు
- రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ

ఢిల్లీ లీడర్‌లా కాకుండా.. గల్లీ లీడర్‌లా!
బీజేపీపై ఖర్గే వ్యాఖ్యలు అనుచితం
కిషన్‌రెడ్డి ధ్వజం

హైదరాబాద్/గన్‌పార్క్/చార్మినార్, జులై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అధర్మ పాలన సాగుతోందన్నారు. ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేస్తామని ప్రకటించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నుంచి పార్టీ అధ్యక్ష బాధ్యతలను రాంచందర్‌రావు స్వీకరించారు. అనంతరం అధ్యక్షుడి హోదాలో తొలిసారిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రైతులు, మహిళలు, విద్యార్థులను మభ్యపెడుతూ అనేక హామీలు ఇచ్చిందని, కానీ.. అధికారంలోకి వచ్చాక డబ్బుల్లేవని, ప్రభుత్వం భిక్షాటన స్థితిలో ఉందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామంటూ

మిగతా 12వ పేజీలో...

రేపు ఢిల్లీకి సీఎం

- పార్టీ అధిష్ఠానంతో పాటు కేంద్ర మంత్రులతో భేటీ
- తుంగతుర్తి సభకు రాహుల్, ప్రియాంకకు ఆహ్వానం!

13

12 నుంచి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

డిప్యూటీ సీఎం భట్టి

వక్ఫ్ ఆస్తులకు పోర్టల్!

14



మహిళలకు స్టాంప్ డ్యూటీ
తగ్గింపు

- పాత ఫ్లాట్లకు వర్తింపజేసే యోచన
- త్వరలో తెలంగాణ స్టాంప్ సవరణ బిల్లు
- అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెట్టే చాన్స్
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష
- సామాన్యులపై భారం పడకుండా భూముల ధరలు సవరించాలని సూచన



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలని ఆలోచన చేస్తున్నామని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దీంతోపాటు కొత్త, పాత

మిగతా 13వ పేజీలో...



రోజుకు గరిష్ఠంగా 10 గంటల పని

- వారానికి 48 గంటలు..
- మించితే ఓవర్‌టైమ్ వేతనం
- నిరాఘాటంగా 6 పని గంటలకు మించవద్దు
- అరగంట విశ్రాంతి తప్పనిసరి
- త్రైమాసికంలో ఓటీ.. 144 పని గంటలు దాటరాదు
- రాష్ట్ర కార్మిక శాఖ తాజా నోటిఫికేషన్

12

వందా.. వాని బొందా?



- తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు సాధిస్తామన్న రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఎద్దేవా
- రైతులకు ఎవరేం చేశారో చర్చించడానికి రెడీ
- 8న ప్రెస్‌క్లబ్‌కు వస్తా.. ఎమ్మెల్యేలతో కలిసి రా
- నీ స్థాయికి నేను చాలు.. కేసీఆర్ అవసరం లేదు
- మా హయాంలో పూర్తయిన నియామకాలను నీవని చెప్పుకోవడానికి సిగ్గు లేదా?: కేటీఆర్

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): "వందా.. వాని బొందా..!? 100 అసెంబ్లీ సీట్లు రావాలంటే ప్రజలు ఓటెయ్యాలి. రేవంత్‌కు ఎవరు ఓటేస్తారు? ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయనందుకు దళితులు, గిరిజనులు ఓట్లేయాలా? రూ.4000 పింఛను ఇవ్వనందుకు ముసలివాళ్లు ఓట్లేయాలా? రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వనందుకు నిరుద్యోగులు ఓట్లేయాలా? నెలకు రూ.2500 ఇవ్వనందుకు ఆడబిడ్డలు ఓటు వేయాలా? రైతు బంధు ఎగ్గొట్టినందుకు రైతులు ఓట్లు వేయాలా? చచ్చిపోతున్న ఆటో డ్రైవర్లు నీకు ఓటు వేయాలా?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 3వ పేజీలో...

మెరుగుపడ్డ కేసీఆర్ ఆరోగ్యం.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి 12

దామోదర్ లొంగిపోవడం లేదు

- అదంతా పోలీసుల సృష్టి
- మంత్రి సీతక్కపై వచ్చిన ప్రకటనతో మాకు సంబంధం లేదు
- లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

ఏటూరునాగారం/ చర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడె చొక్కారావు అలియాస్ దామోదర్ లొంగిపోతున్నారన్న వార్తల్లో నిజం లేదని, అదంతా పోలీసులు చేస్తున్న దుష్ప్రచారం అని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఓ లేఖ విడుదలైంది. దామోదర్ లొంగిపోతున్నట్లు మీడియాలో వచ్చిన వార్తలు బూటకమని ఆ లేఖలో జగన్ పేర్కొన్నారు. పోలీసులే ఉద్దేశపూర్వకంగా ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో జూన్ 26న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రికా ప్రకటనకు తమ పార్టీకి సంబంధం లేదని జగన్ స్పష్టం చేశారు. కాగా, బీజాపూర్ జిల్లా జాతీయ అటవీ ప్రాంతంలో శనివారం కేంద్రబలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందినట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ జరుగుతోందని తెలిపారు.

డిప్లొమోను ఇంటర్‌తో సమానంగా పరిగణించాలి: హైకోర్టు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (పాలిటెక్నిక్) డిప్లొమో కోర్సు ఇంటర్మీడియట్‌తో సమానమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ డిప్లొమో పూర్తి చేసిన అభ్యర్థులను ఇంటర్ అర్హతగా నిర్ణయించిన కోర్సుల్లో ప్రవేశాలకు అనుమతించాలని ఆదేశించింది. ఇంటర్ అర్హతగా ఉన్న ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లొమో కోర్సు (డీఈఈసెట్-2025) చేసేందుకు అనుమతించడం లేదంటూ మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన హరీశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2001లో జారీచేసిన జీవో 112 ప్రకారం పాలిటెక్నిక్ డిప్లొమోను ఇంటర్‌కు సమానంగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఏకీభవించిన హైకోర్టు ఆయనను కౌన్సెలింగ్‌కు అనుమతించి, అడ్మిషన్ ఇవ్వాలని ఆదేశించింది.

పట్టాభూముల్లో కాల్వలు నిర్మిస్తే పరిహారమివ్వాలి

- హైకోర్టు స్పష్టీకరణ

ప్రైవేటు పట్టా భూముల్లో ప్రధాన, పిల్ల కాలువలు నిర్మించాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టం నిర్దేశిస్తున్న నిబంధనలను అనుసరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. భూసేకరణ చేపట్టి, రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం మల్కపేట గ్రామ పరిధిలో చేపడుతున్న కాలువల పనులకు సంబంధించి దాఖలైన వ్యాజ్యంపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల భూముల్లో కాలువలు నిర్మించాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేపట్టి పరిహారం ఇవ్వాలని పేర్కొంది.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాలు గల సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ అకాడమి ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి ప్రకటించారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్‌లో పీజీ, డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ అందించి, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 78931 41797 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని విమలారెడ్డి కోరారు.

నా మాటలను వక్రీకరిస్తే సహించను: అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెద్ద కాంట్రాక్టర్లు చంద్రబాబు కోవర్టులని తాను అన్నానని, తన మాటలను వక్రీకరిస్తే సహించేదిలేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బనకచర్ల ప్రాజెక్టు అంశంలో చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారని తాను అన్నానని, నాయకుల గురించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేశారు. తాను మాట్లాడిన వీడియో చూడకుండానే కొందరు విపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబు కోవర్టుగా తాను పరోక్షంగా వ్యాఖ్యానించినట్లు విపక్షనేత పేర్కొనడం ఆక్షేపణీయమని అన్నారు. తాను మాట్లాడిన వీడియో చూసిన తర్వాతే మాట్లాడాలని, చూడకుండా మాట్లాడటం సబబు కాదని హితవు పలికారు. వివాదంలోకి ముఖ్యమంత్రిని లాగొద్దని కోరారు.

డిజిటల్ అరెస్టు పేరుతో.. వృద్ధుడికి రూ.53 లక్షల కుచ్చుటోపీ

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 77 ఏళ్ల ఓ వృద్ధుడిని డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్ల ముఠా.. రూ.53 లక్షలను కొల్లగొట్టిన ఉదంతమిది. అమీర్‌పేట్‌కు చెందిన బాధితుడికి.. సైబర్ నేరగాళ్ల నుంచి వీడియోకాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనను తాను ఢిల్లీ డీసీపీ రాజ్‌వీర్‌కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. "మీపై ఢిల్లీలో మనీల్యాండరింగ్ కేసు నమోదైంది. మీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారించాం. మీపై అరెస్టు వారెంట్ ఇష్యూ అయ్యింది" అని భయపెట్టాడు. బాధితుడి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును ఆర్బీఐ ఖాతాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. "ఒకవేళ మీ తప్పు లేదని తెలిస్తే.. ఆర్బీఐ మీ డబ్బును తిరిగి ఇచ్చేస్తుంది" అని నమ్మబలికాడు. అది నిజమని నమ్మిన బాధితుడు రూ.53 లక్షలను మోసగాళ్లు పేర్కొన్న బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. తన డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

220 పడకలుంటే బోధనాస్పత్రి

- వైద్య విద్యలో కీలక సంస్కరణలు
- వైద్య విద్యాసంస్థల నియంత్రణ-2025 విడుదల


హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో వైద్య విద్యలో కీలక సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం నాంది పలికింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా స్పెషలిస్టు వైద్యుల సంఖ్యను పెంచేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో 220 పడకలుండే ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా పరిగణించాలని సూచించింది. ఈ మేరకు జాతీయ వైద్య విద్యా సంస్థల(అధ్యాపకుల అర్హత) నియంత్రణ-2025ని నోటిఫై చేసింది. 220 పడకలున్న ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తే.. కొత్తగా పీజీ సీట్లు పెరుగుతాయి. ఆయా ఆస్పత్రుల్లో పనిచేసే సీనియర్ స్పెషలిస్టు వైద్యులను బోధనాస్పత్రుల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పరిగణిస్తారు. అక్కడి పీజీ విద్యార్థులకు వీరు పాఠాలను బోధిస్తారు. దేశంలో వైద్య విద్య అధ్యాపకులు, స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉన్న నేపథ్యంలో జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) పరిధిలో పనిచేసే పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు(పీజీఎంఈబీ) కొత్త నియంత్రణలను తీసుకువచ్చింది. ఎన్ఎంసీ ఆ వివరాలను శనివారం విడుదల చేసింది.

కీలక సంస్కరణలు ఇవే..

- 220 పడకలను మించిన బోధనేతర ఆస్పత్రులను ఇకపై బోధనాస్పత్రులుగా పరిగణిస్తారు. అక్కడ పనిచేసే సీనియర్ వైద్యులకు ఫ్యాకల్టీగా అవకాశమిస్తారు. పదేళ్లుగా స్పెషాలిటీ సేవలు అందించే వైద్యుడికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా.. రెండేళ్ల అనుభవం ఉన్న స్పెషలిస్టుకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమిస్తారు. వారు సీనియర్ రెసిడెంట్ వైద్యులు కాకపోయినా.. ఈ నియామకాలను జరపవచ్చు. ఇలా అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రుల్లో పీజీ సీట్లకు అనుమతినిస్తారు.
- నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ గుర్తించిన ప్రభుత్వ వైద్య సంస్థల్లో సీనియర్ కన్సల్టెంట్స్‌గా మూడేళ్ల పాటు పనిచేసి ఉంటే.. వారిని ప్రొఫెసర్ పోస్టుకు అర్హులుగా పరిగణిస్తారు. ఎన్‌బీఈఎంఎస్ గుర్తించిన ప్రభుత్వ వైద్య సంస్థల్లో డిప్లొమా కలిగిన స్పెషలిస్టు లేదా, ఏదైనా ప్రత్యేక విభాగంలో మెడికల్ ఆఫీసర్‌గా కనీసం ఆరేళ్ల పాటు పనిచేసిన వారు కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు.
- సర్కారీ వైద్య పరిశోధన సంస్థలు, వైద్యవిద్య విభాగం, రాష్ట్ర వైద్యమండలి, హెల్త్ యూనివర్సిటీ, జాతీయ వైద్య కమిషన్‌లలో ఫ్యాకల్టీ సభ్యుడిగా కనీసం ఐదేళ్లపాటు పనిచేసిన వారికి అనుభవం ఉన్నట్లుగా పరిగణిస్తారు. వీరంతా 220 పడకలుండే ఆస్పత్రుల్లోనే బోధనకు అర్హులు.
- కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో.. పీజీతోపాటు, ఎంబీబీఎస్ కోర్సులను ప్రారంభించుకోవచ్చు. దీనికి ఎన్ఎంసీ అనుమతులిస్తుంది. అందుకు అనుగుణంగా టీచింగ్ ఫ్యాకల్టీ, హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్‌ను పెంచుకోవాల్సి ఉంటుంది.
- పీజీ కోర్సులను ప్రారంభించుకోవాలంటే గతంలో ముగ్గురు ఫ్యాకల్టీతోపాటు ఒక సీనియర్ రెసిడెంట్ అవసరం. ఒక్కో యూనిట్‌కు కనీసం 40 పడకలుండాలి. అప్పుడే ఆ యూనిట్‌కు ఐదు పీజీ సీట్లకు అనుమతులిస్తారు. ప్రస్తుతం ఈ నిబంధనకు కూడా మినహాయింపునిచ్చారు. ఇక నుంచి పీజీ కోర్సులను కేవలం ఇద్దరు ఫ్యాకల్టీలో రెండేసి సీట్లతో ప్రారంభించుకోవచ్చు.
- ఎంఎస్సీ పీహెచ్‌డీ చేస్తే మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ విభాగాల్లో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీగా నియమించుకోవచ్చు.
- సీనియర్‌గా నియామకానికి గరిష్ఠ వయోపరిమితికి అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్, కమ్యూనిటీ మెడిసిన్ వంటి ప్రీ క్లినికల్, పారా క్లినికల్ సబ్జెక్టుల్లో రెసిడెంట్ డాక్టర్లకు 50 సంవత్సరాలకు పెంచారు. గతంలో గరిష్ఠ వయోపరిమితి 40 ఏళ్లుగా ఉండేది. గరిష్ఠ వయో పరిమితి ఉండేది.
- పీజీ చేసిట్యూటర్లు, డెమాన్‌స్ట్రేటర్స్‌గా అనుభవం ఉంటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత లభిస్తుంది.
- ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ అర్హతలు ఉండి.. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారిని అధ్యాపకులుగా నియమించవచ్చు.

అధ్యాపకుల పదోన్నతులు ఇలా

ప్రస్తుతం వైద్యవిద్యలో దేశవ్యాప్తంగా అధ్యాపకుల కొరత ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు. నాలుగేళ్ల పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తే.. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభిస్తుంది. అసోసియేట్‌గా మూడేళ్ల పాటు సేవలందిస్తే ప్రొఫెసర్ అవుతారు. ప్రొఫెసర్‌గా ఐదేళ్ల పాటు పనిచేస్తే.. వైద్యవిద్య అదనపు సంచాలకులు అవుతారు. అంటే కనీసం ఏడేళ్ల పాటు వైద్యవిద్యలో అనుభవం ఉంటేనే ప్రొఫెసర్ అవుతారు. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును మాత్రమే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయవచ్చు. ఈ నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ అనుభవాన్ని నేరుగా అసోసియేట్ ప్రొఫెసర్లను నియమించుకునే వెసులుబాటును తాజా సంస్కరణలు కల్పిస్తున్నాయి.



కోదాడలో బయటపడినవి.. చాళుక్య భీమ నాటి రాగి పలకలు

కోదాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఇటీవల బయటపడిన రాగి పలకలు వేంగి చాళుక్యుల నాటి భీమ-1 కాలానికి చెందినవిగా పురావస్తుశాఖ అధికారులు గుర్తించారు. కోదాడ పట్టణం ఖబ్రస్థాన్‌లో ఏప్రిల్ 29న గుంతలు తవ్వుతుండగా మట్టికుండలో తొమ్మిది సెట్ల రాగి పలకలు లభించాయి. వీటిని రెవెన్యూ సిబ్బంది హైదరాబాద్‌లోని పురావస్తుశాఖకు పంపారు. ఇటీవల వీటిని రసాయనాలతో శుద్ధిచేసి వెంగి చాళుక్య భీమ-1 (క్రీ.పూ.888-918) కాలంనాటివిగా పురావస్తు శాఖ గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మూడు రాగి పలకలపై సంస్కృతంలో చాళుక్య భీమ-1కు సంబంధించిన వివరాలున్నాయని పేర్కొన్నారు. అలాగే వరాహ, స్వస్తి త్రిభువనాంకుశతో కూడిన చిహ్నం ఉందని, రాగి పలకలపై ఉన్న సమాచారం చాళుక్యుల చరిత్రను తెలియజేస్తోందన్నారు. ఈ పలకలు సుమారు 50 కిలోల బరువు ఉన్నాయని, ప్రస్తుతం ఇవి తెలంగాణ వారసత్వశాఖ ఆధీనంలో ఉన్నాయని అధికారులు తెలిపారు.

గొంతు కోసి ఐదేళ్ల బాలిక దారుణ హత్య

- జగిత్యాల జిల్లా కోరుట్లలో ఘటన..


హితిక్ష (ఫైల్)

కోరుట్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఐదేళ్ల బాలికను గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఆడుకునేందుకు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ఆమె.. అదే కాలనీలోని మరొకరి ఇంటి బాత్రూంలో రక్తపు మడుగులో శవమై కనిపించింది. శనివారం జగిత్యాల జిల్లా కోరుట్లలో చోటుచేసుకున్న ఈ ఘటన సంచలనం రేపింది. పోలీసుల వివరాల మేరకు.. ఆదర్శనగర్‌లో నివాసముంటున్న ఆకుల రాములు-నవీన దంపతులకు కుమారుడు వేదాన్, కూతురు హితిక్ష(5) ఉన్నారు. రాములు ఉపాధి నిమిత్తం కొద్ది రోజుల కింద గల్ఫ్‌కు వెళ్లగా నవీన అత్తామామలతోనే ఉంటోంది. సాయంత్రం కాలనీకి చెందిన పిల్లలతో హితిక్ష ఆడుకుంటూ కనిపించకుండాపోయింది. దీంతో చుట్టుపక్కల వెతికిన హితిక్ష బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలోనే స్థానికుల సాయంతో పోలీసులు వెతుకుతుండగా.. అదే కాలనీలోని కొడుపల్లి విజయ్ అనే వ్యక్తి ఇంటి బాత్రూంలో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించారు. హుటాహుటిన బాలికను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విజయ్ ఇంట్లో హితిక్ష రక్తపు మడుగులో పడి ఉండడంతో అతడే హత్య చేసి ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విజయ్‌కు ఇంటి యజమాని ఫోన్ చేయగా తాను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నానని చెప్పినట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

విపత్తుపై నారి!

సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ బృందం

- 13 మంది యువతులకు శిక్షణ పూర్తి
- 14 రోజుల పాటు క్లాసుల నిర్వహణ
- ధ్రువీకరణ పత్రాలు అందజేసిన సీఎండీ



రెస్క్యూ టీంలో శిక్షణ పూర్తిచేసుకొని సర్టిఫికెట్లు తీసుకున్న 13 మంది మహిళలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ తన 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ బృందాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కంపెనీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిరుడు ఉద్యోగాల్లో చేరిన 13 మంది యువతులకు పెద్దపల్లి యైటింక్లయిన్ కాలనీలో 14 రోజులపాటు కఠోర శిక్షణిచ్చింది. బొగ్గు గనుల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడ ఊపిరాడని పరిస్థితిలో చిక్కుకుపోయే కార్మికులను బయటకు తీసుకురావడం, వారికి సీపీఆర్ చేయడం, ప్రాథమిక చికిత్స అందించడం, తదితర అంశాలపై యువతులకు శిక్షణనిచ్చారు. శనివారం వారికి హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలను అందజేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థానాల్లో జరిగే రెస్క్యూ పోటీల్లో కూడా పాల్గొని సింగరేణికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. తమకు లభించిన శిక్షణపై బృందంలోని యువతులు సంతృప్తి వ్యక్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొనాలనే ఆసక్తితోనే తాము శిక్షణ పొందామని, అందులో భాగంగా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న వారిని బ్రీతింగ్ ఆపరేటర్స్‌తో ఎలా కాపాడాలో నేర్చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో వారు ప్రత్యేకంగా మాట్లాడారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి

పుట్టి పెరిగింది ఖమ్మం జిల్లా ఇల్లందు మైనింగ్ ప్రాంతంలోనే బీటెక్ పూర్తిచేసి టీసీఎస్‌లో మూడేళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాను. ఏదో కొత్తగా చేయాలనే సంకల్పంతో నిరుడు సింగరేణిలో చేరాను. మైనింగ్ అంటే అబ్బాయిలు మాత్రమే చేయగలరని కొంతమంది అంటుంటే విని..మేమూ ఎందులో తక్కువ కాదని అనిపించేది. సింగరేణి రెస్క్యూ బృందంలోచేరి ప్రమాదంలో ఉన్నవాళ్లను ఎలా రక్షించాలో తెలుసుకున్నాను.

-షేక్ ఆసియా బేగం, ఇల్లందు, ఖమ్మం

ఇతరులకు సాయం చేసే లక్ష్యంతోనే..

నా చిన్నతనం నుంచి ఇతరులకు సాయం చేయడం అలవాటు. అయితే ప్రమాదంలో ఉన్న వారిని రక్షించాలంటే ముందుగా మనం ఆ ప్రమాదంలో పడకుండా ఉండటం, వారిని రక్షించి, బయటపడటం ఎలానో తెలిసి ఉండాలి. సింగరేణి మొదటిసారిగా మహిళలతో రెస్క్యూ బృందాలు ఏర్పాటుచేస్తుందని తెలియగానే బృందంలో చేరాను.

-చందనా జవేరి, గూడూరు, మహబూబాబాద్

కఠిన శిక్షణలో ధైర్యంగా యువతులు

ఇప్పటి వరకు ప్రైవేట్ కంపెనీలకు చెందిన మహిళా ఉద్యోగులకు రెస్క్యూ ఆపరేషన్స్‌పై శిక్షణ అందించాం. మొదటిసారి సింగరేణిలో 58 మంది మహిళలను ఎంపిక చేసి వారిలో 36 మందిని రెస్క్యూ బృందంలో శిక్షణ కల్పిస్తాం. మొదటి బ్యాచ్‌లో 13 మంది మహిళలకు 15 రోజుల పాటు బ్రీతింగ్ అపరేషన్స్, లిఫ్టింగ్ బ్యాగ్, హైడ్రాలిక్ స్ప్రెడర్స్, రోప్ రెస్క్యూలపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించాం. పెద్దపల్లిలోని ఐటీ ఇన్‌క్లైన్ కాలనీలో రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన కఠినమైన శిక్షణలో మహిళలు ఎంతో ధైర్యంగా పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్నారు.

-మోదం తిరుపతి, రెస్క్యూ ఇన్‌స్పెక్టర్

సవాలుగా తీసుకొని పనిచేయడం ఇష్టం

మైనింగ్‌లో మహిళలూ పనిచేయగలరని చాటేందుకే నేను దీన్నో సవాలుగా తీసుకొని సింగరేణి ఉద్యోగంలో చేరాను. 2019లో బీటెక్ మైనింగ్ పాసై ఐదేళ్లు ప్రైవేట్ కంపెనీలో పనిచేశాను. గత ఏడాది సింగరేణిలో ఉద్యోగంలో చేరాను. ప్రమాదంలో పనిచేయడం ఎంత కష్టమో ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడమూ అంతే కష్టం. రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉంటా.

-సీహెచ్ రమ్య, సోమాపల్లి, కొత్తగూడెం

తొలి త్రైమాసికంలో వందశాతం బొగ్గు రవాణా: ఎన్.బలరామ్

ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బొగ్గు రవాణాలో 100 శాతం, బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అన్ని ఏరియాల్లోని జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ జూలై నెలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని ఆదేశించారు. కొత్తగూడెంలో అన్ని అనుమతులు మంజూరైన వీకే ఓపెన్ కాస్ట్ గని భూమిపూజ ఈ నెలాఖరులో నిర్వహించాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ OC / కులపట్టింపులేదు / 44y / 5'5"/ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ / బెంగళూరు వధువుకి Engineer, Doctor / వృత్తిపరమైన వరుడు కావలెను. డైరెక్ట్ : 9182734077 AJH-16209

★ పద్మశాలి / విడో / Govt. 2nd మ్యారేజ్ / కుల ఆస్తి పట్టింపు లేదు / వయస్సు:45, కలర్ : తెలుపు / సొంత వ్యాపారము కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 8125076013 AJH-003322

★ చౌదరి / 2nd మ్యారేజ్ /ఫెయిర్ / 43 సం.లు / 5'5" / డాక్టర్ కార్డియాలజిస్ట్ / మంచి ఆస్తి గల అందమైన వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. ఓన్లీ కమ్మాస్ వాట్సప్: 9052817697 AJH-003271

★ రెడ్డి / విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / AGE 35 / B.Com / Own Business గల అందమయిన వధువుకి వరుడు కావలెను. అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. ఫోన్: 7207510801 AJH-003271

★ కుల పట్టింపు లేదు/ విడో / 40 yrs / విజయవాడ / Govt. Employee / Own House / Agriculture Lands / పిల్లలు లేని అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్:9581155315 AJH-003323

★ కుల ఆస్తి ప్రసక్తి లేదు/ విడో / 45 yrs / ఆంధ్రప్రదేశ్ / Family Pensioner / One Girl Settled / Own House / Well Settled / అందమైన వధువుకి వరుడు కావలెను. ఆంధ్ర - తెలంగాణ ఒకే క్రైస్తవ సంబంధం కుదుర్చబడును. పీటింగ్ పెళ్లిలదును. ఫోన్:8374476725 AJH-003323

★ కుల పట్టింపులేదు/ 45y/ విడో / ఆంధ్ర / గైనకాలజిస్ట్ / మంచి జీతం / ఆస్తి ప్రసక్తి లేదు / పిల్లలు లేరు / వైజాగ్, ఏలూరు, విజయవాడ ప్రాధాన్యత. అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:7075948409 AJH-003323

★ కుల పట్టింపులేదు/ 50y/ విడో / ఆంధ్ర / బ్యాంక్ మేనేజర్ / మంచి జీతం / పిల్లలు లేరు / సొంత ఇల్లు / ల్యాండ్స్ / అందమైన వధువుకు వరుడు కావలెను.ఫోన్:9989350417 AJH-003323

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు /35y/ 5'5" / ఫెయిర్ / హోమియోపతి డాక్టర్ / ఓన్ క్లినిక్ / మంచి ల్యాండ్ / ఓన్ అపార్ట్‌మెంట్ / వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. అర్జెంట్ వాట్సాప్: 9133419844 AJH-003271

★ చౌదరి / లేట్ మ్యారేజ్ / 42y/5'5"/ ఫెయిర్ / రేడియాలజిస్ట్ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 9052817697 AJH-003271

★ బలిజ (శెట్టిబలిజ, లింగబలిజ, లింగాయతులు) 25 to 35 సం.లు / ఉన్న అమ్మాయిలకి సొంత ఇల్లు ఉన్న అమ్మాయిలకి ఏదైనా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003324

★ నాయి బ్రాహ్మిణ్స్ 10 to డిగ్రీ చదువు. వయసు 25 to 35 సం.లు / టైలరింగ్, టీచర్‌గా చేస్తున్న అమ్మాయిలకి వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003324

★ ఆచారులు (విశ్వబ్రాహ్మిణ్స్) 10 to డిగ్రీ సొంత ఇల్లు / ఫాదర్ గోల్డ్ వర్క్స్ / కార్పెంటర్ వర్క్, బ్రదర్ మ్యారీడ్‌గా ఉన్న అమ్మాయికి వరుడు కావలెను ఫోన్:6309546649 AJH-003325

★ రాజులు (సూర్యవంశం, చంద్రవంశం, భట్‌రాజులు) 1st మ్యారేజ్ 26 to 37 సం.లు . అలాగే రెండవ మ్యారేజ్ 35 to 50 సం.ల వారికి వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003325

★ దేవాంగులు, పద్మశాలి వయసు: 25 to 32 సం.లు . 10 to డిగ్రీ ఉన్న అమ్మాయిలకి ఆంధ్ర, తెలంగాణ సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003325

★ ఆర్య వైశ్య, కళింగ వైశ్య వయసు: 25 to 32 సం.లు . అలాగే రెండవ పెళ్లి 30 to 50 సం.రాలు. ఉన్న వారికి ఆంధ్ర, తెలంగాణ వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003325

★ 53y / రెండవ పెళ్లి / విడో /Fair / Govt Job /పిల్లలు లేరు/సొంత ఇల్లు రెంట్స్, ప్రాపర్టీ / ఏలాంటి బాదరాబందీ లేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్:7995376608 AJH-16209

★ 62y / రెండవ పెళ్లి / విడో /Fair / Govt Rtd /పిల్లలు లేరు/సొంత ఇల్లు రెంట్స్, వ్యవసాయభూములు / ఏలాంటి బాదరాబందీ లేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్:9030858258 AJH-16209

★ మున్నూరుకాపు / 26 సం.లు / 1st మ్యారేజ్ / డిగ్రీ / సొంత ఇల్లు / బ్రదర్ మ్యారీడ్‌గా ఉన్న అమ్మాయికి సాంప్రదాయ కుటుంబ వరుడు కావలెను. ఫోన్:6309546649 AJH-003324

★ రెడ్డి / వయసు 25 to 35 సం.లు / మొదటి సంబంధం / రెండవ సంబంధం / ఫాదర్ ఫార్మర్ / సొంత ఇల్లు ఉన్న అమ్మాయిలకి వరులు కావలెను. ఫోన్:6309546649 AJH-003324

★ ఆర్యవైశ్య / 22y & 24y & 26y & 28y & 30y & 32y & 33y & 34y & 36y & 37y & 38y & 39y & 40y & 42y & 44y & 46y & 49 & 51y & 52y & 54y & 55y & 56y & 58y & 59y / కే. సుప్రజా గుప్తా "మానస" (Since 1998) : PH: 9291503949 AJH-16209

★ రెడ్డి / 2nd (విడో) కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ 32y, Degree / బిజినెస్ గల అందమయిన వధువుకి వరుడు కావలెను / అన్ని కులాల వారికి 1వ లేదా 2వ సంబంధములు మా వద్ద కలవు. ఫోన్:9121516873 AJH-16208

★ 2వ పెళ్ళి, 44y, MCA, MNC Employee పిల్లలు లేని అందమైన వధువుకి సెటిల్డ్ వరుడు కావలెను. Any FC / BC Only. Ph: 9848023736 AJH-16208

★ రెడ్డి విడో 35y, డిగ్రీ 8 ఎకరాల పొలం సొంత ఇల్లు కలిగి పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. (ఆస్తి కుల పట్టింపు లేదు) మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. ఫోన్: 8142060040 AJH-16208

★ రెడ్డి 2nd మ్యారేజ్, కుల-ఆస్తి ప్రసక్తి లేదు. 30y, Own Business & Properties గల అందమైన వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల & కులాల వారికి 1st లేదా 2 వ సంబంధాలు కలవు. ఫోన్: 9059507176 AJH-16208

★ కుల పట్టింపు లేదు / విడో / 57 Y / Govt. Employee, Own Business / ఓన్ హాస్పిటల్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 90632 55443 AJB-219

★ మాల క్రిస్టియన్ సెకండ్ మ్యారేజ్ వయస్సు 34సం॥ ఎత్తు 5/3 చదువు B.Tech, సాఫ్ట్‌వేర్ నెలకు లక్షరూపాయల జీతం వధువుకు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ వరుడు కావలెను. క్రిస్టియన్ సెకండ్ మ్యారేజ్ సంబంధాలు చూడబడును. సెల్: 7794911019 AJD-229664

★ శిరీష, డిగ్రీ, 24Y, 5'3", O.C, ప్రైవేట్ జాబ్, కుల పట్టింపు లేదు. శ్రీమ్యారేజ్ లింక్స్, కొత్త సత్యవాణీ, తెనాలి. సంప్రదించండి సెల్ : 63099 26003 AJG-239284

వధువు కావలెను



★ 40 సంవత్సరాల వరుడికి రెంట్స్, ప్రాపర్టీ గల వరుడికి మంచి స్థిరాస్తి కలిగిన వధువు కావలెను. పెన్షనర్స్, బిజినెస్, డైవర్స్, అన్ని సంబంధాలు కలవు. ఉచిత ఫ్రీ సర్వీస్. కాల్ మ్యాట్రిమోని 6281147818 AJH-003322

★ దూదేకుల unmarried ప్రాపర్ వరంగల్ /31y/5'6"/ స్వంత ఇల్లు ప్రాపర్టీస్ బిజినెస్ వరునికి వధువు కావలెను. Caste No Bar (except SC) కట్నం ప్రసక్తి లేదు. Self: 9494357697 AJH-003322

★ కె. శ్రీకృష్ణన్ (రాఘవన్) 36 సం. అయ్యర్. కౌశిక గోత్రం. ఉత్తరాషాడ నక్షత్రం. మీన రాశి. కన్యాలగ్నం. చెన్నై గాయత్రి వేద పాఠశాల టీచర్. మంచి జీతం. Mob: 98411 72098, Email ID: srikrishnan.raghav@gmail.com AJI-3523

★ డైరెక్ట్ - Plz be honest" / 42y / Divorced / Fair & Slim / 5'5' / Orphan / ఆస్తులు / అప్పులు లేవు... "WANT Age 32-36 / Slim / Widow Prefer. / No Caste / Rich Family only /సంప్ర: 7997-807-507 AJH-003322

★ కులం (SC) / 32 Y / సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డైవర్స్, సొంత ఇల్లు, ఫ్యామిలీ వెల్‌సెటిల్డ్, అందమైన వరుడికి సాంప్రదాయమైన వధువు కావలెను. కుల పట్టింపు లేదు. సంప్ర. 63053 48117 AJB-220

★ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి, వయస్సు 51, డైవర్స్ No Cast డబుల్ M.A, No చిల్డ్రన్ గల వరునికి వధువు కావలెను. సంప్ర. సెల్ : 81860 68691 AJB-235547

★ కమ్మ, 38Y, 5'5", BE, M.S, USA, MNC కంపెనీలో మంచి సంపాదన కలిగి జాబ్ చేస్తున్న సంపన్న కుటుంబ వరునకు కట్నం ప్రసక్తి లేని వధువు కావలెను. 63034 33873. AJG-239286

కళ్యాణ వేదిక

★ Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas, Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003270

★ Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas, Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003270

★ Divorcee & Widows పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas, Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003270

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ ★ Srinivas. Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-003270

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE/ Govt. / Doctors/ MNC/ Matches/ Late & 2nd Matchesకై సంప్ర: Ph: 9704656103/ 9533608887 (Whatsapp) AJH-16209

★ కమ్మ, చౌదరి, రెడ్డి మ్యారేజ్ బ్యూరో/ హైరేంజ్ / హైస్టేటస్ / Engineers & Doctors / ఇండియా మరియు అబ్రాడ్, లేట్, 1st & 2nd. సంప్ర : 9394002999 AJH-16209

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506 / 9705588313 AJH-003219

★ స్వాతి పరిణయ మ్యారేజ్ బ్యూరో / కేవలం కమ్మ/చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. దండమూడి శ్రీనాథ్. ఫోన్ : 8019658575 / Whatsapp 8019658575 AJH-003221

★ సెకండ్ మ్యారేజీలకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 AJH-16209

★ కాపు / మున్నూరుకాపులకు మాత్రమే మధ్యతరగతి నుండి 100 కోట్లు (రిచ్) వధూవరుల దేశ విదేశీ సంబంధాలు చూడబడును. అజయ్ మున్నూరుకాపు, మలక్‌పేట్, హైదరాబాద్. ఫోన్:9866211222. AJH-16209

★ వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 13-07-2025 వ తేదీ ఉ. 10 గం.లకు 67వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గం.లకు 22 వ పునర్వివాహ పరిచయ వేదిక విజయవాడ K.B.N. కాలేజీలో జరుగును. 99895 00130, 81064 54284. AJB-334

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగినసంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380,
9985921386,
9703618806.

శ్రీశైలానికి పోటెత్తిన వరద

ప్రాజెక్టుకు 1.75 లక్షల క్యూసెక్కులు

- జూరాలకు 1.20లక్షలు, తుంగభద్రకు 72వేల క్యూసెక్కులు
- వారంలో గోదావరికి భారీగా వరద: సీడబ్ల్యూసీ

హైదరాబాద్/ధరూర్/దోమలపెంట/మహాదేవపూర్ రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తుతోంది. శనివారం ఏకంగా 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. దాంతో ప్రాజెక్టు కుడి, ఎడమ జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేసి.. 67 వేల క్యూసెక్కులను వదిలిపెడుతున్నారు. శ్రీశైలం సామర్థ్యం 215.81 టీఎంసీలకు ప్రాజెక్టులో ప్రస్తుతం 173.47 టీఎంసీలున్నాయి. అయితే ప్రాజెక్టు గ్రేట్ల నుంచి నీరు లీక్ అవుతుండటం గమనార్హం. నెల క్రితమే అధికారులు మరమ్మతులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. 10వ గేటు నుంచి భారీగా.. 5, 6 గేట్ల నుంచి స్వల్పంగా నీరు లీకవుతోంది. ఇక దిగవనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 55 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 312.05 టీఎంసీలకు ప్రస్తుతం 156.86 టీఎంసీల నిల్వ ఉంది. జూరాల ప్రాజెక్టుకు 1.20 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా.. 1.24 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లు, జలవిద్యుదుత్పత్తి కోసం 65 వేల క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 5,477 క్యూసెక్కులు, మేడిగడ్డ బ్యారేజీకి 76,600 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. గోదావరి ప్రాజెక్టులకు వారం రోజుల్లో భారీ వరద వచ్చి చేరే అవకాశముందని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ప్రకటించింది. కాగా, ప్రాజెక్టుల నుంచి సాగు నీటి విడుదల విషయమై ఈనెల 11న ఈఎన్‌సీ(జనరల్) అంజద్ హుస్సేన్ అధ్యక్షతన స్కైవమ్ (రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ) సమావేశం జరగనుంది. దీనికోసం ఏయే ప్రాజెక్టుల్లో ఎంత నిల్వలున్నాయి? అందులో తాగునీటి అవసరాలకెంత? సాగునీటి అవసరాలకెంత? అనే వివరాలను క్షేత్రస్థాయి అధికారుల నుంచి సేకరిస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

- కాంగ్రెస్ సభకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- ఉత్తమ్ నివాళి.. రూ.10 లక్షల పరిహారం ప్రకటన


కుర్రి శ్రీను (ఫైల్)

కట్టంగూరు/మఠంపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభకు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ కార్యకర్త మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం తండాకు చెందిన 8 మంది హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ సభకు వెళ్లారు. సమావేశం పూర్తయిన తర్వాత కారులో తిరుగుపయనమయ్యారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పామనగుండ్ల వద్ద వెనుక మరో కారులో వస్తున్న కార్యకర్తల కోసం వీరు ప్రయాణిస్తున్న కారును రోడ్డు పక్కన ఆపారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన ఉన్న కాల్వలోకి పల్టీ కొట్టింది. కారులో ఉన్న కుర్రి శ్రీను(38)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఆరుగురికి స్వల్పగాయాలు, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, నల్లగొండ జిల్లా నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో శ్రీను మృతదేహానికి మంత్రి ఉత్తమ్ నివాళులర్పించారు. శ్రీను కుటుంబానికి రూ.10లక్షలు ఇస్తామని ప్రకటించారు. రూ.5లక్షలు వెంటనే ఇచ్చారు. శ్రీను భార్యకు ఉద్యోగం, ఆయన పిల్లల చదువుకు సహకారం అందిస్తామని చెప్పారు. కుర్రి శ్రీను మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వందా.. వాని బొందా!?



(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో పూర్తయిన నియామకాలకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి తానే చేసినా అని రేవంత్ రెడ్డి గప్పాలు కొట్టుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "రైతులకు ఎవరెవరు ఏం చేశారో చర్చిద్దామన్న రేవంత్ రెడ్డి చాలెంజ్‌ను స్వీకరిస్తున్నా. రేవంత్‌కు 72 గంటల ప్రిపరేషన్ టైం ఇస్తున్నా. 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వస్తా. నీవు కూడా నీ ఎమ్మెల్యేలతో కలిసి రా.. మీడియా ముందే చర్చిద్దాం" అని సవాలు విసిరారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాను సరిపోతానని అన్నారు. బనకచర్ల పేరుతో ఆంధ్రకు నీళ్లు పంపుతున్నారని, నిధులను ఢిల్లీకి పంపుతున్నారని, ఆయన తొత్తులు కొంతమందికి నియామకాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఎరువులను పంచడం కూడా చేతగాని రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌లాంటి నాయకుడితో చర్చకు సిద్ధపడితే జనం నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. ఇవాళ తెలంగాణవ్యాప్తంగా ఎరువులు, విత్తనాల కోసం రైతులు యుద్ధమే చేయాల్సి వస్తోందని, ప్రతి మండలంలో రైతులు ఎరువులు, యూరియా కోసం ధర్నాలు చేస్తున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ పాత రోజులు తీసుకొస్తామని అన్నారని, నిజంగానే ఆ పాత దుర్దినాలను రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. కరోనా సమయంలో దేశమంతా అతలాకుతలమవుతుంటే 7500 ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెట్టి చివరి గింజ వరకు కొని రైతుల కడుపును కేసీఆర్ నింపారని, ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతో ఇవాళ మార్కెట్ యార్డులకు వచ్చిన ధాన్యాన్ని కొనకుండా పారిపోతున్నది రేవంత్ ప్రభుత్వమని మండిపడ్డారు. "రైతు భరోసాలో 39 వేల కోట్లు, రుణమాఫీలో రూ.38 వేల కోట్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎగ్గొట్టింది. నాట్లు వేసేటప్పుడు కేసీఆర్ రైతుబంధు ఇస్తే.. ఓట్లు వేసేటప్పుడు మాత్రమే రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇస్తున్నాడు. కోటీశ్వరులను చేస్తానన్న మాటల్ని ఆడబిడ్డలు నమ్మడం లేదు. నెలకు తమకి ఇస్తామన్న రూ.2500 ఎప్పుడు ఇస్తావో చెప్పాలని నిలదీస్తున్నారు. తమకి ఇస్తానన్న స్కూటీ ఏమైందని మా చెల్లెళ్లు ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగ భృతి ఏమైందని తమ్ముళ్లు అడుగుతున్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు నింపుతానన్న మాట ఎప్పుడు నిలబెట్టుకుంటావని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. సంపూర్ణ రుణమాఫీ ఎప్పుడు చేస్తావు? ఎకరాకు 15,000 రైతు భరోసా ఎప్పుడు ఇస్తావోనని రైతులు ఎదురు చూస్తున్నారు" అని నిలదీశారు. ఇవాళ తెలంగాణలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదని, రేవంత్ రెడ్డి, ఆయన తొట్టి గ్యాంగ్ మాత్రమే సంతోషంగా ఉందని, దండుపాళ్యం ముఠాలా ఏర్పడి బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. "ఒక్క కొత్త స్కీము అమలు చేయలేదు. ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు. కానీ, అప్పు మాత్రం రెండు లక్షల కోట్లకు చేరింది. ఈ పైసలన్నీ ఎక్కడికి పోతున్నాయి? రాహుల్ గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ ఖాతాల్లో టకీ టకీమని డబ్బులు పడుతున్నాయా?" అని నిలదీశారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ చిత్తశుద్ధి లేని శివ పూజ లాంటిదని తాము ఎప్పుడో చెప్పామని దుయ్యబట్టారు. తొమ్మిదేళ్లలో సుమారు 9 బిలియన్ డాలర్ల(సుమారు రూ.72 వేల కోట్లు)ను నేరుగా రైతుల ఖాతాల్లో వేశామని మొన్న ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో చెబితే అక్కడున్న ప్రొఫెసర్లు, మేధావులు ఆశ్చర్యపోయారని చెప్పారు.

ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం ఇస్తాం

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల్లా వచ్చి.. రూ.50 లక్షలతో ఉడాయించిన ముఠా

చాదర్‌ఘాట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మీ ట్రస్ట్‌కు రూ.కోటి విరాళమిప్పిస్తామని ఓ ట్రస్టు నిర్వాహకుడిని బురిడీ కొట్టించిన మోసగాళ్లు రూ.50 లక్షలు కొట్టేశారు. మలక్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన రాళ్లబండి విజయ్‌కుమార్ ఆరేళ్లుగా సేవారథ్ విజయ్‌పథ్ ట్రస్టును నిర్వహిస్తున్నారు. మూణ్నెల్ల క్రితం లక్డీకాపూల్‌లో అశోక్‌గౌడ్ అనే వ్యక్తి ఈయనకు పరిచయమయ్యారు. ఆ తర్వాత తన స్నేహితులు రవీందర్, మోహన్ రెడ్డి, శ్రీకాంత్, శైలుసోనులను విజయ్‌కుమార్‌కు పరిచయం చేశారు. తాము పనిచేసే కార్పొరేట్ కంపెనీ ద్వారా ట్రస్టుకు నిధులు ఇప్పిస్తామని వీరంతా నమ్మబలికారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద రూ.కోటి ఇప్పిస్తే.. రూ.50 లక్షలను కమీషన్‌గా ఇవ్వాలని సూచించారు. నమ్మిన విజయ్‌కుమార్ రూ.50 లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. దాంతో ఈ ముఠా రూ.50 లక్షల నగదు ఇవ్వగానే.. సీఎస్ఆర్ ఫండ్‌ను విడుదల చేస్తామని చెప్పారు. దాంతో విజయ్‌కుమార్ సలీంనగర్‌లోని తన సోదరుడి ఇంటికి రావాలని సూచించారు. రూ.50 లక్షల బ్యాగును వారికి చూపించారు. దుండగులు సైతం రూ.కోటి బదిలీ అయినట్లు ల్యాప్‌టాప్‌లో ఫేక్ స్క్రీన్‌షాట్ చూపించారు. విజయ్‌కుమార్ వీరికి రూ.50 లక్షలు ఇవ్వగానే.. ఈ ముఠాకు చెందిన నవీన్, సోను, మరో వ్యక్తి తమను తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులుగా చెప్పుకొంటూ రంగ ప్రవేశం చేశారు. రూ.50 లక్షలు, ఈ ముఠా సభ్యులను తమ వాహనంలో ఎక్కించుకుని, ఉడాయించారు. మోసపోయినట్లు గుర్తించిన విజయ్‌కుమార్.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓఈసీడీ సదస్సుకు కేంద్రం అనుమతి వద్దా?

- అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ రాష్ట్రానికి కేంద్ర సర్కారు లేఖ

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని స్టార్ హోటల్‌లో జూన్‌లో రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్)వార్షిక సదస్సుపై కేంద్ర వ్యవసాయశాఖ అసంతృప్తి వ్యక్తంచేసింది. పథకాల పర్యవేక్షణ చేసే నియమిత జాతీయ సంస్థ(నేషనల్ డిసిగ్నేటెడ్ అథారిటీ- ఎన్‌డీఏ), కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖను ఓఈసీడీ సంప్రదించకపోవటంపై అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ రాజేశ్ సింగ్ ఈనెల 2న రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌తోపాటు వ్యవసాయశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. అంతర్జాతీయ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నపుడు కేంద్రం అనుమతి ఎందుకు తీసుకోలేదు? విదేశీ ప్రతినిధులను ఆహ్వానించినపుడు విదేశాంగ శాఖ అంగీకారం ఎందుకు తీసుకోలేదు? కేంద్ర వ్యవసాయశాఖను ఎందుకు సంప్రదించలేదు? అని ప్రశ్నించారు. ఈ సదస్సుకు ఆమోదం తెలిపిన అధికారుల వివరాలు, కేంద్రాన్ని సంప్రదించకపోవటానికి గల కారణాలు? సమావేశం ఫలితాలు, కీలక చర్చలపై నివేదిక పంపించాలని కోరారు. ఓఈసీడీ అనేది ప్రైవేటు సంస్థ. దేశంలో ఎక్కడైనా ఈ సదస్సు నిర్వహించాలంటే కేంద్రం అనుమతి తీసుకోవాలి. అయితే రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ ప్రతిపాదన మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి ఓఈసీడీకి నేరుగా లేఖ రాశారు. హైదరాబాద్‌లోని స్టార్ హోటల్‌లో జూన్ 8 నుంచి 13 వరకు సదస్సు నిర్వహించారు. అయితే కేంద్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులెవరూ ఈ సదస్సుకు హాజరుకాలేదు. ప్రైవేటు సంస్థ వార్షిక సదస్సుకు సుమారు రూ.40లక్షల రాష్ట్ర ప్రభుత్వ సొమ్మును ఖర్చు పెట్టినట్లు సమాచారం. సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ ఆధ్వర్యంలోనే ఇదంతా జరిగినట్లు తెలిసింది. ఒకవైపు రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంటే.. నూజివీడు, కావేరి, హైటెక్, రాశిసీడ్స్ లాంటి పెద్ద విత్తన కంపెనీల ప్రతినిధులను భాగస్వాములను చేసి ఈ సదస్సు ఎందుకు నిర్వహించారనే ఆరోపణలు కూడా వచ్చాయి.


బోనాలు ఎత్తుకున్న మహిళలు

బహ్రెయిన్‌లో వైభవంగా బోనాలు

- ఆకట్టుకొన్న పోతరాజులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బోనాల పండుగ ఉత్సవాలు ఒక్క జంట నగరాలకే పరిమితం కాలేదు. ఎల్లలు దాటి గల్ఫ్ అరేబియా దేశాలకు కూడా వ్యాపించాయి. బహ్రెయిన్‌లో శుక్రవారం తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో జరిగిన బోనాల పండుగలో పోతరాజులు, పెద్దపులులు, ఘటాల ఊరేగింపులు, తెలంగాణ డప్పు వాయిద్యాలు, జానపద కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించగా బాలికలు, మహిళలు కలిసి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకొన్నాయి. కాకినాడకు చెందిన శ్రీరాం బృందం చేసిన పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్థానిక సంస్థల ప్రతినిధుల సమాచారం రేపటిలోగా పంపండి

- జెడ్పీ సీఈవోలు, డీపీవోలకు రాష్ట్ర సర్కారు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలైన జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీల తాజా మాజీ ప్రజాప్రతినిధుల వివరాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్ ప్రధాన కార్య నిర్వహణాధికారులు (సీఈవో), జిల్లా పంచాయతీ అధికారుల(డీపీవో)కు శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. తాజా మాజీ వార్డు సభ్యుడు, సర్పంచి నుంచి మొదలుకొని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతోపాటు జెడ్పీచైర్మన్, జెడ్పీటీసీ సభ్యుల కులం, ఉపకులం, పార్టీ తదితర వివరాలు పంపాలని పేర్కొంది. ప్రణాళిక శాఖ అభ్యర్థన మేరకు ఈ సమాచారాన్ని సేకరిస్తున్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఈఈఈపీసీ) సర్వే -2024 డేటాను విశ్లేషించడానికి ప్రభుత్వం ఒక స్వతంత్ర నిపుణుల కార్యనిర్వాహక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందానికి అవసరమైన సమాచారం కోసమే ప్రణాళిక శాఖ ఈ వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 7లోగా సమాచారాన్ని తమ కార్యాలయానికి పంపాలని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఆదేశించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏలేటికి సిట్ సమన్లు

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి సిట్ అధికారులు శుక్రవారం రాత్రి నోటీసు జారీ చేశారు. శనివారం విచారణకు హాజరుకావాలని సూచించారు. అయితే బీజేపీ నూతన అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం ఉన్నందున రాలేనని ఆయన సమాధానం ఇచ్చారు. దీంతో వచ్చే వారం బుధ లేదా శుక్రవారాల్లో విచారణకు రావాలంటూ సమన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి 230కిపైగా బాధితుల వాంగ్మూలాలను సిట్ అధికారులు నమోదు చేశారు.

GHMC
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సంక్షిప్త NIT నం. 19/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేది:05.07.2025
పనుల సంఖ్య: మొత్తం 03 పనులు, అంచనా మొత్తం: రూ.358.60 లక్షలు, బిడ్ల స్వీకరణకు ప్రారంభ /ఆఖరి తేదీ మరియు సమయం:- బిడ్ల దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం: 08.07.2025న మ.01.00 గం.లకు, బిడ్ల దాఖలుకు ముగింపు తేదీ & సమయం: 14.07.2025న మ.01.00 గం.లకు. అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం.:SE, Secbad జోన్, GHMC, ఫోన్: 9963550657. తదుపరి వివరాల కొరకు https://www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్.GHMC
DIPR RO No.4676-PP/CL/ADVT/1/2025-26,Dt.05.07.2025

పీర్జాదిగూడ పురపాలక సంస్థ కార్యాలయం
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

1. Lr.No.E1/PMC/2714 & 681/2025-26, తేది:05.07.2025, 2. పనుల సంఖ్య: 2 పనులు 3) అంచనా వ్యయం: రూ.70.00 లక్షలు, 4) బిడ్ దాఖలు ప్రారంభ తేది: 05.07.2025న సా.04.30 గం.లకు, 5) బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 09.07.2025న సా.4.30 గం.వరకు, 6) బిడ్లు తెరచుట: 09.07.2025న సా.4.30 గం.కు, 7) తదుపరి వివరాల కొరకు సంప్రదించగలరు: 7337557261, 9000631586 & 7331164066, మరియు http://tender.eprocurement.gov.inను చూడగలరు.
సం/- కమిషనర్, పీర్జాదిగూడ పురపాలక సంస్థ
DIPR RO No.4645-PP/CL/ADVT/1/2024-25, తేది:05.07.2025

IRCTC
ఇండియన్ రైల్వే కేటరింగ్ & టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ - నవరత్న)
CIN: L74899DL1999GOI101707
బహిరంగ ఇ-టెండరు కోరుతూ ప్రకటన
IRCTC - సౌత్ సెంట్రల్ జోన్ దిగువ తెలిపిన బహిరంగ ఇ-టెండర్లు కోరుతోంది:-

యూనిట్లు	వివరాలు	దాఖలుకు చివరి తేది
జన్ ఆహార్	గుంతకల్ రైల్వే స్టేషన్ వద్ద ఐదు సంవత్సరాల కాలవ్యవధి కొరకు జన్ ఆహార్ ద్వారా కేటరింగ్ సర్వీసులను ఏర్పాటు కోసం బహిరంగ ఇ-టెండరు సహిత ఇ-వేలం.	04.08.2025 15:00 గం. వరకు
రిఫ్రెష్‌మెంట్ రూమ్స్	కాజీపేట, కర్నూలు టౌన్, సంబల్‌పూర్, కడప, రేణిగుంట మరియు ఏలూరు రైల్వే స్టేషన్ల వద్ద ఐదు సంవత్సరాల కాలవ్యవధి కొరకు రిఫ్రెష్‌మెంట్ రూమ్స్ ద్వారా కేటరింగ్ సర్వీసులను ఏర్పాటు కోసం బహిరంగ ఇ-టెండరు సహిత ఇ-వేలం.	04.08.2025 15:00 గం. వరకు
ఫుడ్ ప్లాజా	షాడోల్ రైల్వే స్టేషన్ వద్ద తొమ్మిది సంవత్సరాల కాలవ్యవధి కొరకు ఫుడ్ ప్లాజా నెలకొల్పుట, ఆపరేషన్ మరియు మేనేజ్‌మెంట్ కోసం బహిరంగ ఇ-టెండరు సహిత ఇ-వేలం.	04.08.2025 15:00 గం. వరకు
ఫాస్ట్‌ఫుడ్ యూనిట్లు	బ్రజ్‌రాజ్‌నగర్, అంబికాపూర్, ఉమరియా, మచిలీపట్నం, గుడివాడ, బాలా రోడ్డు, మహబూబ్‌నగర్, అనుప్పూర్ (ప్ర.ఎఫ్.నం.1), అనుప్పూర్ (ప్ర.ఎఫ్.నం.3/4), డోంగర్‌గఢ్, బాలాఘాట్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇత్వారి, ఉసలాపూర్ & అంగుల్ రైల్వే స్టేషన్ల వద్ద ఐదు సంవత్సరాల కాలవ్యవధి కొరకు ఫాస్ట్‌ఫుడ్ యూనిట్స్ నెలకొల్పుట, ఆపరేషన్ మరియు మేనేజ్‌మెంట్ కోసం బహిరంగ ఇ-టెండరు సహిత ఇ-వేలం.	04.08.2025 15:00 గం. వరకు

టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ & టెండరులో పాల్గొనుట వెబ్‌సైట్:- <www.tenderwizard.com/IRCTC> లో చేయవచ్చును
పైన తెలిపిన ప్రకటనకు ఏదేని సవరణ జారీ చేయబడితే, అది వెబ్‌సైట్ www.irctc.com మరియు www.tenderwizard.com/IRCTC లో మాత్రమే ప్రచురించబడును
కార్యాలయ చిరునామా: IRCTC Ltd., సౌత్ సెంట్రల్ జోన్, #9-1-129/1/102, 1వ అంతస్తు, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్ - 500003
మీ ఆహారాన్ని ఆన్‌లైన్‌లో బుక్ చేయడానికి www.ecatering.irctc.co.in కు లాగాన్ చేయండి లేదా "Food on Track" మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

Form No.3 [See Regulation-15(1)(a)]/ 16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & 1st Floor,31-31-21,Sai Baba Street,Narayana Bhawan, Dabagardens,Visakhapatnam – 530 020..
Case No.: O.A.109 of 2024
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules,1993.
Between
1. BANK OF BARODA.
2. PUNJAB NATIONAL BANK
And
M/s. Mithra Coaches Pvt. Ltd. represented by its Directors and others
To
D9 - Smt. Maganti Saradai, W/o Late Sri Subramanyam aged about 75 years, D.No.: 40-15-8/2,Nandamurivari Street, Brundavan Colony, Labbipet, Vijayawada.
D10 - Smt. Neti Janaki, D/o Late Sri Subramanyam aged about 57 years, D.No.: 40-15-8/2,Nandamurivari Street, Brundavan Colony, Labbipet, Vijayawada
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
WHEREAS, OA/109/2024 was listed before
Hon'ble Presiding Officer/Regisrar on 20-08-2025
WHEREAS this Hon' ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.25,82,76,930/-(application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application, without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 20-08-2025 at 10.30 A.M failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date 30-06-2025.
Sd/- Signature of the Officer
Authorized to issue summons

FOCUS ON EDUCATION













ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఇప్పుడు సాకు దొరికింది కదా అని మీడియాను నిందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఒక వాస్తవాన్ని మరచిపోతున్నారు. గత ఎన్నికల్లో యావత్ తెలంగాణ సమాజం బీఆర్‌ఎస్‌ను మట్టి కరిపించింది. కేసీఆర్ అండ్ కోను తిరస్కరించింది. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయగా ఉండిన ఉత్తర తెలంగాణ– అంటే నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రజలే బీఆర్‌ఎస్‌ను తిరస్కరించారు. ఈ వాస్తవాన్ని గుర్తించడానికి ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు నిరాకరిస్తున్నారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు బండకేసి కొట్టారో తెలుసుకోకుండా మీడియానో, మరొకరినో నిందించడం అవివేకం. బీఆర్‌ఎస్‌ను తెలంగాణ ప్రజలు తిరస్కరించగా, హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఆ పార్టీని ఆదరించి ఆదుకోవడం వాస్తవం కాదా? స్థానికేతరులు కూడా తిరస్కరించి ఉంటే బీఆర్‌ఎస్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు.

తెలంగాణ బీఆర్‌ఎస్ జాగీరా?

ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ అయితే కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ అని 'మహా ప్రస్థానం' పుస్తకానికి రాసిన యోగ్యతాపత్రంలో చలం వ్యాఖ్యానించారు. తమ సొంత బాధల్ని ప్రజలు తమ బాధలుగా భావించాలని కోరుకొనేవాళ్లు రాజకీయాల్లోనూ ఉంటారు. భారత రాష్ట్ర సమితి నాయకుల ఆక్రోశం, ఉక్రోషం ఇందుకు తాజా నిదర్శనం. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే తెలంగాణ సర్వనాశనం అయిపోతోందని, తెలంగాణ అస్తిత్వమే ప్రమాదంలో పడిందని యావత్ తెలంగాణ సమాజం భావించాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని మీడియా సంస్థలకు ఆ పార్టీ నాయకుడు జగదీశ్‌రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. తమ పెద్ద సారు, చిన్న సారుకు కష్టం, నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియాదే అన్నట్టుగా ఆయన చెప్పకనే చెబుతున్నారు. థంబ్ నెయిల్ విషయంలో ఒక న్యూస్ ఛానల్ చేసిన పొరపాటును ఆసరాగా చేసుకొని ఆ ఛానల్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేశారు. సదరు ఛానల్‌పై జరిగిన దాడి శాంపిల్ మాత్రమేనని, మునుముందు మీడియా సంస్థలపై తాము చేయబోయే దాడి ఊహించనంత తీవ్రంగా ఉంటుందని ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. తమ చర్యలను సమర్థించుకొనే క్రమంలో 'ఆంధ్రా మీడియా సంస్థలు' అనే పాతబడిపోయిన వాదనను బీఆర్‌ఎస్ నాయకులు మళ్లీ తెరమీదకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడితే సహించబోమని చెబుతున్నారు. పెద్ద సారు, చిన్న సారుకు వ్యతిరేకంగా మీడియాలో కథనాలు వస్తే తెలంగాణ అస్తిత్వం ఎందుకు, ఎలా ప్రమాదంలో పడుతుందో వారికే తెలియాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలంపాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్‌ఎస్ రాజకీయంగా లాభపడింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదకొండు సంవత్సరాలు దాటింది. ఆంధ్రా, తెలంగాణ అనే భావనను ఉభయ రాష్ట్రాల వారూ మరచిపోయి ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుంది కానీ పెద్ద సారు, చిన్న సారు తప్పులను ఎత్తిచూపితే తెలంగాణ సమాజానికి కలిగే నష్టం ఏమిటో జగదీశ్‌రెడ్డి లాంటి వారే చెప్పాలి.

ఉద్యమంలో 'ఆంధ్రజ్యోతి'...

తెలంగాణ రాష్ట్ర సమితి పురుడు పోసుకోక ముందు, ఆ మాటకొస్తే కేసీఆర్ రాజకీయాల్లోకి రాక ముందు కూడా వారు నిందిస్తున్న మీడియా సంస్థలు తెలంగాణలో ఉన్నాయి. అప్పుడు కేసీఆర్‌కు గానీ, జగన్మోహన్‌రెడ్డికి గానీ సొంత మీడియా సంస్థలు లేవు. వారికి అధికారంతో పాటు సొంత మీడియా బోనస్‌గా లభించింది. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన 'ఆంధ్రజ్యోతి' సంస్థకు ఆ ఉద్యమ ప్రస్థానంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. తెలంగాణ ఏర్పాటు అంశాన్ని పరిశీలించడానికి ఏర్పాటైన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో 'ఆంధ్రజ్యోతిని కట్టడి చేస్తే తెలంగాణ ఉద్యమం చప్పబడిపోతుంది' అని వ్యాఖ్యానించడం నిజం కాదా? రాజకీయ పార్టీలైనా, మీడియా అయినా ప్రజల మనోభావాలకు అనుగుణంగానే వ్యవహరించాలి. లేని పక్షంలో వాటికి మనుగడ ఉండదు. ఈ వాస్తవాన్ని విస్మరించి జగదీశ్‌రెడ్డి వంటి వారు మరోసారి 'ఆంధ్రా' అన్న పదాన్ని అందుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఏ రాజకీయ ప్రయోజనాలకోసం బీఆర్‌ఎస్ నాయకులు ఈ వాదన చేస్తున్నారో తెలుసుకోవడం అవసరం. తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించి ఇప్పుడు భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన ఆ పార్టీ... తనకు తానుగా తెలంగాణ సమాజానికి దూరమైంది. తమది తెలంగాణ ఇంటి పార్టీగా చెప్పుకొన్నవారు ఇప్పుడు ఇంటి పేరు మార్చుకున్నందుకు ఏం చెబుతారు? పార్టీ పేరు మార్చుకోవాలని జగదీశ్‌రెడ్డి అండ్ కో నిందిస్తున్న ఆంధ్రా మీడియా సూచించలేదు కదా? ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిందని ఇదే రాజకీయ నాయకులు చెబుతారు. మెరుగైన అవకాశాల కోసం ఆంధ్రా వారితో పాటు తెలంగాణ వారు కూడా విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ఆయా దేశాల స్థానికులు కూడా ఇలా సంకుచితంగా ఆలోచించడం మొదలు పెడితే అక్కడ మన వాళ్ల పరిస్థితి ఏమిటి? అంతెందుకు... మెరుగైన విద్య కోసం ఇదే జగదీశ్‌రెడ్డి తన కొడుకును లండన్‌లో చదివించడం లేదా? కేటీఆర్ ఒకప్పుడు గుంటూరులో చదువుకోలేదా? తెలంగాణ రాష్ట్ర సమితి నిలదొక్కుకోక ముందు కేటీఆర్, కవితలు అమెరికాలో ఉద్యోగాలు చేయలేదా? అప్పుడు ఎక్కడ ఉంటున్నాం? ఎవరి తిండి తింటున్నాం? అని వారు ఆలోచించారో లేదో జగదీశ్వరరెడ్డి కనుక్కుంటే మంచిది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన వాళ్లు కూడా మెరుగైన అవకాశాలు ఉంటాయనే వచ్చారు. ఆంధ్రా వాళ్లు కూడా ఇలాగే వచ్చి ఉంటారు. తెలంగాణకు వలస వచ్చిన వాళ్లు కష్టపడి సంపాదించుకొని తమ తిండి తాము తింటున్నారు. జగదీశ్‌రెడ్డి వంటి వారు వారికి వంటా వార్పూ చేసి పెట్టడం లేదు కదా? అయినా తెలంగాణ ఎవరి జాగీరు? తెలంగాణ సమాజం భారత రాష్ట్ర సమితికి జీపీఏ ఇవ్వలేదు కదా?

ఓడించింది ఎవరు.. ఆదరించింది ఎవరు?

ఇప్పుడు సాకు దొరికింది కదా అని మీడియాను నిందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఒక వాస్తవాన్ని మరచిపోతున్నారు. గత ఎన్నికల్లో యావత్ తెలంగాణ సమాజం బీఆర్‌ఎస్‌ను మట్టి కరిపించింది. కేసీఆర్ అండ్ కోను తిరస్కరించింది. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయగా ఉండిన ఉత్తర తెలంగాణ– అంటే నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రజలే బీఆర్‌ఎస్‌ను తిరస్కరించారు. ఈ వాస్తవాన్ని గుర్తించడానికి ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు నిరాకరిస్తున్నారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు బండకేసి కొట్టారో తెలుసుకోకుండా మీడియానో, మరొకరినో నిందించడం అవివేకం. బీఆర్‌ఎస్‌ను తెలంగాణ ప్రజలు తిరస్కరించగా, హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఆ పార్టీని ఆదరించి ఆదుకోవడం వాస్తవం కాదా? స్థానికేతరులు కూడా తిరస్కరించి ఉంటే బీఆర్‌ఎస్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. బీఆర్‌ఎస్ నాయకులకు ఇవన్నీ తెలియక కాదు. రాజకీయంగా తాము బలహీనపడుతున్నామన్న అనుమానం కలిగిన సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును భూతంగా చిత్రీకరించడం, ఆ క్రమంలో మీడియాను వివాదాల్లోకి లాగడం బీఆర్‌ఎస్ నేతలకు పరిపాటిగా మారింది. 2018 ఎన్నికల్లో ఈ అస్త్రం ప్రయోగించి రాజకీయంగా లబ్ధి పొందారు. ఇప్పుడు మళ్లీ అదే అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. రాజకీయాలలో ఏ అస్త్రమైనా ఒకేసారి పనిచేస్తుంది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడును ఓడించడానికి కేసీఆర్ తన వంతు సహాయ సహకారాలను జగన్మోహన్‌రెడ్డికి అందించారు. ఇందులో భాగంగా జగన్‌కు ఆర్థిక సహాయం చేయడంతో పాటు చంద్రబాబుకు హైదరాబాద్ నుంచి నిధులు అందకుండా కట్టడి చేశారు. ఈ అనుభవంతో 2023 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పోటీ చేయలేదు. అదే సందర్భంలో, జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా నిలబడిన తెలంగాణలోని టీడీపీ సానుభూతిపరులపై కేటీఆర్ హేళనగా వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ ఎన్నికల్లో తెలుగుదేశం సానుభూతిపరులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. దీంతో కేసీఆర్ అండ్ కో మరింత ఆగ్రహం చెందారు. తమ ఓటమికి చంద్రబాబు, తెలుగుదేశం సానుభూతిపరులే కారణమని మనసులో పెట్టుకున్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా తమకు దూరమైన వర్గాలను దగ్గర తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కేసీఆర్ ఆ ప్రయత్నం చేయకుండా వ్యక్తులపై అలిగినట్టుగా తెలుగుదేశం సానుభూతిపరులను కూడా శత్రువులుగా ప్రకటించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి జగన్మోహన్‌రెడ్డే గెలవాలని కోరుకున్నారు. ఇప్పటికీ జగన్‌రెడ్డికే మద్దతుగా మాట్లాడుతుండటంతో తెలంగాణలోని తెలుగుదేశం సానుభూతిపరులు కేసీఆర్‌కు మరింత దూరమయ్యారు.

'కూటమి' కడితే...

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లో తెలుగుదేశం – బీజేపీ – జనసేన కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా ఈ కూటమి ప్రయోగం జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ కారణంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ అండ్ కో ప్రయత్నాలు మొదలుపెట్టారు. పనిలో పనిగా మీడియాను టార్గెట్‌గా చేసుకున్నారు. నిజానికి తెలంగాణలో కూటమి ప్రయోగం అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీకే అధిక నష్టం. గత ఎన్నికల్లో తెలుగుదేశం సానుభూతిపరులు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ఈ కారణంగానే ఖమ్మం వంటి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులకు భారీ మెజారిటీలు లభించాయి. అయినా చంద్రబాబు పేరు వినడానికి కూడా

> **పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గర చెప్పే ప్రయత్నం చేసినట్టుగా కేసీఆర్ గొప్పతనం గురించి నాబోటి వాళ్ల వద్ద చెప్పాలని జగదీశ్‌రెడ్డి వంటి వాళ్లు ప్రయత్నించడం వ్యర్థం. బెదిరింపులను మానుకొని ప్రజలను నమ్ముకుంటే మంచిరోజులు మళ్లీ రావొచ్చు. ఆలోచించమని మాత్రమే ఎవరైనా చెప్పగలరు. కాదూ కూడదూ అనుకుంటే మాత్రం అది వారి ఖర్మ!**

కేసీఆర్, కేటీఆర్‌లు ఇష్టపడటం లేదు. ఆ కారణంగానే చంద్రబాబు నాయుడు తెలంగాణ రాజకీయాల్లో వేలు పెట్టకూడదని వారు కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చుకొని తమది జాతీయ పార్టీ అని ప్రకటించుకున్న కేసీఆర్ ఇతర రాష్ట్రాలలో పోటీ చేయాలని అప్పట్లో ఉబలాటపడ్డారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్టుగా 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అసలుకే మోసం వచ్చింది. కేసీఆర్ ఆలోచనలను, చర్యలను తెలంగాణ సమాజం తిరస్కరించింది. దీంతో ఆ తర్వాత 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసే సాహసం కేసీఆర్ చేయలేకపోయారు. తెలంగాణలో ఇతర పార్టీలకు



స్థానం లేదని, రాష్ట్రానికి తామే పట్టాదారులమని చెప్పుకున్న బీఆర్‌ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటూ రాలేదు. ఇదీ గతం! తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో గుర్తించే ప్రయత్నం చేసి దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు మీడియా పైనో మరొకరి పైనో రంకెలు వేసే అవసరం వచ్చేది కాదు. రాజకీయ గండరగండడుగా పేరొందిన కేసీఆర్‌కు ఈ దుస్థితి ఎందుకొచ్చిందో తెలుసుకొనే ప్రయత్నం జగదీశ్‌రెడ్డి వంటి వారు చేయకుండా ఎవరినో బెదిరించాలనుకోవడం కుప్పిగంతులు వేయడమే అవుతుంది. తమను తెలంగాణ సమాజమే తిరస్కరించిందన్న కఠోర సత్యాన్ని విస్మరించి తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడిందని ఏడ్వడం ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణ అస్తిత్వానికి ఎవరూ ముప్పు తలపెట్టడం లేదు. పదకొండు సంవత్సరాల కిందట ఏర్పడిన తెలంగాణ అస్తిత్వం

> **తెలంగాణ సమాజం వేరు– కేసీఆర్ కుటుంబం వేరు. ప్రజలకు కష్టం వస్తే బాధపడాలి. వారిని ఆదుకోవడానికి చేతులు కలపాలిగానీ కేసీఆర్, కేటీఆర్‌ను అధికారంలోకి తీసుకురావడం కోసం అందరూ నిద్రాహారాలు మాని ఏడ్చుకుంటూ కూర్చోవాలని కోరుకోవడం ఏమిటి? తాను మఠం నడపడం లేదని, ఫక్తు రాజకీయ పార్టీ నడుపుతున్నానని కేసీఆర్ స్వయంగా చెప్పుకొన్నారు. కాంగ్రెస్, బీజేపీల వలె బీఆర్‌ఎస్ కూడా ఒక రాజకీయ పార్టీ మాత్రమే. తెలంగాణ సమాజంపై ఆ పార్టీకి ప్రత్యేకంగా పేటెంట్ ఏదీ లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను అభిమానించేవారు అభిమానిస్తూనే ఉంటారు. అంత మాత్రాన తమ పార్టీని మాత్రమే ప్రజలందరూ అభిమానించాలని, మీడియా కూడా తమకే ఊడిగం చేయాలని అనుకోవడం ఏమిటి? గత ఎన్నికల్లో ఓటమికి కారణాలను గుర్తించి ప్రజల వద్దకు వెళ్లి చెంపలు వేసుకుంటే వాళ్లే మళ్లీ ఆశీర్వదించవచ్చు. అంతేగానీ మా పార్టీ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తామని మీడియాను హెచ్చరించడం ఏమిటి?**

ఇవాళ మాత్రమే కాదు రేపు కూడా పదిలంగానే ఉంటుంది. బీఆర్‌ఎస్ గానీ, మరొక పార్టీ గానీ ఉండొచ్చూ లేకపోనూ వచ్చు. తెలంగాణ మాత్రం సగర్వంగా నిలబడే ఉంటుంది. తమ అహంకారపూరిత పోకడలను తెలంగాణ సమాజం హర్షించలేకపోయిందన్న వాస్తవాన్ని గుర్తించడానికి బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకు నిరాకరిస్తున్నారో తెలియదు.

రాజకీయ కాలుష్యం...

రాజకీయాలు కలుషితమయ్యాయి. దాని ప్రభావం తెలంగాణ రాజకీయాలపైనా పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించేవారు. ఈ ధోరణి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతోంది. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలదే. తాము అల్పుడుగా భావించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఒంటి కాలి మీద లేస్తున్నారు. వాడు, వీడు అన్న పద ప్రయోగాలు చేస్తున్నారు. వయసు, అనుభవం రీత్యా కేసీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులను తిట్టినా ఎవరూ పెద్దగా నొచ్చుకోలేదు. కేసీఆర్ వాడిన భాషను కేటీఆర్ వాడడాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు కూడా హర్షించలేక పోతున్నాయి. జగదీశ్‌రెడ్డి వంటి రాజకీయ మరుగుజ్జులకు కేటీఆర్ చిన్న సారు కావొచ్చుగానీ, ప్రజలెందుకు లెక్క చేస్తారు! కేసీఆర్‌నే ప్రజలు మట్టికరిపించిన విషయం అప్పుడే మరచిపోతే ఎలా? వ్యక్తిత్వ హననాల విషయానికి వద్దాం! సోషల్ మీడియా పుణ్యమా అని ప్రజా జీవితంలో ఉన్న వారితో పాటు ప్రముఖుల వ్యక్తిత్వ హననం పరిపాటి అయింది. ఈ విషయంలో ప్రధాన మీడియాకు బాధ్యత ఉంటుంది. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగవచ్చు. అంచేత అన్ని పార్టీల వాళ్లూ బాధితులుగానే ఉంటున్నారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ప్రత్యేకంగా బాధపడటం అనవసరం. ఈ వ్యక్తిత్వ హననాలు, దుష్ప్రచారాలు చేయడంలో కేటీఆర్ కూడా ఏమీ తీసిపోలేదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ పిచ్చి భ్రమలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేకపోయారన్న వాస్తవాన్ని విస్మరిస్తే ఎలా? ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే ఇటువంటి ఆలోచనలు వస్తాయి. సోషల్ మీడియా ద్వారా వికృత పోకడలను ప్రోత్సహించడంలో ఫలానా నాయకుడికి మినహాయింపు అని చెప్పలేని పరిస్థితి. అన్ని పార్టీలకూ ఈ జబ్బు పట్టుకుంది. ఈ క్రమంలో ప్రధాన మీడియాలో కూడా అప్పుడప్పుడూ అవాంఛనీయ పోకడలు తొంగి చూస్తున్నాయి. యూట్యూబ్‌లో కనిపిస్తున్న థంబ్ నెయిల్స్‌కూ వాస్తవ కథనానికీ పొంతన ఉండటం లేదు. ఇది గుర్తించిన యూట్యూబ్ యాజమాన్యం ఇటీవల కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడున్న పరిస్థితులలో సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి సంబంధించిన పోస్టులు, వీడియోలపై నియంత్రణ అవసరం. ఈ విషయం అలా ఉంచితే తెలుగునాట రాజకీయాలలో కక్షలూ కార్పణ్యాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే ప్రజలకూ, రాష్ట్రానికీ ఏం చేస్తామో చెప్పకుండా తాము ఎంత కర్కశంగా వ్యవహరించబోతామో చెబుతున్నారు. తాము అధికారంలోకి వస్తే జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్టు ప్రత్యర్థులను రప్పా రప్పా నరుకుతామని వైసీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ పోకడలను జగన్‌రెడ్డి కూడా సమర్థిస్తున్నారు. ఈ ధోరణిని ఇప్పుడు తెలంగాణలో బీఆర్‌ఎస్ నాయకులు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే మీడియాను హెచ్చరించడంతో పాటు రాజకీయ ప్రత్యర్థుల సంగతి తేలుస్తామని రంకెలు వేస్తున్నారు. ఎంపిక చేసుకున్న ప్రత్యర్థులకు భౌతికంగా హాని చేయడానికి అధికారం ఇవ్వాలని కోరడం వింత ధోరణి.

విచారణల పరంపర...

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. కేసీఆర్ కూడా ఈ విచారణ కమిషన్ ముందు హాజరయ్యారు. మరోవైపు టెలిఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తునకు సిట్ ఏర్పాటైంది. నిజానికి సిట్ టెలిఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఏర్పాటు కాలేదు. ట్యాపింగ్‌కు సంబంధించి ప్రారంభంలో ప్రత్యేకంగా ఫిర్యాదులు కూడా రాలేదు. దశాబ్దాలుగా తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ధ్వంసం చేశారని ఎస్ఐబీ అధికారులు చేసిన ఫిర్యాదు కారణంగా సిట్ ఏర్పాటైంది. ఈ దర్యాప్తులో భాగంగా ప్రజా ప్రతినిధులు, ప్రత్యర్థుల ఫోన్లను విచ్చలవిడిగా ట్యాప్ చేశారని వెల్లడైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే ఇది జరిగింది. తాము చేసిన ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు లభించకుండా చెయ్యాలన్న ఉద్దేశంతో నాటి అధికారులు సర్వర్లు, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. దీనిపై ప్రారంభమైన విచారణలో తీగ లాగితే డొంక కదిలింది. టెలిఫోన్ ట్యాపింగ్‌తో ముఖ్యమంత్రికి ఏమి సంబంధమని కేసీఆర్ ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. నిజమే... తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం కోసం అధికారులు వారి స్థాయిలోనే ఫోన్లు ట్యాప్ చేస్తారు. దానికీ ముఖ్యమంత్రికీ నేరుగా సంబంధం ఉండదు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, మీడియా ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయాలన్న ఆలోచన అధికారులకు ఎందుకొస్తుంది? వారికి ఆ అవసరం ఏమిటి? అలా చేయడం వల్ల ప్రయోజనం పొందేది ఎవరు? అధికారంలో ఉన్నవారే కదా? అలాంటప్పుడు నాకేమిటి సంబంధం? అని కేసీఆర్ వాదించడం తర్కానికి నిలబడదు. ఇప్పుడు సిట్ విచారణ వేగాన్ని అందుకున్నందున ఇందుకు సంబంధించిన వార్తలు మీడియాలో ప్రముఖంగా వస్తున్నాయి. ఇది సహజం. అంత మాత్రాన టెలిఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్, కేటీఆర్‌కు ముడిపెడుతూ వార్తలు రాయడం ఏమిటి? అని జగదీశ్‌రెడ్డి లాంటి వారు హూంకరించడం ఏమిటి? కేసీఆర్ చుట్టూ దెయ్యాలు చేరాయని ఆయన కుమార్తె కవిత ఆరోపించారు కదా? ఈ ప్రకటన వల్ల ఆమె బీఆర్‌ఎస్‌కు ఎంతో కొంత నష్టం చేసినట్టే కదా? అయినా ఆమెను తమ హిట్ లిస్ట్‌లో ఎందుకు చేర్చుకోలేదో?

తలవంపులు తెచ్చిందెవరు?


తెలంగాణకు తలవొంపులు ఎవరైనా తెచ్చారంటే అది బీఆర్‌ఎస్ వాళ్లే. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో జైలుకు వెళ్లిన కవితది ఏ పార్టీ? జాతీయ స్థాయిలో ఎన్నికల్లో పోటీ చేసి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని ప్రగల్భాలు పలికి చివరికి తోక ముడవడం వల్ల తెలంగాణ నవ్వులపాలు కాలేదా? కేసీఆర్, కేటీఆర్‌కు కష్టం వస్తే మొత్తం తెలంగాణ సమాజం ఎందుకు బాధపడాలి? తెలంగాణ సమాజం వేరు– కేసీఆర్ కుటుంబం వేరు. ప్రజలకు కష్టం వస్తే బాధపడాలి. వారిని ఆదుకోవడానికి చేతులు కలపాలిగానీ కేసీఆర్, కేటీఆర్‌ను అధికారంలోకి తీసుకురావడం కోసం అందరూ నిద్రాహారాలు మాని ఏడ్చుకుంటూ కూర్చోవాలని కోరుకోవడం ఏమిటి? తాను మఠం నడపడం లేదని, ఫక్తు రాజకీయ పార్టీ నడుపుతున్నానని కేసీఆర్ స్వయంగా చెప్పుకొన్నారు. కాంగ్రెస్, బీజేపీల వలె బీఆర్‌ఎస్ కూడా ఒక రాజకీయ పార్టీ మాత్రమే. తెలంగాణ సమాజంపై ఆ పార్టీకి ప్రత్యేకంగా పేటెంట్ ఏదీ లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను అభిమానించేవారు అభిమానిస్తూనే ఉంటారు. అంత మాత్రాన తమ పార్టీని మాత్రమే ప్రజలందరూ అభిమానించాలని, మీడియా కూడా తమకే ఊడిగం చేయాలని అనుకోవడం ఏమిటి? గత ఎన్నికల్లో ఓటమికి కారణాలను గుర్తించి ప్రజల వద్దకు వెళ్లి చెంపలు వేసుకుంటే వాళ్లే మళ్లీ ఆశీర్వదించవచ్చు. అంతేగానీ మా పార్టీ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తామని మీడియాను హెచ్చరించడం ఏమిటి? ఉడత ఊపులకు చింతకాయలు రాలవు. మా వరకు మేము ఇలాంటి దాడులను, బెదిరింపులను ఎన్నో చూశాం. రాజశేఖరరెడ్డి హయాంలో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత కేసీఆర్ పాలనలోనూ 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై దాడులు జరిగాయి. వివిధ రూపాల్లో నిర్బంధాలు ఎదురయ్యాయి. అయినా వాటన్నింటినీ తట్టుకొని నిలబడ్డాం. భవిష్యత్తులో కూడా నిలడతాం. తమను అధికారంలోంచి తప్పించి తప్పుచేశామని ప్రజలు వాపోతున్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు తహతహలాడుతున్నారని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పడమే కాదు, నమ్ముతున్నారు కూడా. అలాంటప్పుడు రెండు మూడు మీడియా సంస్థలు మీ దారికి రాకపోతే ఏమౌతుంది? ఏదో ఒక రాజకీయ పార్టీని అధికారంలో కూర్చోబెట్టే సత్తా మీడియాకు ఉండదు. ప్రజల తిరస్కరణకు గురైన పార్టీ అధికారాన్ని కోల్పోతుంది. అలాగే ప్రజల నిరాదరణకు గురయ్యే మీడియాకు కూడా మనుగడ ఉండదు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా జగన్‌రెడ్డి బాటలో నడవాలనుకుంటే అది బీఆర్‌ఎస్ నాయకుల ఇష్టం. తనపై తనకు నమ్మకం ఉన్నవాడు ఇతరులపై పడి ఏడవడు. ఆత్మవిశ్వాసం లోపించినవాడే ఆ పని చేస్తాడు. బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు సహనం అలవర్చుకుంటే మంచిది. వీళ్లకు ఇంకా బలుపు తగ్గలేదని ప్రజలు భావిస్తే మరో పర్యాయం కూడా అధికారానికి దూరంగానే ఉండవలసి వస్తుంది. పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గర చెప్పే ప్రయత్నం చేసినట్టుగా కేసీఆర్ గొప్పతనం గురించి నాబోటి వాళ్ల వద్ద చెప్పాలని జగదీశ్‌రెడ్డి వంటి వాళ్లు ప్రయత్నించడం వ్యర్థం. బెదిరింపులను మానుకొని ప్రజలను నమ్ముకుంటే మంచిరోజులు మళ్లీ రావొచ్చు. ఆలోచించమని మాత్రమే ఎవరైనా చెప్పగలరు. కాదూ కూడదూ అనుకుంటే మాత్రం అది వారి ఖర్మ!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

అణుశాస్త్రవేత్త, అపర ధన్వంతరి!

క్యాన్సర్ వ్యాధి చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ పరిశోధన మరింత దోహదపడాలని అమెరికాలో శోధించి, తను పుట్టినగడ్డపై 30 ఏళ్లకు పైగా మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ (ఎంజీఎం) ట్రస్టు ద్వారా సేవ చేసిన గాంధేయవాది డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్వామి జ్ఞానానంద దగ్గర ఏడు సంవత్సరాలు పరిశోధన చేసి డి.ఎస్సీ పట్టా పొందిన సాధకుడు. రాష్ట్రపతిగా రాణించిన శాస్త్రవేత్త ఎ.పి.జె. అబ్దుల్ కలాం క్లాస్‌మేట్. 2013 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత అయిన డాక్టర్ ఎమ్.ఆర్ రాజు గత నెల 24న కన్నుమూయడం తెలుగు సమాజానికి తీరని లోటు. పరులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేసే తండ్రిని చూసి స్ఫూర్తి పొందిన ఎమ్.ఆర్ రాజు తన 94 ఏళ్ల వయసులో భీమవరానికి దగ్గర ఉన్న పెద్ద అమిరం గ్రామంలోని ఎంజీఎం ట్రస్ట్ భవనంలో తృప్తిగా సేవలోనే కన్నుమూశారు. పదహారేళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన తన సహచరి సుభద్రారాజు... జీవితంలో, సేవాకార్యక్రమాలలో పెద్ద తోడుగా ఉండి మూడేళ్ల క్రితం మరణించడం డాక్టర్ రాజును తీవ్రంగా కలచి వేసింది.

1931 జూలై 15న జన్మించిన రామకృష్ణంరాజు మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎస్సీ, ఆ తర్వాత ఫిజిక్స్‌లో ఎం.ఎస్సీ చేశారు. పిమ్మట ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త బి.ఆర్.రావు వద్ద ఎం.ఎస్సీ (బై రీసెర్చ్) పూర్తిచేసిన తర్వాత, ప్రఖ్యాత న్యూక్లియర్ సైంటిస్ట్ స్వామి జ్ఞానానంద (1896–1969) వద్ద డాక్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. తొలుత యోగిగా జీవితాన్ని కొనసాగించి, ఐన్‌స్టీన్ సాపేక్షతాసిద్ధాంతం కారణంగా న్యూక్లియర్ సైంటిస్ట్‌గా మారిన జ్ఞానానంద ప్రపంచ విజ్ఞాన చరిత్రలోనే చాలా ప్రత్యేకమైన వ్యక్తి. తండ్రి తర్వాత ఈ పరిశోధక గురువు ప్రభావం రాజు మీద చాలా ఉంది. కాబట్టే 1961లో క్యాన్సర్ చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ ఏ రకంగా తోడ్పడగలవని పరిశోధన కోసం డాక్టర్ రాజు అమెరికా వెళ్లారు. ప్రఖ్యాత మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జనరల్ హాస్పిటల్, ఇంకా హార్వర్డ్‌లలో మరింత పరిశోధన చేసి, తొలుత పదేళ్లు బర్కిలీలోని లారెన్స్ రేడియేషన్ లేబరేటరీలో జి.హెచ్ లారెన్స్‌తో కలిసి శ్రమించారు. తర్వాత 1971లో లాస్ ఆల్మోస్ నేషనల్ లాబోరేటరీలో బయోఫిజిస్ట్‌గా 23 ఏళ్ల పరిశోధనాజీవితం గడిపారు. 1981లో 3000 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లలో ఎంపిక చేయబడిన 25 మందిలో ఒకరుగా గుర్తింపు పొందారు. దాదాపు అదే సమయంలో తను ఉద్యోగం చేసే పరిశోధనాశాలలో 'విజ్ఞాన శాస్త్రంలో సృజనాత్మకత' గురించి ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తితో ప్రసంగం; అటు తర్వాత శాస్త్రవేత్తలతో వారి ముఖాముఖీ సంభాషణ ఏర్పాటు చేసి, విభిన్నమైన చరిత్రకు శ్రీకారం చుట్టారు. రామకృష్ణంరాజు దంపతులు 1994లో భారతదేశం తిరిగి వచ్చారు.



డాక్టర్ ఎమ్.ఆర్ రాజు
15-7-1931 – 24-6-2025

స్వాతంత్రోద్యమంలో పాల్గొనడమే కాకుండా, 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించిన ఘడియలను దుర్గాబాయి దేశముఖ్‌తో కలిసి పంచుకున్న అదృష్టం సుభద్రది. గ్రామీణ ఆరోగ్యం కోసం సుభద్ర 1976లో ఎంజీఎంను పెద్ద అమిరంలో ప్రారంభించి కంటి చూపు, మహిళల సాధారణ ఆరోగ్యం, సర్వికల్ క్యాన్సర్ వంటి సమస్యల పరిష్కారాల పట్ల దృష్టి పెట్టారు. 1994లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని భీమవరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద అమిరం గ్రామంలో ఉన్న ఎంజీఎం ట్రస్టు కార్యక్రమాలను గ్రామీణారోగ్యం, గ్రామీణ విద్య, పల్లె ప్రాంతాల్లో క్యాన్సర్ సమస్య నివారణ వైపుగా మరింత విస్తృత పరిచారు ఎం.ఆర్.రాజు దంపతులు. తన పరిశోధనతో ముడిపడి ఉన్న సంస్థలు, శాస్త్రవేత్తల సహకారంతో వీరు 'రూరల్ క్యాన్సర్ సెంటర్'ను 2006 జనవరి 9న అప్పటి రాష్ట్రపతి, ఎ.పి.జె కలామ్‌తో ప్రారంభింపజేశారు. గ్రామీణ ప్రాంతాలకు రేడియేషన్ చికిత్స, సైన్స్ అండ్ సోషల్ సర్వీస్ వంటి అంశాలపై శాస్త్రవేత్తలకు అవగాహన కల్పించే రీతిలో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సదస్సులలో అటమిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్లు అనిల్ కకోద్కర్, కుమార్ బెనర్జీ పాల్గొనడం విశేషం. రూరల్ క్యాన్సర్ సెంటర్‌లో నమోదైన 3200 మంది పేషంట్లలో 1400 మంది రేడియేషన్ థెరపీ పొందారు. స్థానిక అధికారులతో, తనతో పని చేసిన శాస్త్రవేత్తల సహకారంతో ఎంజీఎం ట్రస్ట్ చాలా రకాల సేవలు మూడు దశాబ్దాలుగా చేస్తోంది.

వాస్తవాలను ఖాతరు చేయకుండా ఇతరులు చేసిన విమర్శలు, పొగడ్తలు వంటి ట్రాష్‌ను గుర్తుపెట్టుకోవడానికి మన మెమరీని వాడుతున్నామని డాక్టర్ ఎమ్.ఆర్ రాజు భావించేవారు. న్యూక్లియర్ పార్టికల్స్ ఉపయోగాలకు సంబంధించిన రేడియేషన్ ఫిజిక్స్, రేడియో బయాలజీ విభాగాలలో 140 పరిశోధనా పత్రాలతో పాటు ఎన్నో సమీక్షావ్యాసాలు, అధ్యయనాంశాలు రాసిన డాక్టర్ రాజు 'హెవీ పార్టికల్ రేడియో థెరపీ' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే క్యాన్సర్‌కు సంబంధించి మంచి అవగాహన కలిగించే పుస్తకం ఇంగ్లీషు, తెలుగు భాషల్లో వెలువడి ప్రాచుర్యం పొందింది.

▪ డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి పూర్వ సంచాలకులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
హైదరాబాద్
నగర వార్తలు
ఆదివారం 6 జూలై 2025
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 కనిష్ఠం 23.2

దారులిలా.. వెళ్లేదెలా?

మజీద్ బండ..



మజీద్‌బండలో ధ్వంసమైన రోడ్డు

ప్యారడైజ్..



జగద్గిరిగుట్ట బస్టాప్ రోడ్..



జగద్గిరిగుట్ట బస్టాప్ రోడ్డు మధ్యలో ప్రమాదకర గుంత

గ్రేటర్ పరిధిలో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి వాహనదారుల ప్రయాణానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల అడుగులోతు గుంతలుండడంతో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. వీటితో వెన్నుపై తీవ్ర ప్రభావం పడుతోందని, వాహనాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ రోడ్లపై వెళుతున్నా వాటికి మరమ్మతులు చేయించాలన్న ధ్యాసే ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాల నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే నీరు నిండిన ఈ గుంతలలో పడి ఆస్పత్రులపాలు కావడం ఖాయమని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్

కొండాపూర్..



కొండాపూర్‌లో రోడ్డు దుస్థితి

రాంనగర్ రోడ్..



రాంనగర్‌లో గుంతలమయమైన రోడ్డు

దూలపల్లి ఇండస్ట్రియల్ రోడ్..



దూలపల్లి పారిశ్రామికవాడ రోడ్డులో అడుగులోతు గొయ్యి

గుండెలపై కూర్చొని.. గొంతు నులిమి

భర్తను హత్యచేసిన భార్య

మద్యం తాగి చనిపోయాడంటూ నాటకం

- అంత్యక్రియల కోసం ఊరికి..
- గాయాలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన సోదరుడు
- హత్యగా నిర్ధారించి నిందితురాలి అరెస్ట్



నిందితురాలు రాధ

నిజాంపేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుండెలపై కూర్చుని, గొంతు నులిమి భర్తను హత్యచేసిన భార్య ఘటన బాచుపల్లి పరిధిలో వెలుగులోకి వచ్చింది. అంత్యక్రియల కోసం సొంతూరుకు తీసుకెళ్లగా మృతుడి మెడపై ఉన్న గాయాలను చూసిన సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. భార్యే హత్య చేసినట్లు తేలడంతో బాచుపల్లి పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం రామకిష్టయ్యపల్లికి చెందిన అంజిలప్ప, రాధ దంపతులు. వీరికి

మిగతా 8వ పేజీలో..

సున్నంచెరువు విస్తీర్ణమెంత..



సున్నంచెరువు

15.23ఎకరాలా..? 32.60ఎకరాలా..?

- 15ఎకరాలకే ఎల్‌పీసీ నిర్ధారణ
- ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత లేకే ఫైనల్ నోటిఫికేషన్ పెండింగ్..?
- చెరువు కబ్జాపై గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనం..
- అప్పట్లో విపక్ష నేతగా సీఎం రేవంత్‌రెడ్డి సందర్శన

హైదరాబాద్ సిటీ, జూలై5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని సున్నం చెరువు విస్తీర్ణమెంత..? అనేది ఆసక్తికరంగా మారింది. 15ఏళ్ల క్రితం ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు హెచ్‌ఎండీఏలో ఏర్పాటు చేసిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) సున్నం చెరువు 15.23ఎకరాలుగా నిర్ధారణ చేసింది. 11ఏళ్ల క్రితమే ప్రిలిమినరీ నోటిఫై చేసింది. ఇంకా ఫైనల్ నోటిఫై కాలేదు. అయితే, ఇటీవల హైడ్రా మాత్రం 1975లో సర్వే ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం చెరువు విస్తీర్ణం 32.60ఎకరాలు ఉన్నట్లుగా చెబుతూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికులు కోర్టుకెక్కారు. ఈ క్రమంలో సున్నంచెరువు ఎఫ్‌టీఎల్ తేల్చాలంటూ కోర్టు ఆదేశాలిచ్చింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్ధారించినదే వాస్తవమవుతుందా.? లేక హైడ్రా అంటున్నదే నిజమవుతుందా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.

15 ఎకరాలకే లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్ధారణ

సున్నంచెరువును 2013 సెప్టెంబరు 26న లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) సర్వే

మిగతా 6వ పేజీలో..



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ బీరప్ప, డాక్టర్ ఎంఎస్ గౌడ్

వృద్ధుల కోసం డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల కోసం వైద్యులు డే కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వారితో ప్రజల మధ్య మానవ సంబంధాలను మెరుగుపర్చాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు సోమాజిగూడ సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, దంత వైద్యులు ప్రొ.డా. ఎంఎస్ గౌడ్‌లకు మెడికల్ ఎక్సలెన్స్ అవార్డు - 2025లను గవర్నర్ అందజేశారు. దంత, వైద్య రంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ చైర్మన్ భీమ్‌రెడ్డి, దాన కిషోర్, ఐఆర్‌సీఎస్ తెలంగాణ జనరల్ సెక్రటరీ సీతాఓ ప్రొ.శ్రీరాములు, డా. ఓ.ఎస్.రెడ్డి, ఐఆర్‌సీఎస్ వరంగల్ జిల్లా చైర్మన్, మాజీ నేషనల్ ఎంసీ మెంబర్ డా.పి.విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు.

దోచుకొనుడు.. పంచుకొనుడు



అక్రమార్కులకు అడ్డాగా పోలీసు కమిషనరేట్!

- అవినీతి అధికారులకే సింహభాగం అందలం
- రూల్ బుక్ ఆఫీసర్ ఉన్నా.. రూల్స్ బ్రేక్
- కిమ్మనని పోలీస్ బాస్..?

అక్రమ దందాల్లో కొందరు డీసీపీ, ఇన్‌స్పెక్టర్ల మిలాఖత్

హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇది ఖరీదైన పోలీసు కమిషనరేట్. ఇక్కడ రూల్‌బుక్‌లాంటి అధికారి పోలీస్ బాస్. అయితే ఏంటి అనుకుంటున్నారా.. ఇక్కడ అన్ని రూల్సూ బ్రేక్ అవుతుంటాయి. పోలీసు బాస్ కిమ్మనరు.. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు డీసీపీ, ఇన్‌స్పెక్టర్లు మిలాఖత్ అవుతూ అక్రమ దందాల్లో భారీగా దోచుకుంటున్నారు. అందినకాడికి పంచుకుంటున్నారు. ఈ కమిషనరేట్ అవినీతి అధికారులకు అడ్డాగా మారిందని, అక్రమాలకు పాల్పడుతున్న వారినే అందలం ఎక్కిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రస్తుత అధికారుల్లో సింహభాగం గతంలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొని డిపార్టుమెంట్‌లో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నవారే ఉన్నారని పోలీసు వర్గాల్లో బాహాటంగా చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. రూల్‌బుక్‌లాంటి ఆఫీసర్ ఉన్నా.. రూల్స్ బ్రేక్ చేసి మరీ పోస్టింగ్‌లు పొందుతున్న వారిని

మిగతా 6వ పేజీలో..



మంత్రికి పుస్తకాన్ని బహూకరిస్తున్న ఇస్కాన్ సంస్థ సభ్యులు

ఇస్కాన్ సేవలు భేష్

రాయదుర్గం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సేవలు భేష్ అంటూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. గోపన్‌పల్లిలోని శ్రీ రంగనాథస్వామి ఆలయ భూమిలో వంటశాల పనులను మంత్రి శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రూ.5 భోజనం అందించేందుకు ఇస్కాన్ సంస్థకు వంటశాల, గోశాల నిమిత్తం దేవాదాయ శాఖ 6వేల గజాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో పనులను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పూజలు నిర్వహించారు. అంతకుముందు నలగండ్ల నుంచి గోపన్‌పల్లి వరకు ఇస్కాన్ సంస్థ జగన్నాథ రథయాత్ర నిర్వహించింది.

ఫైన్ కట్టు.. పర్మిషన్ పట్టు

ఫ్యాకల్టీ లోటున్న ఇంజనీరింగ్ కాలేజీలపై జేఎన్‌టీయూ కొరడా

- 30 కాలేజీల్లో 3వేల సీట్లకు కోత పెడతామని హెచ్చరిక
- జరిమానా చెల్లింపుతో అన్ని సీట్లకు అనుమతి!



హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నిష్పత్తికి తగినట్లుగా ఫ్యాకల్టీ లేని ఇంజనీరింగ్ కాలేజీలపై జేఎన్‌టీయూ అధికారులు కొరడా ఝుళిపించారు. ఏప్రిల్ నెలలో యూనివర్సిటీ నిజ నిర్ధారణ కమిటీ తనిఖీల సమయంలో కాలేజీల్లో ఉన్న ఫ్యాకల్టీ, గత రెండు నెలలుగా బయోమెట్రిక్ హాజరు వేయకపోవడంతో ఆయా కాలేజీల్లో ఫ్యాకల్టీ లోటు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలో మొత్తం 30 ఇంజనీరింగ్ కాలేజీల్లో సుమారు 3వేలకు పైగా సీట్లకు కోతపెడతామని హెచ్చరించారు. వీటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 20, మరో 10 గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలున్నట్లు తెలిసింది. తనిఖీల సందర్భంగా మౌలిక వసతులు, బోధనా సిబ్బంది లోటును గుర్తించి 70 ఇంజనీరింగ్ కాలేజీలకు నెలరోజుల కిందట నోటీసులు జారీచేశారు. లోటుపాట్లు సవరించుకున్నామంటూ కళాశాలల యాజమాన్యాలు జేఎన్‌టీయూ నియమించిన అప్పిలేట్ కమిటీని ఆశ్రయించగా, సుమారు 40కళాశాలలకు అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

అఫిలియేషన్ ఫీజు బకాయిలకు అఫిడవిట్

మిగిలిన 30 కాలేజీల్లో ఫ్యాకల్టీ లోటుతో పాటు యూనివర్సిటీకి చెల్లించాల్సిన అఫిలియేషన్ ఫీజు, కామన్ సర్వీసు ఫీజు బకాయిలు సుమారు రూ.30కోట్లు

మిగతా 8వ పేజీలో..



సెక్రటేరియట్ ముందు బందోబస్తు విధుల్లో స్వాట్ ఫైటర్స్

రంగంలోకి దిగిన స్వాట్ ఫైటర్స్

హైదరాబాద్‌సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ధర్నాలు, రాస్తారోకోలు, బందోబస్తుల్లో మహిళా ఆందోళనకారులను నిలువరించడానికి సిటీ కమిషనరేట్‌లో ప్రత్యేక మహిళా స్వాట్ (స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్) బృందాలను సీపీ సీవీ ఆనంద్ రంగంలోకి దింపారు. కరాటే, ఆత్మరక్షణ శిక్షణతో సిద్ధమైన 35 మంది మహిళా సిబ్బంది (స్వాట్ ఫైటర్స్)ని సెక్రటేరియట్ బందోబస్తు విధుల్లో నియమించారు.

బొల్లారంలో కలకలం..

నరబలి ఇచ్చి పాతిపెట్టారని ప్రచారం

కుక్క అని తేలడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



ఫొరెన్సిక్ డాక్టర్ల ఆధ్వర్యంలో సమాధిని తవ్వుతున్న సిబ్బంది

తిరుమలగిరి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి క్షుద్ర పూజలు చేసి నరబలి ఇచ్చారని, స్థానిక బజార్‌లోని గుట్టల ప్రాంతంలో పూడ్చివేశారనే ప్రచారం తీవ్ర కలకలం రేపింది. బొల్లారం పోలీసులు ఫొరెన్సిక్ వైద్యుల సహకారంతో శనివారం సమాధిని తవ్వగా కుక్క శవం బయటపడింది. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బొల్లారంబజార్‌లో మూడు రోజుల క్రితం ఓ వ్యక్తి క్షుద్రపూజలు చేసి ఓ చిన్నారిని నరబలి ఇచ్చి పూడ్చివేశాడంటూ స్థానికంగా ప్రచారం జరిగింది. పూడ్చిన సమాధి వద్ద ఐస్‌క్రీం, పూలు చల్లినట్లు ఉండడంతో అక్కడికి ఎవరైనా వస్తున్నారా అంటూ పోలీసులు మఫ్టీలో నిఘాపెట్టారు. చివరకు గాంధీ ఆస్పత్రి ఫొరెన్సిక్ వైద్యుల సహకారంతో సమాధిని తవ్వారు. అందులోంచి కుక్కశవం బయటపడింది. పోలీసుల విచారణలో ఆ కుక్క స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్న సుమన్‌కు సంబంధించినదిగా తేలడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మూడు రోజుల క్రితం తన పెంపుడు కుక్క మృతి చెందిందని, శాస్త్రోక్తంగా దానికి అంత్యక్రియలు చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



బోనాల జాతరలో

ఆకతాయిల అరాచకాలు

గోల్కొండలో మహిళలకు వేధింపులు

పోకిరీ బ్యాచ్‌ల మధ్య గ్యాంగ్‌వార్‌లు

6

నేడు మొహర్రం

ఊరేగింపు

డబీర్‌పురా నుంచి చాదర్‌ఘాట్ వరకు..



సచివాలయం ప్రాంతంలో పడుతున్న వర్షం

నగరంలో జోరువాన

సరూర్‌నగర్, ఎల్‌బీనగర్‌లలో 1.3 సెం.మీ.

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం సాయంత్రం జోరువాన కురిసింది. పలుప్రాంతాల్లో రహదారులపై వరద నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో 1.3సెం.మీ వర్షం కురిసింది. నాంపల్లి, అంబర్‌పేట, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, చార్మినార్, బండ్లగూడ, చార్మినార్, ఉప్పల్, గోల్కొండ, అంబర్‌పేట ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. అరగంటకు పైగా కురిసిన వర్షంతో రోడ్లపై, గుంతల్లో వరదనీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు మరో మూడురోజులు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీచేసింది.

BLOCKBUSTER PROMISE



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

SVC సంగీత 70 ఎ/సి - ఆర్.సి.పురం 11.15,2.30,6.00,9.30
SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
SVC యాదగిరి - సంతోష్‌నగర్ 11.30,2.30,6.15,9.30
SVC ఈశ్వర్ 70 ఎ/సి - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
విశ్వనాథ్ 70 - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.30,6.30,10.00
మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి 11.15,2.45,6.30,10.00
గోకుల్ 70 ఎంఎం - ఎర్రగడ్డ 11.30,2.30,6.30,9.30

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.40,2.35,5.30, 8.25,111.15
ఐనాక్స్ జీఎస్ఎమ్ - మదీనగూడ 10.00,1.10,4.20, 5.00,7.30,10.40
ఎంజెఆర్ సినీప్లెక్స్ - నారపల్లి 10.40,1.30,4.35,7.25,10.45
ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 10.05,10.30,1.10, 4.15,6.50,7.25,10.30
ఐనాక్స్ నెక్లెస్ సత్య - కవాడిగూడ 10.20,1.30,4.40, 7.50,10.10,11.00
సినీ పోలిస్ శాంతి శివాని - దిల్‌సుఖ్‌నగర్ 10.20,1.30,4.40,7.50,11.00
సినీపోలిస్ సినిమాస్ - బాలానగర్ 10.20,1.30,4.40,7.50,11.00

ప్రిస్మ్ మాల్ - గచ్చిబౌలి 10.00,1.10,5.00,8.00,11.10
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 10.35,1.40,4.35,7.30,10.40
మూవీమ్యాక్స్ - మౌలాలి
ఐనాక్స్ జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 10.00,1.15,4.30,7.50,10.50
ఏషియన్ రాధిక - కాప్రా 10.30,1.05,4.35,7.10,10.40
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.45,1.40,4.35,7.30,10.20
ఐనాక్స్ ఎం.పి మాల్ - కాచిగూడ 10.10,1.20,4.30,7.40,10.50
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 10.30,1.30,4.35,7.20,10.45
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 9.00,11.50,2.40,5.30,8.20,11.10

వెంకటరమణ పద్మావతి - కాచిగూడ 11.15,2.30,6.15,9.30
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.15,2.30,6.15,9.30
తారకరామ 70 - కాచిగూడ 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ 70 ఎంఎం ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి 70 ఎ/సి - కొత్తపేట 11.15,2.30,6.15,9.30
శ్రీ ప్రేమ 70 ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
సుష్మ 70 ఎంఎం - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00
భుజంగ 70 ఎంఎం - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
లక్ష్మి క.మం.70 - అల్వాల్ 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు 70 - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
శ్రీకృష్ణ 70 - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.15,2.30,6.15,9.30
ప్రశాంత్ 70 - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
రామకృష్ణ 70 ఎంఎం - ఆబిడ్స్ 11.00,2.00,6.00,9.00
గణేష్ 70 ఎ/సి - శంషాబాద్ 11.15,2.15,6.00,9.00
శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ 11.00,2.30,6.00,9.30
ముకుంద్ 70 - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
వైజయంతి 70 ఎ/సి - నాచారం 11.00,2.00,6.00,9.00
వెంకటేశ్వర 70 - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00
సాయిరంగ 70 ఎ/సి - మియాపూర్ 11.00,2.15,6.00,9.15
జగదాంబ 70 - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
అలంకార్ (ప్రతాప్) - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00
మెట్రో 70 - బహదూర్‌పురా 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.16,6.00,9.15
రాఘవేంద్ర 70 - బి.బి.నగర్ 11.00,2.00,6.00,9.00

పోలీసు కస్టడీకి పూర్ణచంద్ర


హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీవీ జర్నలిస్టు స్వేచ్ఛ వోటార్కర్ (40) ఆత్మహత్య కేసులో బీఆర్ఎస్ ఖానాపూర్ నాయకుడు పూర్ణచంద్ర నాయక్‌ను పోలీసు కస్టడీకి అనుమతి ఇస్తూ నాంపల్లి క్రిమినల్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో శనివారం పూర్ణచంద్రను కస్టడీలోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు కస్టడీకి ఇచ్చినట్లు చిక్కడపల్లి సీఐ రాజు నాయక్ తెలిపారు. వాస్తవానికి ఐదు రోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ వేయగా, న్యాయస్థానం మూడు రోజులకే అనుమతి ఇచ్చింది.

SUPER HIT నేడే చూడండి



MYTHRI MOVIE DISTRIBUTORS LLP

విజయవంతమైన 2వ వారం



అంజలి 70 - సికింద్రాబాద్ 11.15,2.15,6.00,9.00

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 3.35pm
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 1.00,7.45
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.20pm
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.05pm
పివిఆర్ ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 1.25pm
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట 1.25pm
పివిఆర్ బికాన్ - హైటెక్‌సిటీ 4.20pm
పివిఆర్ పివిఆర్ - ఎర్రమంజిల్ 4.55pm
పివిఆర్ పివిఆర్ - ముసారాంబాగ్ 8.20pm
పివిఆర్ అట్రియమ్ - గచ్చిబౌలి 4.35pm
ఐనాక్స్ జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 4.30pm
ఐనాక్స్ జీఎస్ఎమ్ - మదీనగూడ 1.45,8.00
ఐనాక్స్ నెక్లెస్ సత్య - కవాడిగూడ 1.55,7.40
ఐనాక్స్ అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 10.15,7.50
మంజీరామాల్ - కూకట్‌పల్లి 1.50pm
టి.ఎస్.ఆర్ మాల్ - కొంపల్లి 11.00,5.00
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 5.25pm
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 1.25,10.35
సినీమార్క్ - ఆర్.సి.పురం 1.40pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 4.25pm
సినీస్క్వేర్ - ఉప్పల్ 4.35pm
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్ 1.40pm
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 1.30pm
లక్ష్మీకళ - మూసాపేట్ 2.45pm
జె.పి.సినిమాస్ - చందానగర్ 4.50pm
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 10.20am

విజయవంతమైన 3వ వారం



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,6.00,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

అర్జున్ 70 ఎంఎం - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి/ఇంద్ర నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.15,2.30,6.15,9.30
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 10.40,4.50,10.55
ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి 10.20,1.15,4.00,7.15,10.15
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 2.30,7.10
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 10.35,1.25,7.30,11.00
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 12.30,7.30,11.00

GLOBAL CINEMAS RELEASE

దోచుకోనుడు.. పంచుకోనుడు!

(5వ పేజీ తరువాయి)

చూసి ఇతర పోలీస్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. పోలీస్ బాస్ సైతం కిమ్మనకుండా తనపని తాను చేసుకుంటూ.. అవినీతి అధికారులపై ఉన్నతాధికారులకు రిపోర్టులు రాసి పంపుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ అధికారుల గురించి మచ్చుకు కొన్ని ఘటనలు చూద్దాం..

● **సీఐలకు డీసీపీ హుకూం**

పారిశ్రామికవాడలో ఉన్న ఒక జోన్‌లో చీటింగ్, భూ దందా కంప్లైంట్ ఏదైనా తన దృష్టికి వచ్చిన తర్వాతనే కేసులు నమోదు చేయాలని ఓ డీసీపీ.. ఇన్‌స్పెక్టర్లకు హుకూం జారీ చేసినట్లు తెలిసింది. దాంతో ఇన్‌స్పెక్టర్లు దర్జాగా కేసును బట్టి 'కాసులు దోచుడు.. డీసీపీకి పంచుడు' అన్న తరహాలో సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ఎన్ని అక్రమాలు జరిగినా, అవినీతి ఆరోపణలు వచ్చినా పోలీస్ బాస్‌కు చర్యలు తీసుకోలేని పరిస్థితిని డీసీపీలు కల్పించినట్లు తెలుస్తోంది.

● ఇటీవల జరిగిన ఒక హత్య కేసులో పోలీసుల తీరుపై ప్రజా సంఘాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. ప్రేమ పేరుతో బాలికను ఇంట్లోంచి తీసుకెళ్లిన ఓ యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని రిమాండ్ చేయకుండా నోటీసుతో వదిలేశారు. అయితే, ఆ యువకుడితో కలిసి బాలిక తన తల్లిని దారుణంగా హత్య చేసిందని మృతురాలి బంధువులు తీవ్ర ఆరోపణలు చేశారు. అయినా వారిపై కమిషనరేట్ ఉన్నతాధికారులు గానీ, పోలీస్ విభాగం ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వ్యక్తం అయ్యాయి. డబ్బుకోసమే పోలీసులు ఇలా చేశారంటూ ప్రజా సంఘాలు మండిపడ్డాయి.

● గతంలో సిటీ కమిషనరేట్‌లో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్.. క్రమశిక్షణా చర్యలకు గురై సైబరాబాద్‌కు మకాం మార్చాడు. సిటీలో ఉన్నప్పుడు దొంగల ముఠాను నిర్వహించిన కానిస్టేబుల్‌కు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు పరోక్షంగా సహకరించినట్లు తేలింది. వారిలో ప్రస్తుతం ఒక ఇన్‌స్పెక్టర్ సిటీలోనే ఎస్‌హెచ్‌వోగా కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్ శివారు ప్రాంతంలోని ఓ జోన్‌లో ఫోకల్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వో పోస్టింగ్ పొంది సెటిలయ్యాడు.

● ఖరీదైన కమిషనరేట్‌లో స్పెషల్ పోలీస్ డీసీపీగా పనిచేస్తున్న ఒక అధికారి అక్రమాల దందాలో వసూళ్లలో స్పెషల్ అనిపించుకున్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. వసూళ్ల కోసం ఏకంగా ఇద్దరు క్షేత్రస్థాయి పోలీసులను నియమించుకున్నట్లు సమాచారం. వారు వసూళ్లకు పాల్పడుతున్న క్రమంలో ఇతర పోలీసులకు చిక్కి కేసులపాలైనట్లు తెలిసింది. ఆ తర్వాత వారిని జైలు నుంచి బయటకు వచ్చేందుకు పరోక్షంగా సహకరించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా క్షేత్రస్థాయిలో పాలన గాడితప్పి, అడ్మినిస్ట్రేషన్ అధ్వానంగా తయారైనట్లు డిపార్టుమెంట్‌లో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే పరిస్థితి చక్కబడే అవకాశం ఉంది.

ఈనెల్లైనా బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
AMB ఎ.ఎం.బి సినిమాస్ 70 - గచ్చిబౌలి
ఏషియన్ సత్యం 70 - అమీర్‌పేట్
లక్ష్మీకళ సినీప్రైడ్ 70 ఎ/సి- మూసాపేట్

ఏషియన్ సినీమార్క్ - ఆర్.సి.పురం
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీప్లెక్స్ - నారపల్లి
పివిఆర్ బికాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
పివిఆర్ ప్రెస్టన్ మాల్ - గచ్చిబౌలి
పివిఆర్ అట్రియమ్ - గచ్చిబౌలి
పివిఆర్ ప్రిస్మ్‌మాల్ - గచ్చిబౌలి
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
టి.ఎస్.ఆర్ - కొంపల్లి
సినీ పోలిస్ శాంతి శివాని - దిల్‌సుఖ్‌నగర్
సినీ పోలిస్ సినిమాస్ - బాలానగర్
సినీ పోలిస్ సినిమాస్ - చందానగర్
సినీటౌన్ - మియాపూర్

GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి



ఆరాధన 70 ఎంఎం - తార్నాక 11.00,2.00,6.00,9.00
తాళ్ళూరి కాంప్లెక్స్ - ఇ.సి.ఐ.ఎల్ 11.00,2.00,6.00,9.00
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 11.00am
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ 10.40am
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 7.15pm
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 4.00pm
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.00am
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 12.00pm
పివిఆర్ ఫోరం మాల్ - కూకట్‌పల్లి 5.00pm
సినీమార్క్ - ఆర్.సి.పురం 4.20pm
పివిఆర్ ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 1.35pm
సినీ ప్లానెట్ - కొంపల్లి 10.30am
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట 1.35pm
సినీస్క్వేర్ - ఉప్పల్ 7.25pm
పివిఆర్ పివిఆర్ - ఎర్రమంజిల్ 4.50pm
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి 10.30,4.30
పివిఆర్ పివిఆర్ - ముసారాంబాగ్ 1.35pm
ఎంజెఆర్ సినీప్లెక్స్ - నారపల్లి 4.30pm
ఐనాక్స్ జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 1.55pm
శాంతి శివాని - దిల్‌సుఖ్‌నగర్ 5.00pm
ఐనాక్స్ జీఎస్ఎమ్ - మదీనగూడ 2.30pm
సినిమాస్ - బాలానగర్ 2.00pm
ఐనాక్స్ నెక్లెస్ సత్య - కవాడిగూడ 4.45pm
సినిమాస్ - చందానగర్ 2.00pm
ఐనాక్స్ అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 1.00pm
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి 5.30pm
పి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 1.30pm
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్ 11.00am
టి.ఎస్.ఆర్ మాల్ - కొంపల్లి 1.50pm

సున్నంచెరువు విస్తీర్ణమెంత..

(5వ పేజీ తరువాయి)



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

చేసింది. 4,805 ఐడీ నంబర్ ఇచ్చి 2014 జనవరి 27న ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. చెరువు 15.23ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లుగా ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్లను కూడా నిర్ధారించింది. అయితే, హైదరాబాద్‌లో చెరువుల అన్యాక్రాంతంపై ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2021 జూలై 13న సుమోటోగా స్వీకరించి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. దాంతో ఎల్‌పీసీ ప్రకారంగా సున్నంచెరువు 15.23ఎకరాలు ఉన్నట్లుగా ప్రభుత్వం ఎన్‌జీటీకి ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొంది. బఫర్ ఏరియా చుట్టూరా 9మీటర్లని, ఎఫ్‌టీఎల్‌లో 78 ఆక్రమణలు, బఫర్‌జోన్‌లో 30 మొత్తంగా 108 ఆక్రమణలు వచ్చినట్లుగా అఫిడవిట్‌లో వివరించింది.

32 ఎకరాలుగా పేర్కొన్న హైడ్రా..

కొన్ని నెలల క్రితమే సున్నం చెరువులో వచ్చిన నిర్మాణాలను హైడ్రా తొలగిస్తూ ఇటీవల చెరువు పునరుద్ధరణ పనులను చేపట్టింది. ఈ క్రమంలో తాము 20ఏళ్ల క్రితం కొనుగోళ్లు చేసిన స్థలాలను కూడా చెరువుల్లో చూపుతున్నారని స్థానికులు గగ్గోలు పెడుతూ ఇటీవల ఆందోళనకు దిగారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా మద్దతు తెలిపారు. అయితే, 1975లో సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల వివరాల ప్రకారం సున్నం చెరువు 32.60ఎకరాల విస్తీర్ణంలో ఉందని హైడ్రా అధికారులు పేర్కొంటున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరివైనా స్థలాలు ఉంటే వారికి మెరుగైన పరిహారంగా టీడీఆర్‌లు జారీ చేస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

ఎఫ్‌టీఎల్‌పై స్పష్టత లేకే..

హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో సమీక్షలు చేస్తూ చెరువుల ఎఫ్‌టీఎల్ ఫైనల్ నోటిఫై చేస్తుంటారు. అయితే హైడ్రా అభ్యంతరాల నేపథ్యంలో సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ ఫైనల్ నోటిఫై నిర్ధారణకు బ్రేకులు పడ్డాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఎల్‌పీసీ నిర్ధారించిన సున్నంచెరువు 15.23ఎకరాల ఎఫ్‌టీఎల్‌కు, హైడ్రా చెబుతున్న 32.60 ఎకరాల ఎఫ్‌టీఎల్ వివరాలకు ఏమాత్రం పొంతన లేదు.

హైడ్రా ఏ మేరకు నిర్ధారిస్తుందోనని ఆసక్తి

తాజాగా.. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సున్నంచెరువు ఎఫ్‌టీఎల్‌ను హైడ్రా ఏ మేరకు నిర్ధారిస్తుందోననే ఆసక్తి నెలకొన్నది. గతంలో ఎల్‌పీసీ నిర్ధారించిన 15.23ఎకరాల విస్తీర్ణంలోని ఎఫ్‌టీఎల్‌లో 78 అక్రమ నిర్మాణాలుండగా.. హైడ్రా పేర్కొంటున్న 32.60ఎకరాల్లో ఎన్ని అక్రమణలుంటాయనే ఆసక్తి నెలకొన్నది. ఇప్పటికే సున్నం చెరువు చుట్టూరా అన్ని వైపులా నిర్మాణాలు వచ్చాయి. కాలనీలు వెలిశాయి. అల్లాపూర్ వైపు కానీ, గుట్టలబేగంపేట వైపు కానీ, బోరబండ వైపు కానీ ఏ మేరకు చెరువులో అక్రమ నిర్మాణాలు చొచ్చుకొచ్చాయో హైడ్రా సర్వేలో స్పష్టం కానుంది.

అప్పట్లో విపక్ష నేతగా సీఎం రేవంత్‌రెడ్డి సందర్శన

సున్నం చెరువులో కబ్జాలపై ఆంధ్రజ్యోతి పలుమార్లు అనేక కథనాలు ప్రచురించింది. పదెకరాల ఎఫ్‌టీఎల్ కబ్జాకు స్కెచ్ వేసి బడా నేతలు తవ్వకాలు చేస్తుండగా.. 2020 నవంబర్ 7న 'చెరువుకు సున్నం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ కథనం ఆధారంగా అప్పట్లో టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సున్నం చెరువును సందర్శించారు. అప్పటి ప్రభుత్వం కబ్జాను పట్టించుకోకపోవడంపై ఎండగట్టారు.

జూలై 11న బ్రహ్మాండమైన విడుదల



TRIPURA CREATIONS THRU PARAMJYOTHI FILMS

మెరుగైన నైపుణ్యాలతో ఉద్యోగాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న మంత్రి వివేక్, చిత్రంలో దానకిషోర్, గంగాధర్

గన్‌పార్క్ జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన నైపుణ్యాన్ని పెంపొందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని కార్మిక ఉపాధి కల్పన, మైనింగ్ శాఖల మంత్రి గడ్డం వివేక్ అన్నారు. శనివారం నగరంలోని మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఎక్సలెన్సీ అవార్డుల విజన్ వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, తెలంగాణ గేట్ వే ఫర్ అడాప్టివ్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ పాలసీ విధానాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రానున్న కాలానికి అనుగుణంగా విజన్ డిపార్ట్‌మెంట్‌కు రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఐటీఐ, ఏటీసీల లోగోను ఆవిష్కరించారు. ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ మాట్లాడుతూ, దేశంలోని వెయ్యి ఐటీఐల్లో మన రాష్ట్రంలోని ఐటీఐలు ముందు వరుసలో ఉండేలా అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చట్టినట్లు అనంతరం ఉత్తమ విద్యార్థులు, ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు గంగాధర్, శ్రీనివాస్‌రావు, నగేష్, పారిశ్రామిక వేత్త జర్మయ్య పాల్గొన్నారు.

మద్దాళి రఘురామ్‌కు రంగస్థల పురస్కారం

రవీంద్రభారతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలుగు సాంస్కృతిక రంగానికి, రంగస్థలానికి రఘురామ్ చేస్తున్న సేవలు ఎనలేనివని విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో గరిమెళ్ళ రామమూర్తి 89వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కిన్నెర సంస్థ కార్యదర్శి రఘురామ్‌కు రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, రమణాచారి పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సేవ చేస్తున్న వారిని సత్కరించుకోవడం సంతోషకరమని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగు నాటక, కళా రంగానికి రఘురామ్ సేవలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపీఎస్ హెచ్.జె.దొర, ఓలేటి పార్వతీశం, విజభాస్కర్, సుబ్బరాయశర్మ, కోట్ల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు సాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే జనరల్ బోగీలు నాటిక ప్రదర్శించారు.

అనన్య కూచిపూడి రంగప్రవేశం


నాట్యం చేస్తున్న నర్తకి అనన్య

రవీంద్రభారతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చక్కటి హావభావాలతో వైవిధ్యభరితంగా నర్తించి యువ నర్తకి అనన్య ప్రేక్షకుల్ని రంజింపజేసింది. శనివారం రవీంద్రభారతిలో శ్రీవెంకటేశ కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు కుబేరిణి శిష్యురాలైన అనన్య పార్స కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేసింది. ఈ సందర్భంగా దుర్గతరంగం, స్వాగతం కృష్ణా, తిల్లాన, మంగళం తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించింది. తొలి బహిరంగ ప్రదర్శనలో చక్కటి అడుగులతో నర్తించి అనన్య ఆహూతుల్ని అలరించింది. లయబద్ధంగా సాగిన నాట్యాంశాలకు వైవిధ్యంగా సాగిన నాట్యం జనరంజకంగా సాగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని నర్తకి అనన్యను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం గురువు కుబేరిణికి గురుసత్కారం చేశారు.

ఘనంగా రాయసం పురస్కారాల ప్రదానోత్సవం

రవీంద్రభారతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమాజహితం కోరే సాహిత్యం రావాల్సిన అవసరముందని విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. శనివారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రాయసం సుబ్బారాయుడు, రాయసం మహాలక్ష్మీల పేరిట పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డా.తటవర్తి రాజగోపబాలం, వాడ్రేవు వీరలక్ష్మీదేవిలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిన్నెర సంస్థఆధ్వర్యంలో విభిన్నమైన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. రాయసంవారి సేవలను కొనియాడారు. రాయసం కుటుంబ సభ్యులు వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, పి.రఘు, ఓలేటి పార్వతీశం, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

- ఐపీఎస్ మహేష్ భగవత్

రవీంద్రభారతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించాల్సిన అవసరముందని దాంతో యూపీఎస్సీ వంటి పరీక్షలను సునాయసంగా అధిగమించగలరని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఐపీఎస్ మహేష్ భగవత్ అన్నారు. శనివారం బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో క్రివి ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల యూపీఎస్సీలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ మహేష్ భగవత్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితే ఏదైనా సాధించవచ్చని అన్నారు. యువతలో ఉత్సాహాన్ని పెంపొందించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మరో ముఖ్య అతిథి శాట్స్ మాజీ చైర్మన్ అల్లం పురం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యాంత్రోపిక్ గ్రూప్ ఎం.డి. మహ్మద్ అయాజ్, మురళీ మనోహర్, శ్యామ్ కోఠారి, వేదకీర్తి తదితరులు పాల్గొని యూపీఎస్సీ, బ్యాంకింగ్, డిఫెన్స్, 150కంటే ఎక్కువ పోటీ పరీక్షల కోసం స్మార్ట్ బుక్స్‌ను ఆవిష్కరించారు. కట్ట గుణవంత్, దేవడ దీపక్, పెట్టం అభినవ వర్మ, మహేష్ చెబ్రోలు, బి.ఎల్.వి.ప్రసాద్, అంజయ్, నర్సింహా, అనిల్‌కముఆర్, రాము లను ఘనంగా సత్కరించారు.

దేవుళ్ల చిత్రపటాల వెనుక
గంజాయి పొట్లాలు దాచి..

- నగరంలో గుట్టుగా విక్రయిస్తున్న స్మగ్లర్స్
- ఆటకట్టించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- రెండు కేసుల్లో ఆరుగురు స్మగ్లర్స్ అరెస్టు
- 21.33 కేజీల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): శత కోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు అన్నట్టుగా ఉంది గంజాయి స్మగ్లర్స్ పరిస్థితి. సరుకు సరఫరాలో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు కొత్తకొత్త ఎత్తులతో గంజాయిని తరలిస్తున్న స్మగ్లర్స్.. చివరకు దేవుళ్లనూ వదల్లేదు. ఏకంగా దేవుళ్ల చిత్రపటాల వెనుక గంజాయి పొట్లాలు దాచిపెట్టి నగరంలో విక్రయిస్తున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ టాస్క్ పోలీసులు దాడులు నిర్వహించగా.. రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురు స్మగ్లర్స్ పోలీసులకు చిక్కారు. వారి నుంచి 21.33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ టీం లీడర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంజా యి అక్రమ రవాణాతో ఒడిశా నుంచి నగరానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు సిటీలో రెండు చోట్ల అమ్మకాలు జరిపారని విశ్వసనీయ సమాచారం వచ్చింది. దాంతోఅంజిరెడ్డి బృందం రెండు చోట్ల దాడులు నిర్వహించింది. రెండు చోట్ల కలిపి 21.33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- మొదటి కేసులో రోహన్ సింగ్ యశ్వంత్‌సింగ్‌లను దూల్‌పేటలోని ఇందిరానగర్‌లో అరెస్టు చేసిన పోలీసులు విచారించిన క్రమంలో నగరానికి దిగుమతి చేసిన గంజాయిని చిన్నచిన్న పొట్లాలుగా ప్యాక్ చేసి, పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు పూజగదిలో దేవుళ్ల ఫొటోల వెనక పెట్టి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు గుర్తించారు. నిందితుల్లో ఒకడైన రోహన్ సింగ్ తాను ఉండే ఇంట్లో పూజ గదిలో దేవుళ్ళ ఫోటో వెనుక పెట్టి 10.934 కేజీల గంజాయి పొట్లాలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇంట్లో ఎక్కడా గంజాయి దొరక్కపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు పూజ గదిని పరిశీలించగా అక్కడ గంజాయి దొరికింది.

- మరో కేసులో దూల్‌పేట శివలాల్ నగర్‌లో సంకీర్ సింగ్, సుశీల్ సింగ్, సరితా, స్వప్న మండల్ అలియాస్ మీనా బాయ్ (ఒడిశా) వద్ద 10.4 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. మరో నిందితుడు రాజవీర్ బారిక్ పరార్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఈ రెండు కేసుల్లో పట్టుకున్నటువంటి గంజాయి విలువ రూ.10.75లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.


దేవుళ్ల చిత్రపటాల వెనుక చిక్కిన గంజాయి పొట్లాలు

సదానంద గుప్తా సేవలు మరువలేనివి


సదానందం గుప్తాను సత్కరిస్తున్న సురేశ్‌గుప్తా, చైర్మన్ ధనుంజయ్ గుప్తా

మంగళ్‌హాట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం పురానపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు కృషి చేసిన కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా సేవలు మరువలేనివని అధ్యక్షుడు గుండా సురేశ్ గుప్తా, చైర్మన్ ధనుంజయ్ గుప్తా పేర్కొన్నారు. ఈమేరకు నిర్వహించిన అభినందన సభలో మాడిశెట్టి సదానందం గుప్తా దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కిశోర్‌గుప్తా, సెక్రెటరీ యాదగిరి, కోశాధికారి సీహెచ్ గోవింద్ గుప్తా పాల్గొన్నారు.

అంతర్జాతీయ మత్స్యసహకార సంఘం దినోత్సవం

కార్వాన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రాథమిక మత్స్య సహకార సంఘం దినోత్సవం సందర్భంగా శనివారం కార్వాన్ సబ్జీమండిలోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొర్నల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందేసి వేణుబాబు హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, మత్స్య సహకార సంఘం అభివృద్ధికి ఎళ్లవేలా కృషి చేస్తానని, అందుకు గంగపుత్ర సంఘం సహాయ సహకరాలు అవసరమన్నారు. కార్యక్రమంలో మురారి రాంబాబు, మంగలిపల్లి బాల నరసింహ, చెరకు బాబు, మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం జియాగూడ అధ్యక్షులు చట్లా శ్రీనివాస్, కార్యదర్శి పూస శ్రీనివాస్, చెరకు రాజశ్రీ, దీపిక, తిరుమలానంద, సుబ్రహ్మణ్యం, గుడుమని విద్య, కుడుముల రేఖ, స్వాతి, లావణ్య, లావణ్య పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

నార్సింగ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గంధంగూడ టీజేఎంసీ లిబ్హామ్ విలాస్ రెసిడెన్షియల్, ఆల్‌కాలనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమానికి డివిజనల్ ఇంజనీర్ డీఈ యాదయ్య హాజరై మొక్కలు నాటారు. ఈసందర్భంగా యాదయ్య మాట్లాడుతూ, ప్రజలు పూర్తిస్థాయిలో పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లిబ్హామ్ విలాస్ రెసిడెన్షియల్, ఆల్ కాలనీ ఫెడరేషన్ వారు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాల్లో తమవంతు సహాయ సహకారాలు అందించడం హర్షించదగ్గ విషయమని ఆయన కొనియాడారు.

'ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి'

హిమాయత్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్‌ఓ ప్లాంట్, స్టేషనరీ సామగ్రిని అందించేందుకు వాసవీ క్లబ్, కేసీజీఎఫ్ బుద్ధ పూర్ణిమ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్‌లీడర్ జి.శంకర్ యాదవ్, రంగ నరసింహగుప్తా అన్నారు. శనివారం గోషామహల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఎ.రమేశ్ అందించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీసీఐ, దుబాయ్ వాయిస్ గవర్నర్ బొజ్జ వివేకానంద, బెజగం రమేశ్, వాసవీ క్లబ్ బుద్ధ పూర్ణిమ అధ్యక్షుడు మేడం చంద్రశేఖర్, సెక్రెటరీ ఎం.రఘు, కోశాధికారి ఎస్.మురళీ గుప్తా, పాఠశాల అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి, హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'బోనాలకు సుందరీకరణ ఏర్పాట్లు చేయండి'

పహాడిషరీఫ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ కాలనీలో అమ్మవారి ఆలయాల వద్ద పరిసరాల్లో సుందరీకరణ, మరమ్మతు పనులు పండుగ కన్నా ముందే పూర్తి చేయాలని మాజీ కౌన్సిలర్లు శ్రీధర్ గౌడ్, పల్లపు శంకర్, కాంగ్రెస్ నాయకుడు మన్న రవికుమార్, లక్ష్మీనారాయణ శనివారం జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్రామ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 13న బోనాల సందర్భంగా శ్రీరామకాలనిలో పోచమ్మగుడి నుంచి బోడ్రాయి వరకు దుర్గమ్మ గుడి వరకు విధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న విదేశీ పర్యాటకులు



నార్సింగ్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటపై ఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో బోనాల ఉత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే కోట అంతా పండుగ ఉత్సవంగా అలంకరించి ఉండడం, సంబరాలు జరుగుతుండడంతో ఈ విషయం తెలుసుకున్న విదేశీ పర్యాటకులు కొంత మంది పూజా సామాగ్రి కొనుక్కుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐటీ కంపెనీ పని నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన కొన్ని ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, జపాన్, థాయ్‌లాండ్, ఇండోనేషియాకు చెందిన విదేశీయులు కోటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. వారి పేర్లతో అర్చన కార్యక్రమం కూడా నిర్వహించుకున్నారు. తమకు ఎంతో సంతోషంగా ఉందని, ఇంత పెద్ద కోటలో కొలువైన అమ్మవారు మాకు దర్శనమివ్వడం సంతోషంగా ఉందన్నారు.

9న సార్వత్రిక సమ్మెకు విద్యార్థి సంఘాల మద్దతు

హిమాయత్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సారత్రిక సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్, రాష్ట్ర నాయకులు హరీష్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ పాల్గొన్నారు.

అల్కాపూర్‌లో ట్రాన్స్‌కో అవగాహన సదస్సు

నార్సింగ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో పురజనులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఆల్ కాలనీఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ ఈకార్యక్రమానికి సారథ్యం వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రమేష్‌చంద్ర, ఏఈ సంతోష్‌కుమార్, ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ట్రాన్స్‌కోలో వినియోగదారుల సేవలు, ఇబ్బందులు, సమస్యల పరిష్కారంపై వారు చర్చించా రు. ఎలాంటి ఇబ్బందులున్నా ట్రాన్స్‌కో అధికారులను నేరుగా సంప్రదించాలని, ట్రాన్స్‌కో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

డాక్టర్లకు అవార్డులు

నార్సింగ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2025ను అందజేశారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్న డాక్టర్లుకు అవార్డులు అందజేశారు. అందులో భాగంగా కార్వాన్ నియోజకవర్గానికి చెందిన్ డాక్టర్ మురళీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌లకు అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు.

విఠలేశ్వర రుక్మాబాయిల బ్రహ్మోత్సవాలు

అఫ్జల్‌గంజ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గౌలిగూడ విఠల్‌నగర్‌లోని చారిత్రాత్మక జంగల్ విఠలేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం ఆలయ ప్రాంగణంలో విఠలేశ్వర రుక్మాబాయి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ, గోపూజ, కలశ స్థాపన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు ఆలయ చైర్మన్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ జి.శంకర్ యాదవ్, ఆలయ అధ్యక్షుడు ఉస్కెల కిషన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, కోశాధికారి పాండు యాదవ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ఈనెల 6 నుంచి 13వ తేదీవరకు ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట: సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ నిరంతరం పనిచేస్తోందని సీపీ అవినాష్ మహంతి అన్నారు. వారం రోజుల వ్యవధిలో (జూన్ 29 నుంచి జూలై 5 వరకు) కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 154 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న వారిపై, ఆన్‌లైన్‌లో వేధింపులకు గురి చేస్తున్న వారిపై 57 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 85 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహహింసకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్‌లో 29 ఫిర్యాదులు రాగా వాటిలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. మిగతా జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు 9 మంది యువతులను రక్షించారు. ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 74 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు, 69 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 23 కేసులు నమోదు చేశారు. భరోసా సెంటర్‌లో కుటుంబ కలహాలతో వచ్చిన 31 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/h1yCzA7లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhra-jyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

న్యాయవాదులు సమాజంలో సోషల్ ఇంజనీర్స్


ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

బర్కత్‌పుర, జూలై 5(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సమాజంలో సోషల్ ఇంజనీర్స్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. న్యాయవాద వృత్తికి ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉందని, తాను న్యాయవాద వృత్తి నుంచి ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. శనివారం రాత్రి బషీర్‌బాగ్‌లోని పీజీ న్యాయ కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈవేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో ఉపాధి లభిస్తుందని కొత్తగా వచ్చిన న్యాయచట్టాలను యువ న్యాయవాదులు మేళవింపు చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన పెంపొందితే మంచి సమాజ నిర్మాణంలో న్యాయవాదులు కీలక పాత్రపోషిస్తారని అన్నారు. లోకాయుక్త జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎవరికి తలవంచాల్సిన అవసరం లేదని, రాజ్యాంగం, చట్టాలపై పూర్తి అవగాహన పెంపొందించుకున్నప్పుడే న్యాయవాదులుగా రాణిస్తూ అందరికీన్యాయం అందించగలరని అన్నారు. ఈసందర్భంగా పీజీ న్యాయ కళాశాలలో చదివి జూనియర్ జడ్జీలుగా నూతనంగా నియమితులైన ప్రమీద, అశ్విని, శ్రీవల్లీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బాలరంగయ్య, హైకోర్టు సీనియర్ న్యాయవాది రఘునాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

గన్‌పార్క్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ హామీల్లో ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు చేయకుండా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. శనివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం ఆయన గన్‌పార్కు వరకు పార్టీ శ్రేణులతో కలిసి గన్‌పార్కులోని అమర వీరుల స్తూపం వద్దకు చేరుకొని అమరులకు నివాళులర్పించారు. అనంతం రాంచందర్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని గొప్పలు చెప్పి 600 రోజులైనా ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నా రు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండోగని భరత్‌గౌడ్, సీనియర్ నేతలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడంలేదన్నారు. ఆరు గ్యారంటీలపై ప్రజలు నిలదీసే రోజులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశాంరు. కార్యక్రమంలో నేతలు కాచం వెంకటేశ్వర్లు, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు

గోషామహల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోషామహల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించడంతోపాటు కొత్తగా మూతలు ఏర్పాటు చేయిస్తున్నామని నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెట్ కోటి శైలేష్ కురుమ తెలిపారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలు రానుండడంతో డివిజన్‌లోని ఆర్య సమాజ్, చందన్‌వాడీ, గోషామహల్ తదితర బస్తీల్లో డ్రైనేజీలకు మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. ఆలయాల వద్ద మట్టి దిబ్బలు, చెత్తాచెదారంతో పాటు రోడ్డుకు ప్యాచ్‌వర్క్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసు యాదవ్,కిరణ్, హనీఫ్, సులేమాన్, జి.గణేష్, విశాల్ యాదవ్ పాల్గొన్నారు.

జీరో ఎన్‌బీడబ్ల్యూ రికార్డు సాధించిన రాచకొండ కమిషనరేట్

- 40 రోజుల్లో 2024 ఎన్‌బీడబ్ల్యూ కేసులు పరిష్కారం
- నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- సిబ్బందిని అభినందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ. జూలై 5(ఆంధ్రజ్యోతి): నేర చరిత్ర కలిగిన వారు సమాజంలో తిరగడం వల్ల ప్రజలకు, ఆయా కేసుల్లో సాక్షులకు ఇబ్బంది కరంగా మారుతోందని, ఈ సమస్యపై దృష్టి పెట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని నాన్‌బెయిలబుల్ వారెంట్ల కేసులు పరిష్కారం చేశామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. నాగోల్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ, న్యాయస్థానంలో కేసుల విచారణ సందర్భంలో నిందితులు ఉద్దేశ్యపూర్వకంగా హాజరు కాకుండా తప్పించుకుంటున్నారని, ఈ కారణంగా కేసుల విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. రాచకొండ కమిషనరేట్‌పరిధిలో 50,249 కేసులకు సంబంధించి కోర్టుల్లో విచారణ జరుగుతోందన్నారు. కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా, కేసు విచారణను జాప్యం చేస్తుండడంతో న్యాయస్థానాలు వారిపై నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)లు జారీ చేశాయన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కమిషనరేట్ పరిధిలో 1088 ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉండగా, ఏప్రిల్‌కు వీటి సంఖ్య 2024కు చేరిందన్నారు. దీనిపై దృష్టి సారించి ఈ కేసులను లాంగ్ పెండింగ్, గ్రేవ్, నాన్‌గ్రేవ్, కమిషనరేట్ పరిధి, ట్రై కమిషనరేట్ పరిధి, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు విభజించి కార్యచరణ ప్రారంభించామన్నారు. కేసులను పరిష్కరించేందుకు ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లతో కూడిన 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బృందాలకు అవసరమైన వాహనాలు ఇతర అలవెన్స్‌లు అందించి ఇతర రాష్ట్రాలకు పంపామన్నారు. పత్ర్యేక బృందాలకు చెందిన సిబ్బందిని ఏపీ, మహారాష్ట్ర, రాజస్థాన్‌లకు పంపి నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పరిచామన్నారు. రికార్డు స్థాయిలో 40 రోజుల వ్యవధిలో 2024ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించామన్నారు. తప్పించుకు తిరుగుతున్న మరో 823కేసుల్లో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రకటనలు జారీచేశామన్నారు. జూలై చివరికి 2847 కేసులకు సంబంధించి దర్యాప్తు పూర్తి చేసి, జీరో ఎన్‌బీడబ్ల్యూ సాధించిన కమిషనరేట్‌గా చరిత్ర సృష్టించామన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ అయినా పరారీలో ఉన్న నిందితులకు పూచికత్తు ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నేరగాళ్ల, షూరిటీ ఇచ్చిన వారి ఆస్తులు జప్తు చేసేందుకు న్యాయ ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.

ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించడం ద్వారా న్యాయస్థానాల్లో కేసుల విచారణ వేగం పుంజుకుంటుందని, కేసుల్లో నిందితులకు శిక్షలు పడతాయన్నారు. నేరగాళ్లు సమాజంలో తిరగకుండా చేయడం ద్వారా ప్రజలు, ఆయా కేసుల్లో సాక్షులు ఎలాంటి ఆందోళన లేకుండా ఉంటారన్నారు. అంతేకాకుండా ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న పాత నేరస్థులు ఇతర నేరాలు చేయకుండా నిరోధించ వచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా మంచి పనితీరును ప్రదర్శించిన ప్రత్యేక బృందాల అధికారులు, సిబ్బందికి రివార్డులు అందించారు.


ప్రత్యేక బృందాలకు ప్రశంశా పత్రాలు అందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

- గత ఏడాది నుంచి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1408 ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించారు.
- దర్యాప్తులో నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు పెండింగ్‌లో ఉన్న 52 మంది చనిపోయారని పోలీసులు నిర్ధారించారు.
- ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న 14 మంది ఇతర కేసుల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్నారు.
- 13 కేసుల్లో పరారీలో ఉన్న నేరస్థులకు జామీను (షూరిటీ) ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశారు.



ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389
కె. అనిల్ కుమార్: 99854 03628

బోనాల జాతరలో ఆకతాయిల అరాచకాలు

హైదరాబాద్ సిటీ/కార్వాన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోటలో జరుగుతున్న బోనాల జాతరలో పోకిరీ గ్యాంగ్‌లు భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. అల్లరిమూకలు, రౌడీ గ్యాంగ్‌లు గ్రూపులుగా ఏర్పడి గోల్కొండ కోటలో గ్యాంగ్‌వార్‌లకు పాల్పడుతున్నాయి. కొట్లాటలకు, దాడులకు దిగుతూ.. జాతరలో భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో మహిళా భక్తులు కోటకు రావాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు.

గోల్కొండ కోటలో సుమారు 50 నుంచి 60 మంది పోకిరీలు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు గ్యాంగ్‌వార్‌కు దిగిన ఘటన శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలస్యంగా అక్కడికి వచ్చి వారిని చెదరగొట్టినప్పటికీ మళ్లీ కోటలోని మరో ప్రాంతంలో గ్యాంగ్ వార్‌కు దిగారని భక్తులు పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌వార్‌లతో కోటకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పోకిరీలకు అడ్డాగా గోల్కొండ కోట

గోల్కొండ బోనాల జాతరకు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్తున్న పోలీసులు.. మహిళా భద్రతను పెద్దగా పట్టించుకోకపోవడంతో పోకిరీలు, ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మొక్కులు తీర్చుకోవడానికి వస్తున్న మహిళా భక్తులతో అసభ్యకరంగా మాట్లాడుతూ.. అభ్యంతరకరంగా తాకుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారు. గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద, కోటలోని పార్కులో, పుట్ట ప్రాంతం వద్ద ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి.



గోల్కొండ కోటలో పరస్పరం దాడి చేసుకుంటున్న రెండు గ్రూపులు

షీటీమ్స్, లోకల్ పోలీస్ ఎక్కడ..?

గోల్కొండ కోటలోని రద్దీ ప్రాంతంలో మఫ్టీలో ఉండి, స్పై కెమెరాలతో సంచరిస్తూ టెక్నికల్‌గా, రెడ్‌హ్యాండెడ్‌గా పోకిరీల ఆటకట్టించాల్సిన షీటీమ్స్ మచ్చుకైనా కనిపించడంలేదని మహిళా భక్తులు, నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోల్కొండ కోటలో పోకిరీలు తిష్టవేసే ప్రాంతాలపై పట్టున్న లోకల్ పోలీసులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ.. పోకిరీల అరాచకాలను పట్టించుకోడంలేదనే విమర్శలు ఉన్నాయి. గత సంవత్సరం కూడా నాల్గో బోనం సందర్భంగా గోల్కొండ కోటకు పెద్ద ఎత్తున భక్తులు రావడంతో.. ఒకరిపై ఒకరు దాడులకు దిగి తలలు పగలుగొట్టుకున్న సందర్భాలూ ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలీస్ ఉన్నతాధికారులు కోటలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేయాలని కోటకు వచ్చే భక్తులు కోరుతున్నారు.

బీసీలంతా ఒకే తాటిపై నిలిస్తే సీఎం పదవి మనదే

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు



శీలం లక్ష్మణ్ జీవిత చరిత్రపై రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

బర్కత్‌పుర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులతో పాటు బీసీ కులాలలో ఐక్యత లేకపోవడం వల్లే రాజ్యాధికారానికి దూరం అవుతున్నామని బీసీలంతా ఒకే తాటిపై నిలిస్తే రాబోయే సీఎం పదవి మనదేనని మాజీ ఎంపీ వి.హనుమంతరావు స్పష్టం చేశారు. శనివారం మున్నూరు కాపు ముద్దుబిడ్డ పాండిచ్చేరి రాష్ట్ర మొదటి లెఫ్టినెంట్ గవర్నర్ శీలం లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మున్నూరు కాపు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆయన జీవిత చరిత్రపై రూపొందించిన బ్రోచర్‌ను వీహెచ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీలం లక్ష్మణ్ మహారాష్ట్ర ఎమ్మెల్యేగా, అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసి దేశసేవకు జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంతోష్, హైకోర్టు న్యాయవాది రవి, మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధానకార్యదర్శి పెంటయ్య, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన కర్ణన్

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ శనివారం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చుడిబజార్‌లో ఉన్న ప్రధాన ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పనితీరు, నియంత్రణ పద్ధతులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసీ ఎలక్షన్ మంగతాయారు, ఇతర అధికారులు ఉన్నారు.



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఆర్.వి.కర్ణన్

నేడు మొహర్రం ఊరేగింపు

డబీర్‌పురా నుంచి చాదర్‌ఘాట్ వరకు..

చార్మినార్ జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత పరిరక్షణ కోసం కర్బలా మైదానంలో పోరడుతూ వీర మరణం పొందిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్‌ను, 72మంది బంధువులను స్మరిస్తూ గత నెల 26నుంచి షియా ముస్లింలు మొహర్రం సంతాప దినాలను పాటిస్తున్నారు. ఇందులో భాగంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లోని ఆషుర్ ఖానాలలో ఆలంలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజులుగా మాతం, మజ్లీస్లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పదో మొహర్రం సందర్భంగా పాతబస్తీలో బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. డబీర్ పురాలోని బీబీ కా ఆలంను ఏనుగుపై పాతబస్తీ ప్రధాన వీధుల్లో సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నారు. డబీర్‌పురా నుంచి బయలుదేరే ఊరేగింపు డబీర్‌పురా దర్వాజా, యాకుత్‌పురా, కోట్ల అలీజా, చార్మినార్, మీరాలంమండి, దారుషిఫా నుంచి చాదర్‌ఘాట్ వరకు కొనసాగనుంది.

పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

బీబీ కా అలమ్ ఊరేగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయని నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

- షేక్ ఫైజ్ కమాన్ వైపు వాహనాల రాకపోకలను అనుమతించారు. జబ్బార్ హోటల్ వద్ద డబీర్‌పురా దర్వాజా లేదా చంచల్‌గూడ వైపు మళ్లిస్తారు.
- ఎతెబార్ చౌక్ నుంచి వచ్చే వాహనాల రాకపోకలను బడా బజార్ వైపు అనుమతించరు. ఎతెబార్ చౌక్ వద్ద కోట్ల అలిజా లేదా పురానా హవేలి వైపు అవసరాన్ని బట్టి మళ్లిస్తారు.
- ప్రధాన ఊరేగింపు యాకుత్‌పురాలోని గంగానగర్ నాలా చేరుకున్నప్పుడు, పురానీ హవేలి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఎతేబార్ చౌక్ వైపు అనుమతించరు. పురానీ హవేలి వద్ద చత్తా బజార్, డబీర్‌పురా లేదా రోటరీ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు కోట్ల అలీజా చేరుకున్నప్పుడు, మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను చౌక్ మైదాన్ ఖాన్ వైపు అనుమతించరు. వీటిని హఫీజ్ దంకా మసీదు వద్ద పారిస్ కేఫ్ లేదా బీబీ బజార్ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు చార్మినార్ చేరుకున్నప్పుడు, షక్కర్‌కోట్ నుంచి వచ్చే వాహనాలను గుల్జార్ హౌజ్ వైపు అనుమతించరు. వీటిని మిట్టి కా షేర్ జంక్షన్ వద్ద ఘాన్సీ బజార్ లేదా చెలాపురా వైపు మళ్లిస్తారు.
- నయాపూల్ నుంచి వచ్చే వాహనాలను చార్మినార్ వైపు అనుమతించరు. మదీనా క్రాస్ రోడ్ వద్ద సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు.
- ఊరేగింపు మీరాలం మండికి చేరుకున్నప్పుడు, చాదర్‌ఘాట్ రోటరీ, నూర్ఖాన్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, శివాజీ వంతెన నుంచి వచ్చే వాహనాలను పురానీ హవేలీ వైపు అనుమతించరు. వీటిని సాలార్‌జంగ్ రోటరీ వద్ద నయాపూల్, శివాజీ వంతెన, నూర్ఖాన్ బజార్ వైపు మళ్లిస్తారు.
- గౌలిగూడ, అఫ్జల్‌గంజ్ నుంచి వచ్చే వాహనాలను సాలార్‌జంగ్ శివాజీ వంతెన వైపు అనుమతించకుండా గౌలిగూడ వైపు సాలార్ జంగ్ శివాజీ వంతెన ప్రవేశ ద్వారం వద్ద అఫ్జల్‌గంజ్, గౌలిగూడ వైపు మళ్లిస్తారు.

ఢిల్లీ పాలకులు దిగొచ్చేలా రైల్‌రోకో

● ఎమ్మెల్సీ కవిత ● రైల్‌రోకోకు భీం ఆర్మీ మద్దతు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పాలకులు దిగొచ్చేలా రైల్‌రోకో నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఈ ఉద్యమంలో పౌర సమాజం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్‌రోకోకు భీం ఆర్మీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. భీం ఆర్మీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆయాజ్ ఆధ్వర్యంలో నాయకులు బంజారాహిల్స్‌లోని నివాసంలో శనివారం ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. రైల్‌రోకోకు భీం ఆర్మీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు సాధించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం ఒక్కటే మార్గమని అన్నారు.

రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కుట్ర

రాష్ట్రంలో రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎమ్మెల్సీ కవిత 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం జూన్‌లో ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ చేసిందన్నారు. జూన్‌లో పంపిణీ చేసిన రేషన్‌ను అనివార్య కారణాలతో 7.24 లక్షల కుటుంబాలు తీసుకోలేదని తెలిపారు. రేషన్ తీసుకోకపోవడాన్ని సాకుగా చూపుతూ ఈ కుటుంబాల రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

ఉద్యమ కళాకారుల వేదిక జిల్లాల కన్వీనర్ల ఎంపిక



సమావేశంలో కన్వీనర్లు, కోకన్వీనర్ల ఎంపికను ప్రకటిస్తున్న వేదిక నేతలు

చిక్కడపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు జిల్లాల కన్వీనర్లను ఎంపిక చేశారు. శనివారం చిక్కడపల్లిలోని వేదిక రాష్ట్ర కార్యాలయంలో వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల యాదగిరి, కొంపల్లి సాయిలు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కన్వీనర్లుగా కొయ్యడ రాజేష్, సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా స్వరూపరాణి, బాలలక్ష్మమ్మ, గజ్వేల్ కన్వీనర్లుగా యాదగిరి, చంద్రకళ, నాగర్‌కర్నూలు కన్వీనర్లుగా కొంపల్లి సాయిలు, మాడుగుల వెంకటయ్య, మెదక్ కన్వీనర్లుగా కొండలు, యాదగిరి, సంగారెడ్డి కన్వీనర్‌గా రేణుక, భువనగిరి కన్వీనర్లుగా సుగుణమ్మ, లావణ్య, రంగారెడ్డి కన్వీనర్‌గా ఇందిరలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు కంచర్ల బద్రి, మహిళావేదిక ప్రధానకార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా టు మహారాష్ట్ర గంజాయి సరఫరా

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 45.86 కిలోల సరుకు పట్టివేత
- నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్



జీఆర్‌పీ పోలీసుల అదుపులో గంజాయి సరఫరా నిందితులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురు సభ్యులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 45.86 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన బాలి అతీష్ పవార్(28), రోహిత్ గోజీ చవాన్(35), రజినీ చవాన్(28), పద్మ అశోక్ పింపాలే(44) ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయి కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఒడిశాలో ఉంటున్న భూరా, అశిష్ కుమార్ వద్ద 45.86 కిలోల గంజాయి కొనుగోలు చేసిన ముఠా సభ్యులు బెర్హంపూర్ రైల్వే స్టేషన్‌లో ఫలక్‌నుమా రైలు ఎక్కి శనివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగారు. గంజాయి బ్యాగుతో రైల్వే స్టేషన్‌లోని వెయింటింగ్ హాలులో కూర్చున్నారు. వీరి బ్యాగులను సికింద్రాబాద్ రైల్వే పోలీసు బృందం తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో నలుగురిని అరెస్ట్ చేసి, గంజాయి బ్యాగును జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జిమ్నాస్టిక్ పోటీలు షురూ



పుల్లెల గోపీచంద్‌కు జ్ఞాపికను ప్రదానం చేస్తున్న కీర్తిరెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గాడియం స్కూల్‌లో జాతీయ జిమ్నాస్టిక్ పోటీలను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ శనివారం ప్రారంభించారు. రెండ్రోజులు పాటు జరగనున్న ఈ పోటీల్లో 15 రాష్ట్రాలకు చెందిన 850 మందికి పైగా జిమ్నాస్టులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో గాడియం పాఠశాల డైరెక్టర్ కె.కీర్తిరెడ్డి, కల్నల్ కమలేష్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : డీవైఎఫ్ఐ

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావిద్ ఒక ప్రకటనలో కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఇంజనీరింగ్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. బకాయిలు చెల్లించిన తర్వాతనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతుండడంతో చాలామంది తల్లిదండ్రులు అప్పులు చేసి చెల్లిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో దండోరా జెండాను ఎగరవేయాలి

● వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

రాంనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న అన్ని గ్రామాల్లో దండోరా జెండాను ఎగరవేయాలని మాదిగ జాతికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ సూచించారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 31 సంవత్సరాలుగా మాదిగ జాతి అస్థిత్వం కోసం ఆత్మగౌరవం కోసం జాతి ఉద్యమంలో పాల్గొన్న సీనియర్ నాయకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లూరు వెంకట్, వరిగడ్డి చందు, తిరుమలేష్, జన్నారపు జీవన్, ఎల్. నాగరాజు, సురేష్, శ్యామ్‌రావు, మనీ, ఫణి, తదితరులు పాల్గొన్నారు.

NOTICE INVITING TENDERS
HMT SATHAVAHANA NAGAR KUKATPALLY. 500072

Sealed tenders are invited in **"Two Bid System"** from reputed educational institutions for School premises in our HMT Sathavahana Nagar on **As is Where is** condition as given in the tender documents. Tender forms & details are available at our community hall. ALSO CAN REACH US AT: **hmtwelassc@gmail.com**
Contact Mobile Nos: 9391120839 & 9966201269.
Last date for bid Submission:17-07-2025.

President.
HMT SATHAVAHANA NAGAR WELFARE ASSOCIATION

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME ఎల్లారెడ్డిగూడ శాఖ (63784), ఎల్లారెడ్డిగూడ, హైదరాబాద్ - 500073

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ (3)తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద.

దిగువ తెలిపిన రుణగ్రహీత/లు, సహ-రుణగ్రహీత & హామీదారులు బ్యాంకు నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మొత్తాన్ని మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని మరియు సదరు రుణాలు నాన్-పర్ఫార్మింగ్ అసెట్స్ (NPA)గా వర్గీకరించబడినవని ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద వారి చివరిగా తెలిసిన చిరునామాలకు నోటీసులు జారీచేయబడినవి. కాని, అవి అందజేయకుండా తిరిగి వచ్చినవి మరియు అందువలన వారికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

రుణగ్రహీత/ యూనిట్ పేరు: మెసర్స్ శుభం ఇండస్ట్రీస్, ప్రాతినిధ్య భాగస్వాములు: 1. శ్రీ గౌరిశెట్టి శ్రీనివాస్ తండ్రి శ్రీ టి. వైకుంఠం, 2. శ్రీమతి అకుల కృష్ణవేణి భర్త శ్రీ స్వర్గీయ ఉపేందర్ మన్నే (మరణించిన భాగస్వామి/ హామీదారు శ్రీ స్వర్గీయ మన్నే ఉపేందర్ యొక్క న్యాయవారసులచే ప్రాతినిధ్యం వహించువారు), 3. శ్రీ నర్సింగ్ యాదవ్ దేశ తండ్రి డి. హనుమంత్ యాదవ్, 4. శ్రీ గోవర్ధన్ మ్యాదం తండ్రి శ్రీ ఎం. రామయ్య.
నమోదిత కార్యాలయం చిరునామా: డి.నం.2-67/టి/20, మహదేవపురం, గాజులరామారం, హైదరాబాద్ - 500055, **యూనిట్ చిరునామా:** డి.నం.2-67/టి/20, మహదేవపురం, గాజులరామారం, హైదరాబాద్ - 500055
భాగస్వాముల నివాస చిరునామా: 1. భాగస్వామి: **శ్రీ గౌరిశెట్టి శ్రీనివాస్,** నివాసం: ఫ్లాట్ నం.301, MVS రెసిడెన్సి, కైలాష్ హిల్స్, మహదేవపురం, హైదరాబాద్-55; 2. భాగస్వామి: **శ్రీమతి అకుల కృష్ణవేణి,** నివాసం: 12-11-365/6, మారుతి స్ట్రీట్, వారాసిగూడ, సికింద్రాబాద్ - 500061; 3. భాగస్వామి: **శ్రీ నర్సింగ్ యాదవ్ దేశ,** నివాసం: 2-5-135, ఉప్పరపల్లి, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500048, 4. భాగస్వామి: **శ్రీ గోవర్ధన్ మ్యాదం,** నివాసం: 3-91, సత్యసాయి నగర్, దొమ్మర పోచంపల్లి, తిరుమలగిరి, హైదరాబాద్ - 500043
ఖాతా నం: CC-42214685864

డిమాండ్ ప్రకటన తేది: 27.06.2025 | ***ఎన్‌పిఎ తేది: 26.06.2025***

జప్తు చేయబోయే సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు - భాగం-1
ప్రాథమిక ఆస్తి:- ప్రస్తుత ఆస్తులు, స్టాక్స్, బుక్ డెట్స్, రిసీవబుల్స్, కన్స్యూమబుల్ స్టోర్స్ & స్పేర్స్ సహా అన్ని తాకట్టుపెట్టబడిన ఆస్తులు మరియు తాకట్టుపెట్టబడిన మూవబుల్ ప్లాంట్ & మెషినరీ మొ.వి.
భాగం-2:
1) రిజిస్టర్డ్ గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నం.781/2023 తేది 14.03.2023 ప్రకారం **శ్రీమతి అకుల కృష్ణవేణి** భర్త శ్రీ ఉపేందర్ మన్నెకు చెందిన తెలంగాణ రాష్ట్రం, సికింద్రాబాద్, వారాసిగూడ వద్దగల సర్వే నం.33లోని 175.0 చ.గజాలు లేదా 146.32 చ.మీటర్ల విస్తీర్ణం గల ఇ.నం.12-11-365/6 (PTIN No.1181202015) కలిగిన నివాస భూమి మరియు భవనం యావత్తు మరియు **సరిహద్దులు:-** ఉత్తరం: N.C. నర్సింహ్మకు చెందిన ఇ.నం.12-11-365/4, దక్షిణం: కమలాకర్ రాంచందర్‌కు చెందిన ఇ.నం.12-11-365/7, తూర్పు: 15 అడుగుల వెడల్పు రోడ్డు, పశ్చిమం: నాలా & పొరుగువారి ఆస్తి.
2) SRO కూకట్‌పల్లి వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.2854/2017 తేది 01.04.2017 ప్రకారం శ్రీ మ్యాదం గోవర్ధన్ తండ్రి శ్రీ మ్యాదం రామయ్యకు చెందిన తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మండలం, దొమ్మర పోచంపల్లి గ్రామం మరియు గ్రామపంచాయతీ వద్దగల సర్వే నంబర్లు 156, 156/ఎ, 156/బి, 156/3, 156/4, 156/7, 158, 159, 160 & 161/భాగంలోని 1492 చ.అ. ప్లింత్ ఏరియా (ఆర్‌సిసి)తో 275.0 చ.గజాల విస్తీర్ణం గల ప్లాట్ నం.64లోని నం.4-92 కలిగిన ఇల్లు యావత్తు మరియు **సరిహద్దులు:-** ఉత్తరం: ప్లాట్ నం.63, దక్షిణం: ప్లాట్ నం.65, తూర్పు: ప్లాట్ నం.91, పశ్చిమం: 25 అడుగుల వెడల్పు రోడ్డు.

చెల్లించవలసిన బకాయి మొత్తం: 26.06.2025 నాటికి **రూ.3,10,35,818/-** ప్లస్ వడ్డీ మరియు వర్తించే చోట ఇతర ఖర్చులు.

ప్రత్యామ్నాయ ప్రకటన అందజేయడానికి చర్యలు తీసుకోబడుచున్నవి. బకాయి మొత్తాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించాలని పైన తెలిపిన రుణగ్రహీత(ల)ను / మరియు / లేదా వారి హామీదారు(ల)ను (వర్తించు విధంగా) ఇందుమూలముగా కోరడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13లోని ఉప-సెక్షన్ (4) క్రింద ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజుల తరువాత తదుపరి చర్యలు తీసుకోబడును.

తేది: 05.07.2025, ప్రదేశం: హైదరాబాద్ | అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గుండెలపై కూర్చొని.. గొంతు నులిమి

భర్తను హత్యచేసిన భార్య

(5వ పేజీ తరువాయి)

కుమారుడు, కుమార్తె ఉన్నారు. హైదరాబాద్‌కు వచ్చి కొద్ది రోజులు మణికొండలో కూలీపనులు చేసి ఆ తర్వాత ముంబైతో పాటు పలు ప్రాంతాలకు వలస కార్మికులుగా వెళ్లి పనిచేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ముంబై నుంచి తిరిగి వచ్చి బాచుపల్లిలో ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలీలుగా చేరి అక్కడే ఉంటున్నారు. అయితే, వలస వెళ్లిన ప్రాంతాల్లో ఏర్పడిన పరిచయాల మేరకు రాధ తరచుగా వారితో ఫోన్‌లో మాట్లాడేది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న అంజిలప్ప మద్యం తాగొచ్చి వేధిస్తూ కొట్టేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 22న ఇద్దరి మధ్య ఈ విషయమై గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న అంజిలప్ప దుర్భాషలాడుతూ భార్యపై దాడి చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కాంట్రాక్టర్ జోక్యం చేసుకొని ఇద్దరినీ హెచ్చరించి పంపించేశాడు. భర్త వేధింపులతో కోపం పెంచుకున్న రాధ అదేరోజు రాత్రి 11.30కు తాగిన మత్తులో ఉన్న అంజిలప్ప గుండెలపై కూర్చొని చేతులతో గొంతు నులిపి హత్య చేసింది. నేరం తన మీదకు రాకుండా ఉండేందుకు అతిగా మద్యం తాగడంతో ఆ మత్తులోనే మరణించాడని మరుసటిరోజు తోటి కార్మికులను నమ్మించింది. అదే విషయాన్ని బంధువులకు చెప్పి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లింది. అంజిలప్ప మెడపై ఉన్న గాయాలను గుర్తించిన సోదరుడు అనుమానంతో నారాయణపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అంజిలప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించారు. అతను మద్యం మత్తులో చనిపోలేదని, హత్య చేశారని తేలడంతో వెంటనే కేసును బాచుపల్లి పోలీసులకు బదిలీ చేశారు. రాధను అదుపులోకి తీసుకున్న బాచుపల్లి పోలీసులు విచారించగా భర్తను తానే గొంతునులిమి హత్య చేసినట్లు నేరం అంగీకరించింది. రోజూ మద్యం తాగి వచ్చి పెడుతున్న వేధింపులను భరించలేకే హత్య చేసినట్లు తెలిపింది. ఈ మేరకు పోలీసులు నిందితురాలిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ మీటర్ల పక్కనే అధికారుల ఫోన్ నంబర్లతో స్టిక్కర్లు



ఓ అపార్ట్‌మెంట్‌లో ప్యానల్ బోర్డులపై ఫిర్యాదు ఫోన్ నెంబర్లు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కరెంట్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు ఇలా ఏ సమస్యలున్నా ఇక నేరుగా విద్యుత్‌శాఖకు ఫిర్యాదు చేసేలా దక్షిణ డిస్కం చర్యలు చేపట్టింది. గ్రేటర్ వ్యాప్తంగా అపార్ట్‌మెంట్లలో విద్యుత్ మీటర్లు ఉన్న ప్యానల్ బోర్డులపై స్థానిక అధికారుల ఫోన్ నంబర్లతో పాటూ ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నంబర్లతో ఉన్న టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేక స్టిక్కర్లు అంటిస్తున్నారు. ఎమర్జెన్సీ నంబర్లతో పాటు ఫిర్యాదుల సంబంధించిన అన్ని రకాల ఫోన్ నంబర్లు స్టిక్కర్లపై ముద్రించి ప్యానల్ బోర్డులపై ఉండేలా సెక్షన్లవారీగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

యూనియన్ బ్యాంకు శాఖల్లో రీ కేవైసీ

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఖాతాదారుల రీ కేవైసీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనియన్ బ్యాంకు శాఖల్లో ఏర్పాట్లు చేసినట్లు బ్యాంకు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఖాతను బట్టి తక్కువ, మధ్యస్థం, హైరిస్క్ ఖాతాలుగా విభజించామన్నారు. హైరిస్క్ ఖాతాదారులు ప్రతి రెండేళ్లకు, మీడియం రిస్క్ ఖాతాదారులు ప్రతి 8 ఏళ్లకు, లోరిస్క్ ఖాతాదారులు ప్రతి 10 ఏళ్లకోసారి రీ కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, యాప్ ద్వారా కూడా ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, ఖాతాదారుల సౌలభ్యం కోసం అన్ని శాఖల్లో రీ కేవైసీ కోసం ఏర్పాట్లు చేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

'అందెల'కు కేంద్ర మంత్రి 'బండి' ఫోన్

● రోహింగ్యాల రెక్కీ అంశంపై ఆరా

సరూర్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ ఇంటి వద్ద శుక్రవారం రోహింగ్యాలు రెక్కీ నిర్వహించారనే విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం అందెలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎవరికీ భయపడాల్సిన పని లేదని, పార్టీ సిద్ధాంతం ప్రకారం ముందుకు వెళ్లాల్సిందేనని, పార్టీతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా బండి సంజయ్ శ్రీరాములుయాదవ్‌కు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు సైతం ఫోన్ చేసి.. అందెలకు తగిన రక్షణ కల్పించాలని, రోహింగ్యాల రెక్కీ అంశంపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫైన్ కట్టు.. పర్మిషన్ పట్టు

(5వ పేజీ తరువాయి)

ఉండడంతో అధికారులు ఆయా కాలేజీలలో 60నుంచి 120 సీట్ల కోత విధించేందుకు సన్నద్ధమయ్యారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు జేఎన్‌టీయూ వీసీ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రభుత్వం నుంచి మూడేళ్లుగా తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రానందున తాము వర్సిటీకి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించ లేకపోయామని యాజమాన్యాల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. త్వరలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ సందర్భంగా విద్యార్థులు చెల్లించే ఫీజులను ఉన్నత విద్యామండలి ద్వారా నేరుగా యూనివర్సిటీ ఖాతాకు జమ చేసుకునేందుకు అంగీకారం తెలుపుతూ అఫిడవిట్ సమర్పిస్తామన్నారు. ఇందుకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమ్మతించినట్లు సమాచారం.

జరిమానా చెల్లిస్తే లోటు మాఫీ

ఫ్యాకల్టీ లోటున్న కాలేజీలకు రూ.1.5లక్షల నుంచి రూ.2లక్షలవరకు జరిమానా చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది. చివరి నిమిషంలో చేసేది లేక 30 ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులు కౌన్సెలింగ్‌కు పర్మిషన్లు పొందేందుకని సుమారు రూ.50లక్షలవరకు జరిమానా చెల్లించినట్లు తెలిసింది. ప్రైవేటు కాలేజీల మాదిరిగానే యూనివర్సిటీ ఉన్నతాధికారులు కూడా ఫైన్‌ల పేరిట అఫిలియేషన్ల దందాకు దిగడాన్ని విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

JOBS
★ హైదరాబాద్, ప్రగతి నగర్‌లో ఇంటి పని మరియు పిల్లలను చూసుకోవడానికి పని మనిషి కావలెను. జీతం + వసతి కలదు. ఫోన్: 8309475836 AJH-2324

CHANGE OF NAME
★ I.B. Kavita Yadav, W/o. Nalla Sreekanth, Resident Of H.No.17-1-383/A/9, Vinay Nagar Colony, Saidabad, Hyderabad-500059 changed my name from "Nalla Kavita Yadav" to "B. Kavita Yadav" as per educational records for all purposes. AJH-003273

PLOT FOR SALE
★ 1000 Sq.Yards Developed Farm Unit + 600 Sft Weekend Home Just Rs.57 Lakhs Get Monthly Rent Rs.16,000 from Day 1 @ Jangaon Town: 9014026393 AJH-01002
★ 1000 sq yds 2 plots GPA Layout for sale at Chaitanya Resorts Shankarpally, Hyderabad. Call Mr. MRK Rao, Jubilee Hills, Hyd. Cell: 9848491149 AJH-234673
★ Farm Land Plots (ఎర్ర చందనం చెట్లు నాటిన) 121 గజాల ప్లాట్లు 2,50,000 Offer Price: 2,00,000/-లకే అందుబాటులో ఉన్నాయి. గొప్ప పెట్టుబడి అవకాశం. ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్: 9246367778 AJH-1595

SPOKEN HINDI
★ Learn Online / Offline Spoken Hindi / English, French & German within 30 Days. 100% Guarantee for all Ages. Free Demo. & 98495 42456. AJB-208

HOUSE FOR SALE
★ Gajularamaram Mahadev puram 4 km to KPHB Independent House 70 sq yds G+1 pent house (41k rent present). 1 Cr price Ph: 9703292209 AJH-003220

OLD AGE HOME
★ ఈశ్వర్ హోమ్ కేర్ సర్వీసెస్ 24 గం. వృద్ధులకు, పేషంట్ల సేవకు బేబీ కేర్, ఇంటిపని, వంట పనికి M/F వర్కర్స్‌ని మీ ఇంటికి పంపగలము. ఫోన్: 8121024199, 9704723300 AJH-16388

LAND FOR SALE
★ MUMBAI HIGHWAY, 2nd bit Semi Commercial East Face Road, 1190 Sq.yds. SQUARE BIT For Sale. Near to Woxen University, Kothur D. Ph: 9100203631 / 8297771369 AJH-291

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
4 లైన్ల ప్రకటన కేవలం రూ. 700/- GST 5% Extra
ప్రతి అదనపు లైన్‌కు రూ. 150/-
ప్లాట్ నం. 76, అశ్విని లేఅవుట్, హుడా హైట్స్, రోడ్ నం. 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్
సెల్: 9985921380 / 9985921386
9703618806 / 9985406505



హల్దీకి ట్రెండీగా...

సంప్రదాయం

వివాహానికి ముందు రోజు వధూ వరులకు విడివిడిగా జరిపించే ఓ ముఖ్యమైన కార్యక్రమం 'హల్దీ'. దీన్నే మనం మంగళ స్నానాలు అంటూ ఉంటాం. బంధు మిత్రుల ఆనందోత్సాహాలు, కేరింతలు, డ్యాన్స్‌ల మధ్య చాలా సరదాగా కోలాహలంగా సాగుతుంది ఈ ప్రోగ్రామ్. ముఖ్యంగా అమ్మాయి ఇంట జరిగే హంగామా అంతా ఇంతా కాదు. మధ్యలో ఫొటోలు, వీడియోలు అంటూ ఫొటోగ్రాఫర్ల సందడి ఉండనే ఉంటుంది. అందుకే ఈ హల్దీ ప్రోగ్రామ్‌లో అందంగా కనిపించేందుకు ప్రత్యేకమైన లెహంగాలను ఎంచుకుంటున్నారు కాబోయే పెళ్లికూతుళ్లు. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సరికొత్త లెహంగాలు ఇవే...

లెహంగానే కావాలి

ఒకప్పుడు హల్దీ అనగానే పసుపు లేదా తెలుపు రంగు లంగా-ఓణి లేదంటే చీర ధరించేవారు. క్రమంగా ట్రెండ్ మారుతూ వచ్చింది. ఇండో వెస్ట్రన్ శైలిని ప్రతిబింబించే ఆర్గంజా, నెట్టెడ్, క్రేప్, జార్జెట్ లెహంగాలను అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మల్టీకలర్, ఫ్లోరల్ డిజైన్లనూ ఆదరిస్తున్నారు. హల్దీ ప్రోగ్రామ్‌లో పసుపుకు ఉన్న ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తాము ధరించే డ్రెస్‌లో పసుపు రంగు ఉండేలా చూసుకుంటున్నారు. లేత రంగు లెహంగా మీద పసుపు డిజైన్ ఉండేవాటిని ఎంపిక చేసుకుంటున్నారు. లెహంగా ఏ రంగులో ఉన్నప్పటికీ వాటిమీద పసుపు రంగు టాప్ ధరించి మురిసిపోతున్నారు. ప్రస్తుతం 'మల్టీ కలర్డ్ ఖాలీ' లెహంగాలు సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.



రఫెల్స్

నెట్టెడ్ క్లాత్‌ని కుచ్చులు కుచ్చులుగా చేర్చి దానితో లెహంగా, బ్లౌజ్ రూపొందిస్తారు. లేత నీలం, లేత గులాబీ, లేత ఆకుపచ్చ రంగులతో పాటు పసుపు రంగును కూడా మేళవించడం వల్ల హల్దీ ప్రోగ్రామ్ శోభ ఉట్టిపడుతుంది. స్టయిల్‌గా కూడా కనిపిస్తుంది. రఫెల్ బ్లౌజ్‌కు పూర్తిగా కాంట్రాస్ట్ కలర్‌లో ఉన్న లెహంగాను ధరించడం ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్.

తెల్లని లంగా-ఓణి

వివాహ ప్రక్రియలో సంప్రదాయం పాటించాలనుకునే వారు తెల్లని లంగా-ఓణి ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు ఇదే సంప్రదాయం ఉండేది. మళ్లీ ఈ పోకడ ప్రారంభమైంది. జార్జెట్ లేదా ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన బ్లౌజ్, లంగా, ఓణీల మీద... వాటి అంచులకు పసుపు రంగు పూలు, మామిడి పిందెలు, చుక్కలను డిజైన్ చేయించుకుంటున్నారు. ముత్యాలతో రూపొందించిన గాజులు, హారం, ఉంగరాలు, జుంకాలు, పాపిడి బిళ్ల ధరించి అందంగా మెరిసిపోతున్నారు.

నెట్టెడ్ లెహంగాలు



ఇవి దక్షిణాది శైలిని ప్రతిబింబిస్తాయి. లెహంగా మొత్తం పలు లేయర్లుగా ఉంటుంది. ఒక్కో లేయర్ ఒక్కో రంగులో ఉంటుంది. ఇంద్రధనుస్సు రంగులతో లెహంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. భుజం మీదుగా జాలువారే కేప్ దుపట్టా ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. ఈ నెటెడ్ లెహంగాల మీద లేత రంగు పాస్టెల్ బ్లౌజ్‌లు చక్కగా అమరుతాయి. వీటి మీద ముత్యపు చిప్పలు, గవ్వలు, శంఖులతో రూపొందించిన నగలు వేసుకోవడం నేటి సరికొత్త ఫ్యాషన్.

• **ఖ్యాతి**, ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749

ఆస్తా పూనియా... భారత నావికాదళంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్ర సృష్టించిన ఆమె త్రివిధ దళాల్లో విస్తరిస్తున్న నవ నారీ శక్తికి ప్రతీక. శ్రమించే తత్వం, కష్టపడే గుణం ఉంటే ఏదీ అసాధ్యం కాదంటున్న ఆస్తా ఎందరో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

సాగర సమరానికి సై



అది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో ఒక మధ్యతరగతి కాలనీ. తమ ఇంటికి కాస్త ఎత్తులో దూసుకువెళ్తున్న విమానం శబ్దం ఎప్పుడు వినిపించినా చిన్నారి ఆస్తా పరుగులు పెడుతూ బయటికి వచ్చేది. విమానాలను అబ్బురంగా చూసేది. "ఏదో ఒక రోజు నేను అలాంటి విమానం నడుపుతాను" అని అమ్మకు, నాన్నకు చెప్పేది. ఆ కలను నిజం చేసుకోవడమే కాదు... దేశంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్రకెక్కింది. "ఇది చెప్పుకున్నంత సులువుగా జరిగిపోలేదు. తన కలను నిజం చేసుకోవడానికి ఆమె పడ్డ కష్టం ఎంతో ఉంది. చదువులో, ఆటల్లో తను ఎప్పుడూ ఫస్ట్. ఏ పనినైనా పూర్తి ఏకాగ్రతతో చేస్తుంది" అంటారు ఆమె కుటుంబ సభ్యులు.

బీటెక్ చేసి...

ఆస్తాది సైనిక నేపథ్యం ఉన్న కుటుంబం కాదు. ఆమె ఇంజనీర్ కావాలని తల్లిదండ్రులు కోరుకున్నారు. వారి ఆలోచనలను గౌరవిస్తూ ఆమె బీటెక్ చేసింది. అదే సమయంలో... పైలెట్ కావాలనే తన కోరికను మరచిపోలేదు. బీటెక్ పూర్తి కాగానే.... 'షార్ట్ సర్వీస్ కమిషన్' (ఎస్‌సిసి) ద్వారా భారత నావికాదళంలో చేరింది. "నేవల్ ఏవియేషన్‌కు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం. దానికి నా ఇంజనీరింగ్ పునాది ఉపకరించింది" అని చెబుతుంది ఆస్తా. మొదట కేరళలోని ఎజిమలలో ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 'ఇండియన్ నేవల్ అకాడమీ' (ఐఎన్ఎ)లో శిక్షణ పొందింది. ఆ తరువాత హైదరాబాద్‌లోని దుండిగల్ 'ఎయిర్ ఫోర్స్ అకాడమీ'లో ప్రాథమిక వైమానిక శిక్షణ తీసుకుంది. సైనిక విమానాలు నడపడంలో తొలి పాఠాలు అక్కడే నేర్చుకుంది. ఆ తరువాత విశాఖపట్నంలోని 'ఐఎన్ఎస్ డేగా'లో హాక్ అడ్వాన్స్‌డ్ జెట్ ట్రైనర్ (ఎజెటి) మీద అడ్వాన్స్‌డ్ ఫ్లయింగ్, ఆ తరువాత ఫైటర్ ఫైటర్ పైలెట్‌గా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం కావడం కోసం అవసరమైన 'సెకెండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్సు'లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. క్వాలిఫైడ్ నేవల్ ఏవియేటర్‌కు గుర్తింపు చిహ్నమైన 'గోల్డ్ ఆఫ్ వింగ్స్'ను ఈ నెల మూడో తేదీన రియర్ అడ్మిరల్ జనక్ బెల్వీ చేతుల మీదుగా అందుకొని, అది సాధించిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

ఆ దిశగా గట్టి అడుగు

ఇది ఆస్తా వ్యక్తిగతమైన ఘనత మాత్రమే కాదు, భారత రక్షణ దళాల్లో నారీ శక్తిని... మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా, 'మారిటైమ్ ఇండియా విజన్ - 2030' లక్ష్యాల దిశగా వేసిన గట్టి అడుగు కూడా. ఇక 'హాక్ ఏజేటీ' మీద కూడా శిక్షణ పొందిన తరువాత మిగ్‌29 కె ని నడపడానికి ఆస్తాకు పూర్తి అర్హత లభిస్తుంది. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య లాంటి విమాన వాహక నౌకల నుంచి ప్రయోగించే యుద్ధ విమానాలను నడిపిస్తూ... సరిహద్దుల భద్రతలో కీలక పాత్ర పోషించే అవకాశాన్ని ఆమె అందుకుంటుంది. "ఇది ఉద్వేగభరితమైన క్షణం. దేశ రక్షణలో భాగం కావడం గర్వంగా ఉంది" అంటున్న ఆస్తా... ఎంతో మంది యువతులకు స్ఫూర్తిప్రదాత అవుతుందనడంలో సందేహం లేదు.

ప్రత్యేకం

సింహపురి (నెల్లూరు) గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గా మతసామరస్యానికి ప్రతీక. దాన్ని కుల, మత, వర్గాలకు అతీతంగా ఎవరైనా దర్శించుకోవచ్చు. అక్కడ జరిగే రొట్టెల పండుగ ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏటా అయిదు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్త జనం తరలివస్తారు. నేడు ప్రారంభమవుతున్న ఈ వేడుకలకు ఘనమైన చరిత్రే ఉంది.

మత సామరస్యానికి ప్రతీక



ఆర్కాడు నవాబు కాలం నుంచి.

సుమారు 400 సంవత్సరాల క్రితం సౌదీ, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కర్ణాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేవి. ఆ ప్రచారకుల్లో 12 మంది నెల్లూరు జిల్లాలో పర్యటిస్తూ... కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడు వారికి, బ్రిటిష్ సైనికులకు మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆ ప్రచారకులు ప్రాణత్యాగం చేశారు. వారి తలలు గండవరం వద్ద పడిపోగా... వారి మొండేలతో గుర్రాలు నెల్లూరు చేరాయి. ఆ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమాధి చేశారు. కొన్నేళ్ళ తరువాత... ఆ చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికి, అక్కడ ఉన్న చెట్టు కింద విశ్రమించారు. ఆ రజకుడి భార్యకు ఒక దైవ స్వరూపుడు కలలోకి వచ్చి.. బారా షహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకున్నవారు అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెప్పాడు. ఆమె తన కల గురించి భర్తకు చెప్పింది. ఈ విషయాన్ని దగ్గరలో ఉన్న రాజభటులకు ఆ



దంపతులు నివేదించారు. వారిని ఆర్కాటు నవాబు దగ్గరకు భటులు తీసుకువెళ్ళారు. అప్పట్లో నవాబు కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె స్వస్థత కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో... ఆ దంపతులు చెప్పిన మాటలను నవాబు విశ్వసించాడు. వాటిని పాటించాడు. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబుకు ఆశ్చర్యం కలిగింది. అతను బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకొని పూజలు చేశాడు. సమాధుల దగ్గర ఉన్న మట్టితో లేపనం చేసుకోవడం వల్ల నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ ఆ దర్గాలో పూజలు ఆరంభించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో ఆ సమాధులకు పూజలు జరుగుతున్నాయి.

కోరికలెన్నో... రొట్టెలు ఎన్నెన్నో

రొట్టెల పండుగలో... కొత్త కోరికలు కోరుకొనేవారు, కోరికలు తీరినవారు... ఇలా ఎందరో 'వరాల రొట్టెల'ను అందుకుంటారు. ప్రసాదాలుగా భావించే ఈ రొట్టెల్లో... కాలక్రమేణా రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు... ఇలా వివిధ కోరికలు తీరాలనుకొనే వారి కోసం ఎన్నెన్నో రొట్టెలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రొట్టెల ప్రసాదం ద్వారా కోర్కె తీరిన భక్తులు మరుసటి ఏడాది విధిగా ఈ పండుగకు వచ్చి... తమ చేతుల మీదుగా మరొకరికి రొట్టెను పంచడం, కోర్కెలు సఫలం కావడం కోసం ఆ రొట్టెను మహాప్రసాదంగా స్వీకరించడం ఈ పండుగ విశేషం. రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నెల్లూరు నగరవాసులు అతిథులుగా భావించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు.

హిందువులు పెట్టిన పేరే..

ఆర్కాట్ నవాబు 1757లో ఆ ప్రదేశంలో పండుగను ప్రారంభించినట్టు చరిత్ర చెబుతోంది. పూజలు చేసేందుకు వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలి వాటిని అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం, పక్కవారికి ఇవ్వడం రొట్టెల పండుగలో ఆనవాయితీ అయింది.. నవాబు పాలనలో... ఆయన ప్రతినిధిగా ఖాజీ ఆధ్వర్యంలో పండుగ జరిగేది. ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. అయితే, చెరువు వద్ద రొట్టెలు మార్చుకొనే ఆనవాయితీ కారణంగా దీన్ని 'రొట్టెల పండుగ' అనే పేరు స్థిరపడిపోయింది. ఈ పేరు హిందువులు పెట్టిన పేరేనని, అది తమకు గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ ఖ్యాతి నెల్లూరు జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకు పాకింది.



• **గోళ్ల రామకృష్ణ**
ఫొటోలు: ఎస్‌డీ జకీర్

సండే సెలబ్రిటీ

ఈ మధ్యకాలంలో ఓటీటీలో నేరుగా విడుదలయ్యే సినిమాలు... వెబ్‌సిరీస్‌ల్లో ప్రధాన పాత్రలు పోషిస్తూ అలరిస్తున్న హీరో... నవీన్ చంద్ర. తాజాగా ఆయన నటించిన 'షోటైమ్' థియేటర్లలో విడుదలయింది. ఓటీటీ సిరీస్‌ల గురించి... ప్రేక్షకుల అభిమానం గురించి ఆయన 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

ఓటీటీ కింగ్ అంటున్నారు!



మీ దృష్టి కథలపైనా? ఖరీదైన ప్రొడక్షన్‌పైనా?

నేను మంచి కథలను ఎంచుకోవటానికి ప్రయత్నిస్తున్నా. ప్రొడక్షన్ విలువలు.. బడ్జెట్‌లు ఈ విషయాలపై కాకుండా నా నటనపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నా. దీనివల్ల కొంత సంతృప్తి కలుగుతోంది. అంతే కాదు... ఈమధ్య కాలంలో నా దగ్గరకు మంచి కథలు వస్తున్నాయి. మంచి డైరక్టర్లు కూడా వస్తున్నారు.

కొన్ని చిన్న సినిమాలు ఓటీటీల్లో సూపర్‌హిట్ అవుతున్నాయి. అవే సినిమాలను చూడటానికి ప్రేక్షకులు థియేటర్‌కు ఎందుకు రావటం లేదు?

మా ప్రమోషన్ సరిపోవటంలేదా... అనే అనుమానం వస్తోంది. చిన్న సినిమాలకు సోషల్ మీడియాలో ఎక్కువగానే ప్రమోషన్స్ చేస్తున్నాం. ప్రేక్షకుల కామెంట్స్ కూడా పాజిటివ్‌గా వస్తున్నాయి. కానీ ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమాలను ఎక్కువగా ఎందుకు చూడటం లేదనే విషయం తెలియటంలేదు. ఒకప్పుడు మొదటి రోజు 'సినిమా బాగుంది' అనే టాక్ వస్తే ప్రేక్షకులు తప్పనిసరిగా థియేటర్‌కు వస్తారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. చాలా జాగ్రత్తగా ఆలోచించి, అన్ని రకాలుగా బాగుందని నిర్ణయించుకుంటేనే థియేటర్‌కు వస్తున్నారు. మేము కూడా చాలా జాగ్రత్తగా కథలను ఎంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మీకు ఏ తరహా పాత్రలంటే ఎక్కువ ఇష్టం?

ఒక నటుడిగా రకరకాల పాత్రల్లో నటించటానికి తగిన శిక్షణ తీసుకొని సిద్ధంగా ఉన్నా. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ డ్రామా ఇలా... ఇప్పటిదాకా నేను చేసిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో మంచి పాత్రలే లభించాయి. ప్రేక్షకులు కూడా బాగా ఆదరించారు. ఈ మధ్య విడుదలైన 'షోటైమ్' చిన్న సినిమా. కామెడీ థ్రిల్లర్. చాలా సహజంగా ఉంటుంది. మన జీవితంలోని సంఘటనలే దీనిలో కనిపిస్తాయి. నేను జిమ్ కోచ్‌గా నటించాను. కొన్ని ప్రీమియర్ షోలు వేశాం. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ఎక్కడా వయలెన్స్ ఉండదు. పెద్ద పెద్ద ట్విస్ట్‌లు ఉండవు. రాజా రవీంద్ర ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన కూడా చాలా బాగా చేశారు. ఇక నేను చేసిన మిగిలిన పాత్రల విషయానికి వస్తే... 'గేమ్ ఛేంజర్' సినిమాలో నాకు డూప్ దొరకలేదు. దాంతో ఆ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లన్నీ నేనే చేశా. ఇదే విధంగా 'పరంపర' సీరియల్ ఒక ఫ్యామిలీ డ్రామా. దీనిలో నేను ఒక ముఖ్యమైన పాత్ర పోషించా. రాబోయే ఒక సినిమాలో పరిస్థితులకు తగినట్లుగా హ్యూమర్ ఉంటుంది. ఈ పాత్ర చాలా బాగా వచ్చింది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనుకుంటున్నా.

మొత్తానికే మోసం...

మంచి కథలు అనేకం ఉన్నాయి. మంచి రచయితలు అనేకమంది ఉన్నారు. కానీ ఈ మధ్యకాలంలో కథా గమనంలో సాంకేతికతను చొప్పించటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించటానికి ఇదొక మార్గం అని భావిస్తున్నారు. అయితే కథకు అవసరమైన మేరకే సాంకేతికతను జొప్పించాలి. లేకపోతే మొత్తానికే మోసం వస్తుంది.

టెలివిజన్ స్థానాన్ని ఓటీటీ ఆక్రమించిందని అనుకుంటున్నారా?

కొంతవరకు ఆక్రమించింది. ఒకప్పుడు టెలివిజన్‌ను రోజంతా చూసేవారు. ఇప్పుడు యాప్స్ వచ్చేశాయి. దీనిలో సీరియల్స్, సినిమాలు ఏవైనా చూసుకోవచ్చు. టెలివిజన్‌లో చూడటానికి ఎన్ని ప్రత్యామ్నాయ కార్యక్రమాలు ఉంటాయో.. అవన్నీ ఓటీటీలోనూ లభిస్తున్నాయి. దీనివల్ల ఇంట్లో కూర్చొని చూసే ప్రేక్షకులకు ఓటీటీ ఒక వరం. దీంతో ఎక్కువమంది అటు టెలివిజన్.. ఇటు ఓటీటీ రెండూ చూస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒక సినిమా విజయవంతం అవ్వాలంటే... ఒక వారం బాగా ఆడాలి. ఏదైనా పెద్ద సినిమాను తీసుకుందాం. విడుదలైన తర్వాత రెండు రోజులు హీరో అభిమానులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్ రావాలి. కానీ ఓటీటీకి అలవాటు పడ్డ ప్రేక్షకుల్లో ఎక్కువమంది ఇల్లు కదిలి థియేటర్‌కు రావటానికి ఇష్టపడటం లేదు. దీని ప్రభావం సినిమాలపై పడుతోంది.

ఓటీటీలలో మీ సక్సెస్ రేట్ చాలా ఎక్కువనుకుంటా?

నేను చేసిన సిరీస్‌లు, సినిమాలు అన్నీ ఓటీటీల్లో సూపర్‌హిట్ అయ్యాయి. కొందరైతే నన్ను 'ఓటీటీ కింగ్' అంటున్నారు. మా చెల్లి హైదరాబాద్‌లో పని చేస్తోంది. తను 'షోటైమ్' చూసింది. మొన్న వచ్చి... 'నవీన్ అన్నా.. షోటైమ్ చూశా. చాలా బాగుంది. ఓటీటీలో వస్తే పెద్ద హిట్ అవుతుంది. నీకు ఓటీటీలో ఎక్కువ ఫ్యాన్స్ ఉన్నారు' అంది. నాకు ఎలా రియాక్ట్ కావాలో అర్థంకాలేదు. నేను ఇప్పటి దాకా నాలుగు వెబ్ సిరీస్‌లు, నాలుగు వెబ్ ఫిల్మ్స్ చేశాను. ఇవన్నీ బాగా హిట్ అయ్యాయి. దీనికి ఒక కారణం ఉంది. ఓటీటీ ప్రారంభ దశలో నాకు హీరో వేషాలు రాలేదు. పెద్ద పెద్ద నటులున్న సినిమాల్లో మంచి క్యారెక్టర్స్ వచ్చాయి. ఓటీటీలో ఇన్‌స్పెక్టర్ 'రుషి, అమ్ము, భానుమతి రామకృష్ణ, బ్రో' లాంటివన్నీ బాగా హిట్ అయ్యాయి. 'లెవెన్' సినిమాను రెండు వారాల్లో 25 కోట్ల మంది చూశారు. చాలా మంది వీటిని ఓటీటీ వచ్చిన వెంటనే చూసేస్తారు. ఇదే విధంగా థియేటర్లలో నా సినిమాలు చూడాలని దేవుడిని ప్రార్థిస్తూ ఉంటా!

• **సీవీఎల్‌ఎన్ ప్రసాద్**

గోరువెచ్చని నీరు తాగితే...

తగినంత నీరు తాగకపోతే శరీరం వ్యాధుల పాలవుతుంది. రోజూ పరగడుపునే గోరువెచ్చని నీరు తాగితే చాలా వరకు అనారోగ్య సమస్యలు తీరిపోతాయని నిపుణులు సూచిస్తున్నారు.



- ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలో జీవక్రియలు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి. నరాల పనితీరు మెరుగుపడుతుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- జీర్ణక్రియ వేగవంతమవుతుంది. అజీర్ణం, కడుపులో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం లాంటివి తగ్గుతాయి.
- రాత్రిపూట శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలన్నీ పూర్తిగా విసర్జితమవుతాయి. పేగులు, మూత్రపిండాలు, జననేంద్రియాలు పరిశుభ్రమవుతాయి.
- వేడి నీరు తాగడం వల్ల గొంతులో చేరిన శ్లేష్మం తొలగిపోతుంది. గొంతులో గర గర, ముక్కు దిబ్బడ, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- శరీరంలో పేరుకుపోయిన కొవ్వులు కరుగుతాయి. దీంతో బరువు తగ్గి శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంటుంది.
- నెలసరి సమయంలో వేడి నీరు తాగడం వల్ల కడుపునొప్పి, అలసట, నీరసం, విసుగు లాంటి సమస్యలు తగ్గుతాయి.
- నిద్రలేమితో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే ఒత్తిడి తగ్గి సమస్య తీరుతుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఆప్ జైసా కోయి	హిందీ చిత్రం	జూలై 11
సోనీ లివ్		
నరివెట్టా	మలయాళ చిత్రం	జూలై 11
జియో హాట్‌స్టార్		
మూన్‌వాక్	మలయాళ చిత్రం	జూలై 08
బుక్ మై షో		
గుడ్ వన్	హాలీవుడ్ మూవీ	జూలై 08



‘వార్-2’ హక్కులు ఆ సంస్థకే



ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘వార్-2’ సినిమా తెలుగు రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ దక్కించుకొంది. ఈ మేరకు నిర్మాత సూర్యదేవర నాగవంశీ అభిమానులను ఉద్దేశిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. ‘సితార ఎంటర్‌టైన్‌మెంట్స్’ బేనర్‌పై తెలుగు రాష్ట్రాల్లో ‘వార్-2’ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ‘నాకెంతో ఇష్టమైన తారక్ సినిమాతో మళ్లీ మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన నటించిన రెండు సినిమాలు ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘దేవర’ మా బేనర్‌పై విడుదలయ్యాయి. ఇప్పుడు హృతిక్ కోసం సమయం ఆసన్నమైంది. అభిమానులంతా సిద్ధంగా ఉండండి. ‘వార్-2’లో మీరు ఇంతకుముందెన్నడూ చూడని కొత్త ఎన్టీఆర్‌ను చూడనున్నారు. ఆగస్టు 14న సంబరాలు చేసుకుందాం’ అంటూ నిర్మాత నాగవంశీ ఓ వీడియోను షేర్ చేశారు. ‘వార్-2’ని అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

శరవేగంగా షూటింగ్



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘వీటీ15’(వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇండో - కొరియన్ హారర్ కామెడీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇటీవలె హైదరాబాద్, అనంతపురంలో చిత్రీకరణను పూర్తి చేసుకుంది. తాజాగా విదేశాల్లో ప్రారంభించిన షెడ్యూల్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుతం వేటకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తో 80 శాతం షూటింగ్ పూర్తవుతుందని చిత్రబృందం పేర్కొంది.



పాట చిత్రీకరణలో గర్ల్ ఫ్రెండ్

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, హీరో దీక్షిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం ‘ద గర్ల్ ఫ్రెండ్’. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ అందమైన ప్రేమకథకు రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ప్రస్తుతం రశ్మిక, దీక్షిత్‌పై పాట చిత్రీకరిస్తున్నారు. టాకీ పార్ట్ దాదాపు పూర్తయింది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామనీ, ఈ నెలలోనే పాటను విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు. ఈ సినిమాకు కృష్ణన్ వసంత్ ఛాయాగ్రహణాన్ని, హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

నిజజీవిత ఘటన నేపథ్యంలో..



తమిళంలో సూపర్ హిట్ అయిన డీఎన్ఏ సినిమాను ఎస్కే పిక్చర్స్ ద్వారా సురేశ్ కొండేటి తెలుగు ప్రేక్షకులకు అందించనున్నారు. తెలుగులో ‘మై బేబీ’ పేరుతో ఈనెల 11న విడుదలవుతోంది. “మై బేబీ’ నిర్మాతగా నాకు 16వ చిత్రమిది. ఇది కూడా సూపర్ హిట్ అవుతుంది’ అని సురేశ్ కొండేటి ధీమా వ్యక్తం చేశారు. కాగా, తమిళంలో అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. తమిళంలో ఇటీవలె విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కన్నడ గురించి మాట్లాడొద్దు

● కమల్‌కు కోర్టు సూచన



కన్నడ గురించి మాట్లాడొద్దని నటుడు కమల్ హాసన్‌కు బెంగళూరు కోర్టు శుక్రవారం సూచించింది. థగ్‌లైఫ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం విదితమే. కన్నడ చలనచిత్ర వాణిజ్య మండలితోపాటు కన్నడ సంఘాలు కమల్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కర్ణాటకలో థగ్‌లైఫ్ సినిమా విడుదలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో కమల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సినిమా విడుదలను అడ్డుకోవద్దని, తగిన బందోబస్తు కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అన్ని అడ్డంకులను దాటుకుని కర్ణాటకలో థగ్‌లైఫ్ రిలీజ్ అయినా.. ఆదరణ పొందలేదు. ఈ క్రమంలో కన్నడ గురించి అనుచితమైన వ్యాఖ్యలు చేయకుండా కమల్ హాసన్‌ను కట్టడి చేయాలని కన్నడ సాహిత్య పరిషత్ కోరింది. బెంగళూరు 31వ సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కన్నడ నేల, భాష, సంస్కృతి గురించి మాట్లాడకుండా చూడాలని కోరింది. పిటిషన్‌ను విచారించిన కోర్టు, కన్నడ అంశం గురించి మాట్లాడవద్దని కమల్ హాసన్‌ను ఆదేశించింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా..



ఆర్కే సాగర్ నటించిన ‘ద 100’ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో ఈ క్రైమ్ థ్రిల్లర్ రూపుదిద్దుకొంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఏపీ ఉపముఖ్యమంత్రి, హీరో పవన్‌కల్యాణ్ శనివారం విడుదల చేశారు. ‘జీవితంలో జరిగిపోయినది మనం మార్చలేం. కానీ జరగబోయేదాన్ని కచ్చితంగా ఆపగలం’ అంటూ విక్రాంత్ ఐపీఎస్ పాత్ర పోషించిన ఆర్కే సాగర్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పోలీస్ ఆఫీసర్‌గా ఫిట్‌నెస్ కలిగి అద్భుతంగా కనిపించారాయన. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించారు. సస్పెన్స్, థ్రిల్స్‌తో ఎంతో గ్రిప్పింగ్‌గా ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను దర్శకుడు రూపొందించారు. విడుదలకు ముందే సినిమాపై అంచనాలను ఈ ట్రైలర్ పెంచేసింది.











వైభవ్... సునామీ ఇన్నింగ్స్

యూత్ క్రికెట్‌లో వేగవంతమైన శతకంతో రికార్డు
ఇంగ్లండ్‌తో అండర్-19 వన్డే సిరీస్ భారత్ వశం

వర్సెస్టర్: యూత్ క్రికెట్‌లో వేగవంతమైన శతకం నమోదు చేసిన ఆటగాడిగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో శనివారం జరిగిన నాలుగో వన్డేలో వైభవ్ (78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్స్‌లతో 143) భారీ షాట్లతో మోత మోగించాడు. 52 బంతుల్లోనే వంద మార్క్‌కు చేరుకొన్న వైభవ్.. యూత్ వన్డేల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆటగాడు కమ్రాన్ గులామ్ (53 బంతుల్లో శతకం) రికార్డును బద్దలుకొట్టాడు. భారత్ తరపున అంగద్ బవా ఉగాండాపై 69 బంతుల్లో సెంచరీ రికార్డును కూడా వైభవ్ చెరిపేశాడు. అంతేకాకుండా పిన్న వయసులో శతకం సాధించిన ఆటగాడిగా బంగ్లాదేశ్ క్రికెటర్ నజ్ముల్ షాంటో (14 ఏళ్ల 241 రోజులు) రికార్డును కూడా సూర్యవంశీ (14 ఏళ్ల 100 రోజులు) అధిగమించాడు. భారత్ తరఫున సర్ఫరాజ్ ఖాన్ (15 ఏళ్ల 338 రోజులు)ను కూడా వైభవ్ వెనక్కినెట్టాడు. కాగా, సూర్యవంశీ ఊచకోతతో భారత్ అండర్-19 టీమ్ 55 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలిచింది. మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకొంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 363/9 స్కోరు చేసింది. విహాన్ మల్హోత్రా (129) కూడా శతకం సాధించాడు. ఛేదనలో ఇంగ్లండ్ 45.3 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. రాకీ ఫ్లింటాఫ్ (107) పోరాటం వృథా అయింది. నమన్ పుష్పక్ 3 వికెట్లు పడగొట్టాడు.

విజయం ఊరిస్తోంది

ఇంగ్లండ్ లక్ష్యం 608 | **ప్రస్తుతం 72/3**

గిల్ మరో శతకం

భారత్ రెండో ఇన్నింగ్స్ 427/6 డిక్లేర్
పంత్, జడేజా, రాహుల్ అర్ధసెంచరీలు



గిల్ (162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 161)

బర్మింగ్‌హామ్: ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇప్పటిదాకా గెలుపు రుచి చూడని టీమిండియా ముంగిట సువర్ణావకాశం. వరుసగా నాలుగో రోజూ ఆధిపత్యం చూపుతూ.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టింది. దీంతో గిల్ సేన ఇంగ్లండ్ ముందుంచిన లక్ష్యం ఏకంగా 608 పరుగులు. టెస్టు చరిత్రలో ఏ జట్టు కూడా గతంలో ఇంత స్కోరును ఛేదించింది లేదు. ఇప్పటికే పేసర్ల తడాఖాతో మూడు వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. ఇక ఆఖరి రోజు ఆదివారం ఇంగ్లండ్ గేమ్ ప్లాన్ ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే మిగిలిన బ్యాటర్లు బజ్‌బాల్ ఆటతో ముందుకు సాగాలనుకున్నా మరో 536 రన్స్ సాధించడం స్టోక్స్ సేనకు దాదాపు అసాధ్యమే. అందుకే భారత్ విజయాన్ని అడ్డుకోవాలంటే ప్రత్యర్థికి డ్రా కోసం ఆడడం తప్ప మరో దారి లేదు. అటు మూడు సెషన్లలోపే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి అద్భుత విజయాన్నందించేందుకు భారత బౌలర్లు ఎదురుచూస్తున్నారు. అంతకుముందు కెప్టెన్ గిల్ (162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 161) తన అసాధారణ ఫామ్‌తో మరో శతకం సాధించాడు. అతడికి జడేజా (69 నాటౌట్), పంత్ (65), రాహుల్ (55) అర్ధసెంచరీలతో సహకరించారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 427/6 దగ్గర డిక్లేర్ చేసింది. దీంతో జట్టుకు మొత్తం 607 పరుగుల ఆధిక్యం లభించింది. టంగ్, బషీర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లలో 3 వికెట్లకు 72 పరుగులు చేసింది. డకెట్ (25) పర్వాలేదనిపించగా.. క్రీజులో పోప్ (24 బ్యాటింగ్), బ్రూక్ (15 బ్యాటింగ్) ఉన్నారు. ఆకాశ్‌కు 2 వికెట్లు దక్కాయి.

పంత్ జోరు: నాలుగో రోజు ఉదయం ఆకాశం మేఘావృతంగా ఉండడంతో తొలి గంట ఆటలో ఇంగ్లండ్ బౌలర్లు ప్రభావం చూపారు. ఫుల్ లెంగ్త్ బంతులతో ఇబ్బంది పెట్టడంతో ఆరంభంలోనే కరుణ్ నాయర్ (26) వికెట్‌ను కోల్పోయింది. పేసర్ కార్స్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో ఆకట్టుకున్నా ఆరో బంతికి తను కీపర్ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 64/1 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా, మరో 22 పరుగులు జోడించి రెండో వికెట్‌ను కోల్పోయింది. అటు రాహుల్ మాత్రం అడపాదడపా బౌండరీలతో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే డ్రింక్స్ తర్వాత టంగ్ ఎక్స్‌ట్రా పేస్‌తో వేసిన బంతికి అతడు బౌల్డయ్యాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చీ రాగానే పంత్ బ్యాట్‌కు పనిజెప్పాడు. టంగ్ ఓవర్‌లో తను 4,6 బాదడంతో పాటు తన మరుసటి ఓవర్‌లోనూ 4,6.. ఆ వెంటనే బషీర్ ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించాడు. దీంతో స్కోరులో వేగం పెరగ్గా, 357 పరుగుల ఆధిక్యంతో జట్టు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

గిల్ మరో శతకం: రెండో సెషన్‌లో పంత్-గిల్ జోడీ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ముఖ్యంగా టంగ్‌ను లక్ష్యంగా చేసుకున్న గిల్ సెషన్ రెండో ఓవర్‌లోనే 6,4,4తో 14 రన్స్ రాబట్టాడు. టంగ్ తర్వాతి ఓవర్‌లోనూ 6,4తో ఆకట్టుకున్నాడు. దీంతో పంత్‌కన్నా ముందే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అటు 48 బంతుల్లోనే పంత్ కూడా అర్ధసెంచరీ సాధించగా, అతడి సిక్సర్‌తో జట్టు ఆధిక్యం 400కి చేరింది. అయితే వేగంగా ఆడే క్రమంలో స్పిన్నర్ బషీర్ ఓవర్‌లో పంత్ లాంగాఫ్‌లో డకెట్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన జడేజా మాత్రం డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. అటు గిల్ కూడా నెమ్మదించడంతో బౌండరీలు రావడమే కష్టమైంది. ఈ సెషన్ చివర్లో గిల్ శతకం పూర్తి చేశాడు.

భారీ ఆధిక్యంతో..: 484 రన్స్ ఆధిక్యంతో చివరి సెషన్ ఆరంభించిన భారత్ మరో గంటపాటు బ్యాటింగ్ చేసి 123 రన్స్ రాబట్టింది. ఆరంభం నుంచే గిల్-జడేజా వీలైనంత వేగంగా ఆడేందుకు ప్రయత్నించారు. సెషన్ రెండో ఓవర్ (వోక్స్)లోనే గిల్ 6,4,4తో 18 రన్స్ రాబట్టాడు. ఆ తర్వాత వోక్స్ మరో ఓవర్ మాత్రమే వేయగా, స్పిన్నర్లు బషీర్, రూట్‌లతోనే కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేయించాడు. అటు గిల్ ఈ ఇద్దరినీ బాదేస్తూ బౌండరీలతో చెలరేగాడు. దీంతో 156 బంతుల్లోనే 150 రన్స్ పూర్తి చేశాడు. అయితే బషీర్ ఓవర్‌లో రిటర్న్ క్యాచ్‌తో గిల్ అవుట్ కావడంతో ఐదో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత రెండు ఓవర్లలోనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. నితీశ్ (1) మరోసారి నిరాశపర్చాడు.

1 భారత కెప్టెన్‌గా అరంగేట్ర సిరీస్‌లో ఎక్కువ పరుగులు (585) సాధించిన గిల్. విరాట్ కోహ్లీ (449)ని అధిగమించాడు.
భారత్ తరపున ఒక టెస్టులో నాలుగు శతక భాగస్వామ్యాలు జత చేసిన బ్యాటర్‌గా గిల్.
ఒకే టెస్టులో ఎక్కువ పరుగులు (430) సాధించిన భారత బ్యాటర్‌గా గిల్. గవాస్కర్ (344)ను అధిగమించాడు. ఓవరాల్‌గా గూచ్ (456) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.
ఓ విదేశీ గడ్డ (ఇంగ్లండ్)పై ఎక్కువ సిక్సర్లు (24) బాదిన బ్యాటర్‌గా పంత్. స్టోక్స్ (దక్షిణాఫ్రికాలో 21 సిక్సర్లు)ను అధిగమించాడు.

2 ఒకే టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన రెండో భారత ఆటగాడిగా గిల్. గవాస్కర్ గతంలో ఈ ఫీట్ సాధించాడు. ఓవరాల్‌గా తొమ్మిదో బ్యాటర్. అలాగే గవాస్కర్, కోహ్లీ తర్వాత రెండు ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాదిన మూడో భారత కెప్టెన్‌గా గిల్.
అలెన్ బోర్డర్ తర్వాత రెండు ఇన్నింగ్స్‌లోనూ 150+ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా గిల్.

1 ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (రెండు ఇన్నింగ్స్ కలిపి 1014) సాధించడం భారత్‌కిదే తొలిసారి. గతంలో ఆసీస్‌పై 916 పరుగులు సాధించింది.



ఆకాశ్ (2/36)

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) టంగ్ 28; రాహుల్ (బి) టంగ్ 55; కరుణ్ (సి) స్మిత్ (బి) కార్స్ 26; గిల్ (సి అండ్ బి) బషీర్ 161; పంత్ (సి) డకెట్ (బి) బషీర్ 65; జడేజా (నాటౌట్) 69; నితీశ్ (సి) క్రాలే (బి) రూట్ 1; సుందర్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 83 ఓవర్లలో 427/6 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-51, 2-96, 3-126, 4-236, 5-411, 6-412. **బౌలింగ్:** వోక్స్ 14-3-61-0; కార్స్ 12-2-56-1; టంగ్ 15-2-93-2; స్టోక్స్ 7-1-26-0; బషీర్ 26-1-119-2; రూట్ 9-1-65-1.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి సబ్) సుదర్శన్ (బి) సిరాజ్ 0; డకెట్ (బి) ఆకాశ్ 25; పోప్ (బ్యాటింగ్) 24; రూట్ (బి) ఆకాశ్ 6; బ్రూక్ (బ్యాటింగ్) 15; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 16 ఓవర్లలో 72/3. వికెట్ల పతనం:** 1-11, 2-30, 3-50. **బౌలింగ్:** ఆకాశ్ 8-1-36-2; సిరాజ్ 5-1-29-1; ప్రసిద్ధ్ 3-0-6-0.

సెమీస్‌లో శ్రీకాంత్ ఓటమి

కాల్గెరి (కెనడా): భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. శనివారం రాత్రి జరిగిన సింగిల్స్ సెమీ ఫైనల్లో శ్రీకాంత్ 21-19, 14-21, 18-21తో మూడోసీడ్ కెంటా నిషిమొటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. కాగా, అంతకుముందు శ్రీకాంత్ 21-18, 21-9తో టాప్‌సీడ్, ప్రపంచ ఆరో ర్యాంకర్ చో తిన్ (చైనీస్ తైపీ)ను చిత్తుచేసి సెమీస్ చేరాడు. ఇక, మరో భారత ఆటగాడు శంకర్ ముత్తుస్వామి క్వార్టర్స్‌లో 15-21, 21-5, 17-21తో నిషిమొటో చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఆఖర్లో తడ‘బ్యాటు’

ఉత్కంఠ పోరులో భారత్ ఓటమి
ఇంగ్లండ్ మహిళలతో మూడో టీ20

లండన్: ఇంగ్లండ్ మహిళలతో మూడో టీ20లో భారత్‌కు నిరాశే ఎదురైంది. శుక్రవారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోరులో 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది. మొదట ఇంగ్లండ్ 20 ఓవర్లలో 171/9 స్కోరు సాధించింది. సోఫీ డంక్లే (75), డానీ వ్యాట్ (66) తొలి వికెట్‌కు 137 రన్స్ జోడించారు. తెలుగు బౌలర్లు అరుంధతి రెడ్డి 3, శ్రీచరణి 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 166/5 స్కోరుకే పరిమితమై ఓడింది. మంధాన (56), షఫాలీ వర్మ (47) మొదటి వికెట్‌కు 85 పరుగులతో ధనాధన్ ఆరంభం ఇచ్చారు. చివరి బంతికి 6 పరుగులు కావాల్సిన దశలో కెప్టెన్ హర్మన్ (23) భారీ షాట్ కొట్టే యత్నంలో క్యాచవుటైంది.

సంక్షిప్తస్కోర్లు: ఇంగ్లండ్: 20 ఓవర్లలో 171/9 (డంక్లే 75, వ్యాట్ 66, ఎకిల్‌స్టోన్ 10, దీప్తిశర్మ 3/27, అరుంధతి రెడ్డి 3/32, శ్రీచరణి 2/43); **భారత్:** 20 ఓవర్లలో 166/5 (మంధాన 56, షఫాలీ 47, హర్మన్ 23, లారెన్ 2/30).

ఆసియా కప్ ఫైనల్స్‌కు భారత్

చియాంగ్ మాయి (థాయ్‌లాండ్): ఏఎఫ్‌సీ ఆసియా కప్-2026 ఫైనల్స్‌కు భారత మహిళల సాకర్ జట్టు అర్హత సాధించింది. ఆసియా కప్ క్వాలిఫయర్స్ గ్రూప్-బిలో భాగంగా శుక్రవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో భారత్ 2-1తో ఆతిథ్య థాయ్‌లాండ్‌ను ఓడించింది. దీంతో వరుసగా నాలుగో విజయం సాధించిన భారత్ గ్రూప్ టాపర్‌గా నిలిచి వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే ఆసియా కప్ ఫైనల్స్‌కు బెర్త్ దక్కించుకుంది.



నా ఈవెంట్.. నాదే టైటిల్

‘క్లాసిక్’ విజేత నీరజ్

బెంగళూరు: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. తన పేరిటే నిర్వహించిన ఆరంభ ఎన్‌సీ క్లాసిక్ (నీరజ్ చోప్రా క్లాసిక్) ఈవెంట్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈవెంట్ నిర్వహణతో పాటు అథ్లెట్‌గా బరిలోకి దిగి విజేతగా నిలవాలన్న కలను నెరవేర్చుకొన్నాడు. శనివారం జరిగిన పోటీలో మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 86.18 మీటర్ల దూరం విసిరిన నీరజ్ టాప్‌లో నిలిచాడు. దోహాలో డైమండ్ లీగ్, గోల్డ్ స్పైక్ గెలిచిన చోప్రాకు ఇది వరుసగా మూడో టైటిల్. 2015 వరల్డ్ చాంపియన్ జూలియన్ ఇగో (కెన్యా- 84.51 మీ.) రెండో స్థానంలో, రుమేష్ పతిరగె (శ్రీలంక- 84.34 మీ.) మూడో స్థానంలో నిలిచారు. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్, భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్‌ఐ) భాగస్వామ్యంతో చోప్రా ఈ ఈవెంట్‌ను నిర్వహించాడు. కిక్కిరిసిన స్టేడియంలో చోప్రా కుటుంబం కూడా అతడి ప్రదర్శనను వీక్షించింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఫౌల్‌తో ఆరంభించిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 82.99 మీ. అందుకున్నాడు. మళ్లీ నాలుగో ప్రయత్నం ఫౌల్ కాగా..ఐదో త్రోలో 84.07 మీ., ఆరో త్రోలో 82.22 మీ. మాత్రమే విసిరాడు.

చాంపియన్ శౌర్య



హైదరాబాద్: తెలుగు కుర్రాడు శౌర్య సామల స్పానిష్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. బార్సిలోనాలో జరిగిన ఐటీఎఫ్ నేషనల్ టోర్నీలో సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో శౌర్య 7-5, 5-7, 13-11తో స్పెయిన్‌కు చెందిన జువాన్ పాబ్లోపై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు.



ఎమ్మా నవారో

సినర్, జొకో సులువుగా..

- ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశం
- సబలెంక, స్వియటెక్ కూడా
- డిఫెండింగ్ చాంప్ క్రెజికోవా ఇంటికి



క్రెజికోవా

లండన్: వింబుల్డన్‌లో టాప్‌స్టార్లు జానిక్ సినర్, సబలెంక, ఆరో సీడ్ జొకోవిచ్, 8వ సీడ్ స్వియటెక్ వరుససెట్ల విజయాలతో రౌండ్-16లోకి ప్రవేశించారు. అయితే మహిళల డిఫెండింగ్ చాంపియన్ బార్బరా క్రెజికోవా, 11వ సీడ్ రిబకినా మూడో రౌండ్‌లో ఓడారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో సినర్ 6-1, 6-3, 6-1తో పెడ్రో మార్టినేజ్‌ని, జొకోవిచ్ 6-3, 6-0, 6-4తో కెక్‌మనోవిచ్‌ను చిత్తుచేసి ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో 11వ సీడ్ డిమినార్ 6-4, 7-6 (5), 6-3తో హోమ్‌గ్రెన్‌ని, 22వ సీడ్ కొబోలి 6-2, 6-4, 6-2తో 15వ సీడ్ మెన్సిక్‌ని, 19వ సీడ్ డిమిత్రోవ్ 6-3, 6-4, 7-6 (0)తో సెబాస్టియన్‌ని ఓడించారు. మహిళల సింగిల్స్‌లో..ప్రపంచ నెం.1 సబలెంక 7-6 (6), 6-4తో బ్రిటన్ స్టార్ ఎమ్మా రదుకాను ఆట కట్టించగా, స్వియటెక్ 6-2, 6-3తో డానిలి కొలిన్స్‌పై నెగ్గి రౌండ్-16కు చేరారు. 23వ సీడ్ టౌసన్ 7-6 (6), 6-3తో 11వ సీడ్ రిబకినాకు షాకిచ్చింది. 17వ సీడ్ క్రెజికోవా 6-2, 3-6, 4-6తో 10వ సీడ్ ఎమ్మా నవారో చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 24వ సీడ్ మెర్టెన్స్ 6-1, 7-6 (6) 14వ సీడ్ స్విటోలినాపై నెగ్గింది. ఏడో సీడ్ ఆండ్రీవా 6-1, 6-3తో బాప్టిస్ట్‌ని ఓడించి ప్రీక్వార్టర్‌ఫైనల్ చేరారు.

యుకీ జోడీ ముందంజ: భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/గాలోవే (అమెరికా) జోడీ డబుల్స్‌లో ప్రీక్వార్టర్స్‌కు చేరింది. రెండో రౌండ్‌లో భాంబ్రీ జంట 6-3, 7-6 (6)తో పోర్చుగల్ ద్వయం బోర్గెస్/గిరాన్‌పై గెలిచింది. శ్రీరామ్ బాలాజీ/మిగ్వెయిల్, రిత్విక్/నికొలాస్ జోడీలు మాత్రం రెండో రౌండ్ నుంచే వెనుదిరిగాయి.

పారా అథ్లెటిక్స్‌లో లోకేశ్వరికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో హైదరాబాద్ అమ్మాయి లోకేశ్వరి కాంస్యం సాధించింది. శనివారం చెక్ రిపబ్లిక్‌లోని ఒలామౌక్‌లో జరిగిన డిస్కస్ త్రో టీ37 కేటగిరీలో లోకేశ్వరి డిస్క్‌ను 14.66 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానంలో నిలిచింది. సిమోని (దక్షిణకొరియా) స్వర్ణం, రోసా కరోలినా (ఉజ్బెకిస్థాన్) రజతం సాధించారు.

షూటింగ్ వరల్డ్‌కప్‌నకు ఇషా సింగ్, ఉమా మహేశ

న్యూఢిల్లీ: వచ్చే సెప్టెంబరులో చైనాలో జరిగే ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ వరల్డ్‌కప్‌నకు ముగ్గురు తెలుగు షూటర్లు అర్హత సాధించారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఇషాసింగ్ బరిలోకి దిగనుంది. 50 మీటర్ల 3పీ రైఫిల్‌లో మరో హైదరాబాద్ అమ్మాయి సురభీ భరద్వాజ్, పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో విజయవాడ షూటర్ ఉమామహేష్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఉమామహేష్-రమిత (హరియాణా)తో కలిసి బరిలోకి దిగనున్నాడు.

కల్తీకల్లు కోసం గుట్టుగా మత్తు!

అబ్దుల్లాపూర్‌మెట్‌లోని కెమికల్ ఫ్యాక్టరీలో ఆల్ప్రాజోలం తయారీ
సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో కిలోకుపైగా మత్తు పదార్థం స్వాధీనం
ఆరుగురిని అరెస్టు చేసిన ఈగల్ బృందం.. రూ.30కోట్ల ఆస్తి జప్తు

హైదరాబాద్, జూలై5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాంతంలో కల్తీకల్లు తయారీ కోసం ఉపయోగించే ఆల్ప్రాజోలం అనే మత్తు పదార్థాన్ని పెద్ద మొత్తంలో జిల్లాకు ఈగల్ బృందం పట్టుకుంది. 1090 గ్రాముల అల్ప్రాజోలంను సీజ్ చేసింది. ఈ దందాకు సంబంధించి గిర్మగౌని సుధీర్ గౌడ్, విశ్వేశ్వర్ సింగ్, రాజేశ్వర్ శర్మ జోషి, గిర్మగౌని శ్రీవాణి, ప్రభు గౌడ్, గజ్జల శ్రీశైలం గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మత్తు పదార్థం ఎక్కడ తయారవుతోంది? అనే కోణంలో విచారణ చేసిన ఈగల్ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్‌లోని స్టాంచెం కెమికల్స్‌లో తయారు చేస్తున్నట్లుగా గుర్తించింది. నిందితులకు సంబంధించిన 46.18 ఎకరాల వ్యవసాయ భూమి, ఒక ప్లాటు, రసాయన కర్మాగారం, నాలుగు కార్లు, బ్యాంకు ఖాతాల్లోని నగదును జప్తు చేశామని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ .6.10కోట్లు అని, మార్కెట్ విలువ మాత్రం రూ.30కోట్లకు పైగానే ఉంటుందని, కెమికల్ ఫ్యాక్టరీనే ఏడుకోట్లకు పైగా విలువ చేస్తుందని చెప్పారు. ఈ ఆస్తులన్నీ నార్కోటిక్స్ చట్టం సెక్షన్ 68(ఎఫ్) ప్రకారం జప్తు చేశామని వెల్లడించారు.

సమరభేరి విజయం కాంగ్రెస్ కార్యకర్తల కృషి ఫలితం

- సభకు వచ్చిన ఏఐసీసీ పెద్దలకు ధన్యవాదాలు: మహేశ్ గౌడ్



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల కృషి ఫలితంగా సామాజిక న్యాయ సమరభేరి సభ విజయవంతమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు చెబుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పిలవగానే రాష్ట్రానికి విచ్చేసి రెండురోజుల పాటు ఇక్కడే బసచేసి వివిధ సమావేశాల్లో, సభలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ క్యాడర్‌కు ఎంతో స్ఫూర్తినిచ్చారని అన్నారు. ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

సిగాచి మృతులు 40 మంది

- చికిత్స పొందుతూ మరో కార్మికుడు మృతి
- డీఎన్ఏ పరీక్షలతో మరో మూడు మృతదేహాలు గుర్తించి కుటుంబాలకు అప్పగించిన అధికారులు
- ఇంకా లభించని తొమ్మిది మంది ఆచూకీ



రోదిస్తున్న మున్‌మున్‌చౌదరీ తల్లి ఫూల్‌సుందర్‌దేవి, సోదరుడు బబ్లూచౌదరి

పటాన్‌చెరు, రామచంద్రాపురం టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య 40కి పెరిగింది. పటాన్‌చెరు ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్‌మున్ చౌదరి (40) అనే కార్మికుడు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఇక డీఎన్ఏ పరీక్షల్లో బిహార్‌కు చెందిన తస్లీమొద్దీన్ అన్సారీ (43), శంభూరాం (47), ఒడిశాకు చెందిన పూర్ణచంద్రసాహా (39) మృతదేహాలను శనివారం గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మార్చురీలో గుర్తించాల్సిన మరో రెండు మృతదేహాలు ఉన్నాయి. మరోవైపు గల్లంతైన మరో తొమ్మిది మంది ఆచూకీ లభించాల్సి ఉంది.



అజయ్ ఫొటో చూపుతున్న బంధువు జస్పాకొనాయ్

రెండు మృతదేహాలకు ఇక్కడే అంత్యక్రియలు

మృతదేహాలు పూర్తిగా కాలిపోవడం, దూరాభారాన్ని దృష్టిలో పెట్టుకుని బాధిత కుటుంబాలు ఇక్కడే తమవారి అంత్యక్రియలు చేస్తున్నాయి. శనివారం గుర్తించిన తస్లీమొద్దీన్ అన్సారీ మృతదేహానికి పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలోని ఖబరిస్థాన్‌లో.. శంభూరాం మృతదేహానికి ఇస్నాపూర్‌లో శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇక మున్‌మున్‌చౌదరి మృతదేహాన్ని తల్లి ఫూల్ సుందర్ దేవి, సోదరుడు బబ్లుచౌదరి తమ స్వస్థలం బిహార్‌లోని ఆరా జిల్లా కర్మా గ్రామానికి తీసుకెళ్లారు. అధికారులు ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేసి, ఆర్థిక సాయం అందించి పంపించారు. కాగా, బాధిత కుటుంబాలకు త్వరలోనే పరిహారం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

30వేలు అప్పు చేసి.. విమానంలో వచ్చి..

పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కు చెందిన అజయ్ మండల్ (19) సిగాచి ప్రమాదంలో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు చేయాలని ఆయన తండ్రి సుభాష్ మండల్‌కు అధికారులు సమాచారమిచ్చారు. త్వరగా రాకపోతే మృతదేహం కుళ్లిపోతుందని సుభాష్‌కు ఇస్నాపూర్‌లో ఉంటున్న వారి సమీప బంధువు చెప్పారు. సుమారు 1,800 కిలోమీటర్ల దూరం.. రైలులో వస్తే రెండు రోజులకుపైనే పడుతుంది. రోజు కూలీ అయిన సుభాష్ గురువారం రూ.30 వేలు అప్పు చేసి విమానంలో ఇక్కడికి వచ్చి, రక్త నమూనాలు ఇచ్చారు. శుక్రవారం రాత్రి వచ్చిన డీఎన్ఏ విశ్లేషణ ఆధారంగా అధికారులు అజయ్ మృతదేహం భాగాలను తండ్రికి అప్పగించారు. అది చూసిన సుభాష్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో సరిగా పని దొరక్క హైదరాబాద్‌కు వచ్చిన అజయ్ మండల్.. నెల రోజుల క్రితమే సిగాచి కంపెనీలో చేరారు. మొదటి జీతం కూడా అందుకోకుండానే ప్రమాదంలో కన్నుమూశారు.



టాంపాలో నాట్స్ అమెరికా తెలుగు సంబరాల్లో ప్రసంగిస్తున్న బాలకృష్ణ

ఆధునిక సాంకేతికతకు మూలం సనాతన విజ్ఞానం

- ‘నాట్స్’ అమెరికా తెలుగు సంబరాల్లో బాలకృష్ణ

(ఆంధ్రజ్యోతి కోసం టాంపా నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

చరక సంహిత, పుష్పకవిమానం, దివ్యదృష్టి, వేదాలను గమనిస్తే ఆధునిక సాంకేతికతకు సనాతన విజ్ఞానం మూలమనే ఆధారం స్పష్టంగా కనిపిస్తుందని సినీనటుడు నందమూరి బాలకృష్ణ అన్నారు. టాంపా నగరంలో ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహిస్తున్న 8వ అమెరికా తెలుగు సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీనివాస కళ్యాణంలో భాగంగా ‘హంస వింశతి’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్లు అరచేతిలోకి, శస్త్రచికిత్సలు రోబోలతో నిర్వహించే స్థాయికి వచ్చినా... సముద్రాల ఆవల ఉన్నప్పటికీ అమెరికాలోని తెలుగువారు శ్రీనివాస కళ్యాణం, తెలుగు పాఠాలు, శాస్త్రీయ నృత్యాలను ఆకళింపు చేసుకోవడం తనకు ఆనందంగా ఉందన్నారు. పుస్తకాలను బట్టీయం వేయించవద్దని, అందులోని సారాన్ని గ్రహించేలా పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్‌టీఆర్ చిరస్థాయిగా ఉంటారన్నారు. నాట్స్ పలువురికి పురస్కారాలు ప్రదానం చేసింది. ఫ్లోరిడా రాష్ట్ర సెనేటర్ జయ్ కాలిన్స్, అట్లాంటా కాన్సుల్ జనరల్ రమేష్ లక్ష్మణన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఆగస్టు 3న టీటీసీ కోర్సు పరీక్ష

టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ-లోయర్ గ్రేడ్) పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులకు ఆగస్టు 3న మళ్లీ పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్‌లో పరీక్షలు జరుగుతాయని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు తెలిపారు.



నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్‌ను కలిసిన నిరంజన్‌రెడ్డి, రావుల తదితరులు

ఆసుపత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురై యశోద ఆసుపత్రిలో చేరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడింది. శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న తన నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావు ఉన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ కవిత ఆస్పత్రికి వచ్చి.. కేసీఆర్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. కేసీఆర్ ఈ నెల 3వ తేదీన యశోద ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. రక్తంలో షుగర్ నిల్వలు అధికంగా ఉన్నాయని, సోడియం తక్కువగా ఉందని పరీక్షల్లో తేలటంతో వైద్యులు ఆయనకు చికిత్స అందించారు.

72 నిమిషాల్లోనైనా చర్చకు రెడీ

» అసెంబ్లీకి కేసీఆర్‌ను తీసుకురా: ఎమ్మెల్యే మేడిపల్లి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం ఏం చేసిందో చర్చించే అంశంలో కేటీఆర్ విసిరిన సవాలుకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్రస్థాయిలో స్పందించారు. 72 గంటలు కాదు.. 72 నిమిషాల్లోనైనా తాము చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. సిరిసిల్ల, చింతమడక, తెలంగాణ భవన్, ప్రెస్‌క్లబ్ ఎక్కడికైనా వస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని స్పీకర్‌కు లేఖ రాసి.. ప్రభుత్వ పనితీరుపై చర్చించేందుకు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను సభకు తీసుకురావాలని కేటీఆర్‌ను సవాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిని ఆడిపోసుకోవడం కేటీఆర్‌కు పనిగా మారిందని, ఆయన మాటల్లో అక్కసు, కుళ్లు తప్ప మరేం ఉండవని అన్నారు. ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు తాము ఎప్పుడైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.

ఓటరు జాబితా నుంచి మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని పేరు తొలగింపు

వేములవాడ/హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేశ్ పేరును ఓటరు జాబితా నుంచి తొలగించారు. ఈ మేరకు వేములవాడ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ఓ రాజకీయ నాయకుని పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడం దేశంలోనే మొదటిసారి కావడం గమనార్హం.. వేములవాడ ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత చెన్నమనేని భారత పౌరుడే కాదంటూ కొద్దిరోజుల కిందే హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చెన్నమనేని పేరును ఓటరు జాబితా నుంచి తొలగించాలంటూ ఆది శ్రీనివాస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై అధికారులు ఇచ్చిన నోటీసులకు నిర్ణీత గడువులోగా చెన్నమనేని సమాధానమివ్వకపోవడంతో ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తూ ఆయన ఇంటి గేటుకు తాజాగా నోటీసు అంటించారు.

మాట తప్పితే ఉద్యమ కార్యాచరణే

» పెన్షనర్ల పెండింగ్ బిల్లులపై ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జేఏసీకి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెల రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిన సర్కారు.. గత నెలలో కేవలం రూ.180 కోట్లు మాత్రమే చెల్లించిందని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆరోపించారు. కనుక 2 నెలలకు కలిపి రూ.1,220 కోట్లు వెను వెంటనే చెల్లించాలని, ఇచ్చిన మాటకు కట్టుబడి పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. పీఆర్‌టీయూఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని కోరారు. ఇక ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12న ఓయూకు సీజేఐ రాక

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ఉస్మానియా యూనివర్సిటీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామ్‌కృష్ణ గవాయ్ రానున్నారు. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా 'భారత రాజ్యాంగం-బాబా సాహెబ్ డాక్టర్ భీంరావ్ అంబేడ్కర్ భాగస్వామ్యం' అనే అంశంపై జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రసంగించనున్నారు.


కాంగ్రెస్ సర్కారుపై ధర్మయుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఏడుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పుడు హామీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల్లో ఏవీ అమలు కాలేదన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి 600 రోజులైనా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏఐసీసీ అంటే.. ఆలిండియా చీటింగ్ కమిటీ అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఏ ప్రభుత్వం కూడా ఇంత తక్కువ సమయంలో ఇంతగా వ్యతిరేకత ఎదుర్కోలేదని అన్నారు. "ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డిని రాజీనామా చేసి.. బీసీ నేతను సీఎంను చేయమనండి. నేను కూడా రాజీనామా చేసి బీసీ నేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటాం" అని రాంచందర్‌రావు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్ చేశారు. ఇతర సామాజికవర్గం నేతకు ఒక పదవి ఇస్తే బీసీలకు అన్యాయం చేసినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే.. న్యాయనిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉండేదన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ మద్దతిచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు చుక్కలు చూపిస్తారని వ్యాఖ్యానించారు.

బీజేపీకి వంద సీట్లు అని చెప్పబోయి..

వంద ఎమ్మెల్యే సీట్లు, 15 ఎంపీ సీట్లు గెలుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి.. ఎన్నికల్లో ఓడిపోయిన ఖర్గే ముందు వాగ్దానం చేశారని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. వాస్తవానికి ఆ సీట్లను బీజేపీ గెలుస్తుందని చెప్పబోయి కాంగ్రెస్ గెలుస్తుందంటూ రేవంత్ నోరు జారారని అన్నారు. వంద సీట్లు గెలిచే సత్తా ఉంటే మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిటింగ్ సీటును ఎలా కోల్పోయారని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్



కూడా సారు.. కారు.. పదహారు.. అంటూ ఇలాగే ప్రగల్భాలు పలికిందని, కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతుబంధు కింద 15 వేలు ఇస్తామని చెప్పి..ఈ సీజన్‌కు 7500 ఇవ్వకుండా 6 వేలు మాత్రమే ఇచ్చిందని, స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోతే ఇవి కూడా ఎగ్గొట్టేదేనని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని గుర్తించి రైతులను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగానికి అవసరమైన యూరియా కంటే 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఎక్కువగా కేంద్రం ఇచ్చిందని, కానీ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు.

మోదీని తిట్టడమే మీ సామాజిక న్యాయమా?

ప్రధాని మోదీని, బీజేపీని, ఆరెస్సెస్‌ను తిట్టడమే మీ సామాజిక న్యాయమా? అని రాంచందర్‌రావు ప్రశ్నించారు. "మీరు పెట్టిన సభ ఏంటి? మాట్లాడిన మాటలేంటి?" అని ధ్వజమెత్తారు. ఎమర్జెన్సీ తర్వాత సెక్యులరిజం.. సోషలిజం పదాలను 42వ రాజ్యాంగ సవరణలో కాంగ్రెస్సే పెట్టిందని, ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే ఈ పనిచేసిందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కొన్ని విషయాలు మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. భారత సైన్యాన్ని కాంగ్రెస్ అవమానించిందని, ఇందుకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా అంశంపై అధిష్ఠానాన్ని అడిగి చెబుతానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల్లో మెజారిటీ సీట్లు కైవసం చేసుకోవడం తన ప్రాథమ్యాలని తెలిపారు. చంద్రబాబు, కేసీఆర్‌ల సూచన మేరకే పార్టీ నాయకత్వం రాంచందర్‌రావును అధ్యక్షుడిగా నియమించిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్న అంశాన్ని ప్రస్తావించగా.. అలా ప్రచారం చేసిన వ్యక్తి మంచి కథా రచయిత అని, ఆయనకు అవార్డు ఇస్తామని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ముక్త్ తెలంగాణే బీజేపీ నినాదమన్నారు.

కార్యకర్తల ఆశీర్వాదంతోనే పదవి..

కార్యకర్తల ఆశీర్వాదంతోనే తనకు అధ్యక్ష పదవి వచ్చిందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ పాలనలో అవినీతి, అబద్ధాలు ఉండవన్నారు. తెలంగాణను వికసిత రాష్ట్రంగా మార్చేందుకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని, త్వరలో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని, దీనిపై చర్చకు కాంగ్రెస్ సిద్ధమా? అని సవాల్ చేశారు. అంతకుముందు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద రాంచందర్‌రావు నివాళులర్పించారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఆయన దర్శించుకొని పూజలు చేశారు. కాగా, ఎన్నికల సందర్భంగా ప్రకటించిన 6 గ్యారంటీలు, 63 అనుబంధ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి రాంచందర్‌రావు లేఖ రాశారు.

గల్లీ లీడర్‌లా ఖర్గే వ్యాఖ్యలు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జులై 5 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు ఢిల్లీ లీడర్‌లా కాకుండా గల్లీ లీడర్‌లా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీపై ఆయన చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తన స్థాయి మరచి ఖర్గే విమర్శలు చేశారని మండిపడ్డారు. 80 ఏళ్ల వయస్సు గల ఖర్గే ఈ స్థాయికి దిగజారుతారని ఎవరూ ఊహించలేదు. 'ఈ వ్యాఖ్యలు మీ సొంతమా? లేక ఎవరైనా ఇచ్చిన స్క్రిప్టు చదివారా?' అని ఖర్గేను ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన పాపం వల్లే పీవోకే పాక్ పరమైందని ఆరోపించారు. వరుస వైఫల్యాలతో కాంగ్రెస్‌లో అసహనం నెలకొందన్నారు. రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాల విషయంలోనూ ఖర్గే ప్రజలను తప్పుదోవ పట్టించారని శనివారం ఒక ప్రకటనలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఐ డ్రీమ్ యాంకర్‌పై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

ఐ డ్రీమ్ యూ-ట్యూబ్ చానెల్ యాంకర్ సౌమ్యారెడ్డిపై బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో మాజీ సీఎం కేసీఆర్ మీద తప్పుడు వ్యాఖ్యలు చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెతోపాటు అరుణ్ కుమార్ అనే న్యాయవాది మీద కూడా ఫిర్యాదు చేశారు. గత నెల 25న అరుణ్ కుమార్ అనే న్యాయవాదితో జరిగిన ఇంటర్వ్యూలో తప్పుడు ఆరోపణలతోపాటు అబద్ధాలు చెప్పారన్నారు. కనుక యాంకర్ సౌమ్యారెడ్డి, న్యాయవాది అరుణ్ కుమార్, చానెల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వన్‌పల్లి ప్రాజెక్టులో పడవ బోల్తా

» నీట మునిగి ఇద్దరు మహిళల మృతి
» ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు చిన్నారులు
» వారిని కాపాడేందుకు నీళ్లలోకి దిగిన వ్యక్తి పరిస్థితి విషమం
» అంతా బిహార్‌కు చెందిన పర్యాటకులు
» వికారాబాద్‌లోని ది వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌లో ఘటన
» అనుమతులు, భద్రతా చర్యలు లేకుండా బోటింగ్



ప్రమాదం జరిగిన సర్వన్‌పల్లి ప్రాజెక్టు, రిసార్ట్స్‌లో అక్రమ నిర్మాణాలు

వికారాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా, లైఫ్ జాకెట్లు వంటి కనీస భద్రతా చర్యలు పాటించకుండా ఓ రిసార్ట్ నిర్వాహకులు చేపట్టిన బోటు షికారు రెండు ప్రాణాలను బలి తీసుకుంది. కళ్ల ముందే అయిన వారిని కోల్పోయిన నాలుగు కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. వికారాబాద్‌లోని సర్వన్‌పల్లి ప్రాజెక్టులో శనివారం సాయంత్రం పడవ బోల్తా పడిన ఘటనలో బిహార్‌కు చెందిన రీతాకుమారి(55), పూనమ్‌సింగ్(53) అనే మహిళలు మరణించారు. ఆ మహిళలు, ఇద్దరు చిన్నారులను కాపాడేందుకు నీళ్లలోకి దిగిన అలోక్‌కుమార్ అనే వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వికారాబాద్ మండలం గోధుమగూడ సమీపంలోని ది వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌లోని పట్నాకు చెందిన విజయ్-రీతాకుమారి దంపతులు, అజిత్ కుమార్-పూనమ్ సింగ్ దంపతులు హైదరాబాద్, మియాపూర్‌లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చారు. బిహార్ నుంచి వచ్చిన వారు సహా నాలుగు కుటుంబాల వారు పర్యాటక ప్రదేశమైన అనంతగిరి సందర్శనకు వచ్చి నైట్ క్యాంపింగ్ కోసం శనివారం మధ్యాహ్నం వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు వచ్చారు. అయితే, రీతాకుమారి, పూనమ్‌సింగ్, తమ బృందంలోని ఇద్దరు చిన్నారులు రిసార్ట్స్‌లో ఉన్న సర్వన్‌పల్లి చెరువులో బోటు షికారుకు వెళ్లారు. అలోక్ కుమార్ సహా ఆ బృందంలోని మిగిలిన వారంతా చెరువు గట్టునే ఉన్నారు. బోటు చెరువులోకి వెళ్లిన కాసేపటికి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో డ్రైవర్ పడవను వెనక్కి మళ్లించేందుకు యత్నించగా.. పడవ అదుపు తప్పి బోల్తా పడింది. రీతాకుమారి, పూనమ్‌సింగ్, ఇద్దరు పిల్లలు నీళ్లలో పడిపోవడంతో వారిని రక్షించేందుకు ఒడ్డున ఉన్న అలోక్ కుమార్, స్థానికులు చెరువులోకి దూకారు. కానీ, నీట మునిగిన రీతాకుమారి, పూనమ్‌సింగ్ ప్రాణాలు కోల్పోగా, పిల్లలు ప్రాణాలతో బయటపడ్డారు. వారి కోసం చెరువులోకి దిగిన అలోక్ కుమార్ అనుకోకుండా నీట మునిగి ఆస్పత్రి పాలయ్యాడు. అతని పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు ఎలాంటి అనుమతులు లేకపోగా సర్వన్‌పల్లి ప్రాజెక్టులో అక్రమ నిర్మాణాలు చేపట్టి కాలం చెల్లిన బోట్లతో బోటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ రిసార్ట్స్ అక్రమాలపై 2024 డిసెంబర్ 19న ఓ కథనం ద్వారా 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. ఆ నిర్లక్ష్య వైఖరే నేడు రెండు ప్రాణాలను బలిగొంది.



డిసెంబరు 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

రోజుకు గరిష్ఠంగా 10 గంటల పని

వారానికి 48 గంటలకు మించరాదు

» అంతకుమించి పనిచేస్తే ఓవర్‌టైమ్ వేతనం
» నిరాఘాటంగా 6 పని గంటలు మించవద్దు
» 30 నిమిషాలపాటు విశ్రాంతి తప్పనిసరి
» పని గంటలపై కార్మిక శాఖ నోటిఫికేషన్



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ పర్యవేక్షణలో ఉండే సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు/కార్మికుల పని గంటల విషయంలో నిబంధనలను ప్రభుత్వం సవరించింది. ఏదైనా సంస్థ తమ ఉద్యోగి/కార్మికుడితో రోజులో గరిష్ఠంగా 10 గంటలపాటు పని చేయించుకోవచ్చని తెలిపింది. అయితే వారం మొత్తం కలిపి 48 గంటలపాటు మాత్రమే పని చేయించాలనే నిబంధనకు లోబడి ఈ 10 గంటల పని ఉండాలని పేర్కొంటూ ఈ వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు సులభతర వాణిజ్యంలో భాగంగా తెలంగాణ దుకాణాలు, సంస్థల చట్టం-1980లోని సెక్షన్-73 సబ్ సెక్షన్-4 ద్వారా దఖలు పడిన అధికారాలను అనుసరిస్తూ కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇక నిరాఘాటంగా 6 గంటలకు మించి ఏ ఉద్యోగి/కార్మికుడితో పనిచేయించడానికి వీల్లేదని, మధ్యలో కనీసం 30 నిమిషాలపాటు విరామం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వారంలో 48 గంటల మించి పనిచేస్తే.. విధిగా ఓవర్ టైమ్ వేతనం అందుకోవడానికి ఉద్యోగి/కార్మికుడు అర్హుడని తెలిపారు. కాగా, ఏ ఉద్యోగితో అయినా విశ్రాంతికి లోబడి 12 గంటలకు మించి కూడా పని చేయించడానికి అవకాశం ఉంటుంది. అయితే ఇది కూడా ఒక త్రైమాసికంలో ఓవర్‌టైం 144 గంటలు, వారంలో 48 గంటల పనిగంటలకు లోబడే ఉంటుంది. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కంపెనీకి ఇచ్చిన వెసులుబాటును ఎలాంటి నోటీసు లేకుండా రద్దు చేస్తారు.

ఎల్ఐసీ నుంచి కొత్త పాలసీలు

ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. మరో రెండు కొత్త ఎండోమెంట్ పాలసీలు ప్రారంభించింది. నవ జీవన్ శ్రీ, నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం పేరుతో ప్రారంభించిన ఈ రెండు పాలసీలు పొదుపుతో పాటు పాలసీదారులకు ఆర్థిక భద్రత కల్పిస్తాయని తెలిపింది. ఆయా వ్యక్తుల జీవిత కాలంలో వివిధ అవసరాలకు అనుగుణంగా చాలినంత మూలధనాన్ని సమకూర్చేలా ఈ రెండు పాలసీలను రూపొందించారు. ప్రస్తుత వడ్డీ రేట్ల ఆటుపోట్లను దృష్టిలో ఉంచుకుని పాలసీ కాలంలో హామీతో కూడిన అదనపు మొత్తాలకూ వీలు కల్పించారు. ఈ రెండు పాలసీల ప్రత్యేకతలు.

నవ జీవన్ శ్రీ పాలసీ


- ఇది ఒక లిమిటెడ్ పీరియడ్ ఎండోమెంట్ ప్లాన్
- ప్రీమియం చెల్లింపు కాలపరిమితి 6,8,10,12 సంవత్సరాలు
- 30 రోజుల నుంచి 60 సంవత్సరాల వరకు వయసు ఉన్న వారు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు
- పాలసీ కనీస కాలపరిమితి 10 నుంచి 16 సంవత్సరాలు.
- పాలసీ గరిష్ఠ కాలపరిమితి 20 సంవత్సరాలు.
- కనీస బీమా హామీ మొత్తం రూ.5 లక్షలు. గరిష్ఠ పరిమితి లేదు.

నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం

- 30 రోజుల నుంచి 60 సంవత్సరాల వరకు వయసున్న వారు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు
- ఆప్షన్-1 కింద కనీస మెచ్యూరిటీ వయసు 18 సంవత్సరాలు. గరిష్ఠ మెచ్యూరిటీ వయసు 75 సంవత్సరాలు
- ఆప్షన్-2 కింద మెచ్యూరిటీ వయసు 60వ పుట్టిన రోజుకు దగ్గరలో ఉండాలి
- పాలసీ కనీస గడువు ఐదేళ్లు, గరిష్ఠ గడువు 20 సంవత్సరాలు
- కనీస బీమా హామీ మొత్తం రూ.లక్ష. గరిష్ఠ బీమా హామీ మొత్తానికి పరిమితి లేదు.

ఫాల్కన్‌ఎక్స్ సీఈఓ రఘు యార్లగడ్డకు

ఫిన్‌టెక్ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్: అమెరికాకు చెందిన డిజిటల్ అసెట్ ట్రేడింగ్ సేవల కంపెనీ ఫాల్కన్‌ఎక్స్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ రఘు యార్లగడ్డకు తానా అవార్డు లభించింది. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న తానా 24వ వార్షిక సదస్సులో రఘు యార్లగడ్డను 'తానా అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ' (ఫిన్‌టెక్) అవార్డుతో సత్కరించనుంది. ఈ జనవరిలో ఆయన యూటీ డల్లాస్ డిస్టింగ్విష్డ్ అలుమ్నీ అవార్డుకు కూడా ఎంపికయ్యారు. విజయవాడ వాస్తవ్యులైన రఘు యార్లగడ్డ.. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్-డల్లాస్ నుంచి సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంఎల్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) పట్టా పుచ్చుకున్నారు. ఆపై హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ కూడా పూర్తి చేసిన యార్లగడ్డ.. 2018లో కాలిఫోర్నియా కేంద్రంగా ఫాల్కన్‌ఎక్స్‌ను ప్రారంభించారు. ఇప్పటికే కంపెనీ మార్కెట్ విలువ 800 కోట్ల డాలర్లు (మన కరెన్సీలో దాదాపు రూ.68,500 కోట్లు) దాటింది.

బిజినెస్ ప్లస్



మదుపరులూ పారాహుషార్

అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం దేశీయ స్టాక్ మార్కెట్‌ను ఓ కుదుపు కుదిపింది. ఎఫ్ అండ్ ఓ విభాగంలో ఎక్స్‌పైరీ రోజుల్లో ఈ సంస్థ తన చేతివాటంతో భారీగా లాభాలను ఆర్జించినట్లు సెబీ గుర్తించింది. మానవ ప్రమేయం లేని ఆల్గో ట్రేడింగ్‌తో జేన్ స్ట్రీట్ ఈ మోసాలకు పాల్పడినట్లు తేల్చింది. ఈ అక్రమ దందాతో బ్రోకర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లూ భారీగానే నష్టపోయారు. రిటైల్ మదుపరులు భవిష్యత్తులో ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే మరింత అప్రమత్తంగా ఉండక తప్పదు. అవేమిటంటే..

పెద్ద సంస్థలదే హవా

మార్కెట్ సమాచారం పెద్ద పెద్ద ట్రేడింగ్ సంస్థలకు తెలిసినంతగా రిటైల్ ఇన్వెస్టర్లకు తెలియదు. ఆ మాటకొస్తే చిన్న చిన్న ట్రేడింగ్ సంస్థలకూ తెలియదు. కాబట్టి స్పష్టమైన సమాచారం ఉంటే తప్ప ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జోలికి పోయి చేతులు కాల్చుకోవద్దు.

గుడ్డిగా నమ్మొద్దు

టెక్నాలజీ కూడా మాయగాళ్లకు తోడ్పడుతోంది. జేన్ స్ట్రీట్ సంస్థ కూడా అత్యాధునిక ఆల్గో ట్రేడింగ్ ద్వారానే ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో అనైతిక పద్ధతులకు పాల్పడింది. కాబట్టి ఇండెక్స్‌లు మార్కెట్ వాస్తవ పరిస్థితులకు నిజమైన సూచికలని గుడ్డిగా నమ్మవద్దు. అందులోనూ ఎక్స్‌పైరీ రోజుల్లో అసలు నమ్మొద్దు.

సూచీల కదలికలపైనా జాగ్రత్త

రిటైల్ మదుపరులు ఇండెక్స్‌ల కదలికలపైనా జాగ్రత్త పడాలి. తన పంప్ అండ్ డంప్ వ్యూహంతో జేన్ స్ట్రీట్.. డెరివేటివ్స్ విభాగంలో సూచీలను ప్రభావితం చేసింది. డెరివేటివ్స్‌లో ఇన్వెస్ట్ చేసే రిటైల్ మదుపరులు సూచీల కదలికను బట్టి కాకుండా టెక్నికల్స్ ఆధారంగానే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవటం మంచిది.

అవగాహన

ఎక్స్‌పైరీ రోజుల్లో సూచీలను గణనీయంగా పెంచటం, తగ్గించేందుకు జేన్ స్ట్రీట్.. ఆల్గో ట్రేడింగ్ ద్వారా పెద్ద మొత్తంలో పుట్ ఆప్షన్స్ కొనుగోలు చేసింది. వాటిని ఫ్యూచర్స్‌లో విక్రయించి భారీగా లాభపడింది. ఈ మాయ మంత్రాలు పెద్ద పెద్ద ట్రేడర్లకు తప్ప రిటైల్ మదుపరులకు తెలియవు. కాబట్టి రిటైల్ మదుపరులు ఎఫ్ అండ్ ఓ జోలికి పోకపోవడమే మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

మార్కెట్లో అక్రమాలను సహించం..

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

స్టాక్ మార్కెట్లో అక్రమాలను ఏ మాత్రం సహించబోమని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. తమతో పాటు ఎక్స్ఛేంజీలు కూడా మార్కెట్‌పై నిఘా పెంచాయన్నారు. శనివారం నాడు బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఆయన వ్యాఖ్యలు చేశారు. డెరివేటివ్ ట్రేడింగ్‌లో అక్రమ పద్ధతుల్లో రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికా ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సెబీ చైర్మన్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇతర విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) కూడా జేన్ స్ట్రీట్ తరహాలో మార్కెట్‌ను కొల్లగొట్టే తరహా ట్రేడింగ్ వ్యూహాలను అనుసరించారా..? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. "మార్కెట్లో ఎలాంటి అక్రమాలనూ సహించేది లేదని మాత్రం నేను చెప్పగలను" అని పాండే అన్నారు.

నయా ఫండ్స్

ట్రస్ట్ ఎంఎఫ్ మల్టీ క్యాప్ ఫండ్

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్.. మల్టీ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. వృద్ధికి అపార అవకాశాలున్న స్టాక్స్‌ను గుర్తించి ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 మల్టీ క్యాప్ 50:25:25 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.

యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చునిటీస్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది సర్వీసెస్ థీమ్ ఆధారిత ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ సర్వీసెస్ సెక్టార్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. మంచి పనితీరు కనబరుస్తున్న సేవల రంగంలోని కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18.

ఇన్వెస్కో ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇన్వెస్కో ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ప్రారంభించింది. ఈక్విటీ ఆర్బిట్రేజ్, డెట్ ఆధారిత పథకాల్లో పెట్టుబడులు పెట్టే ఫండ్ ఆఫ్ ఫండ్. 60-65 శాతం పెట్టుబడులు డెట్ ఆధారిత పథకాల్లో పెట్టనుండగా 35-40 శాతం ఆర్బిట్రేజ్ ఫండ్‌లో పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 16.

బజాజ్ అలియాంజ్ నిఫ్టీ మల్టీఫ్యాక్టర్ ఫండ్

బజాజ్ అలియాంజ్ లైఫ్.. నిఫ్టీ 500 మల్టీఫ్యాక్టర్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. యూలిప్ కస్టమర్ల కోసం ఈ కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫండ్.. పాలసీదారులకు లైఫ్ కవరేజీతో పాటు మల్టీఫ్యాక్టర్ ఆధారిత ఈక్విటీ ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ముగింపు తేదీ ఈ నెల 14.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	102
వరంగల్	105	గుంటూరు	107
కరీంనగర్	105	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	86	అనంతపురం	105
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,830 ▲	90,600 ▲	1,20,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	98,730 ▼	90,600 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,11,100 ▲
ప్రొద్దుటూరు	97,300 ▼	89,560 ▼	1,08,500 ▲
ముంబై	97,021 ▼	88,871 ▼	1,07,580 ▼

రాష్ట్రంలో పెరిగిన డెంగీ కేసులు

▸ ప్లేట్‌లెట్స్ పేరిట దోపిడీ చేస్తే కఠిన చర్యలు: దామోదర

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ కేసులు నమోదయ్యే జిల్లాల్లో అధికారులు పర్యటించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. శనివారం ఆరోగ్యశ్రీ కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డెంగీ కేసులు గతఏడాది కంటే పెరుగుతున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో కేసులు పెరిగినట్లు ప్రజారోగ్య విభాగం మంత్రికి నివేదించింది. డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరిట దోపిడికి పాల్పడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై తీవ్రమైన చర్యలు ఉంటాయని మంత్రి దామోదర ఈ సందర్భంగా హెచ్చరించారు. డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటీ లార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో రివ్యూ చేయాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. గిరిజన ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి సారించాలని, ఐటీడీఏ పీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

అర్హులైన కళాకారులందరికీ పింఛన్లు: జూపల్లి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పింఛన్లు ఇస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం రవీంద్రభారతిలో మంత్రిని మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పింఛను ఇచ్చే అంశంపై సీఎంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు.

2036 ఒలింపిక్స్ పతకాలే లక్ష్యం

▸ త్వరలో శిక్షకులు, నిపుణులతో భేటీ: మంత్రి వాకిటి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గత వైఫల్యాలు, అలసత్వాన్ని పక్కన బెట్టి 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. క్రీడలను శిఖర స్థాయికి చేర్చాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకనుగుణంగా క్రీడాశాఖ పనితీరులో కొత్తదనం కనిపించాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి శనివారం ఆయన క్రీడా శాఖ పనితీరుపై సమీక్షిస్తూ.. క్రీడారంగంలో సమూల మార్పులు తేవాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాలని, కార్యాలయాలకు పరిమితం కావద్దని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి త్వరలో వివిధ క్రీడల శిక్షకులు, నిపుణులతో సమావేశమై వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని ఆయన చెప్పారు.

201 మంది వైద్యుల నియామకం

▸ ఎంఎన్‌జేలో 45.. ఆయుష్‌లో 156 మంది

▸ తుది ఫలితాలను విడుదల చేసిన మెడికల్ బోర్డు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో నియామకాల జోరు కొనసాగుతోంది. 201 మంది వైద్యుల నియామక తుది జాబితాను వైద్య నియామకాల బోర్డు శనివారం విడుదల చేసింది. ఆయుష్ వైద్యాధికారులు, ఎంఎన్‌జే ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన ఎంపిక జాబితాను తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈమేరకు బోర్డు సెక్రటరీ గోపీకాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ 201 పోస్టుల్లో ఆయుష్ వైద్యాధికారి పోస్టులు 156 ఉండగా, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45 ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపికైన వారి వివరాలను బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. పోస్టుల భర్తీతో ఆయుష్ వైద్య సేవలు మరింత మెరుగవుతాయని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

నీటి పారుదలలో 'ప్రమోషన్లపై డీపీసీ వేయాలి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తమ శాఖలోని వివిధ అధికారులకు పదోన్నతి కల్పనకు శాఖాపరమైన పదోన్నతుల కమిటీ వేయాలని రాష్ట్ర పరిపాలనాశాఖ (జీఏడీ)కి నీటి పారుదలశాఖ శనివారం లేఖ రాసింది. 120 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా, 15 మంది సూపరింటెండెంట్ ఇంజనీర్లకు చీఫ్ ఇంజనీర్లుగా పదోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జీఏడీకి నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి శనివారం వరకు ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థుల్లో 94,265 మంది ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఈ నెల 8 వరకు గడువు ఉండగా, అభ్యర్థులు 10వ తేదీలోగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. 13న మాక్ సీట్ అలాట్‌మెంట్, 18న తొలి విడత ప్రొవిజినల్ సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని అధికారులు తెలిపారు.

రాజీవ్ స్వగృహ టవర్ల విక్రయానికి నోటిఫికేషన్

▸ హౌసింగ్ బోర్డు పరిధిలోని భూములకు కూడా..

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ పరిధిలోని టవర్లు, ఓపెన్ ప్లాట్లు, హౌసింగ్ బోర్డు పరిధిలోని భూములు, ఓపెన్ ప్లాట్ల విక్రయానికి శనివారం నోటిఫికేషన్లు వెలువడ్డాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం, గాజులరామారం ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ టవర్ల విక్రయానికి ఆగస్టు 20న ఉదయం 11.30 గంటలకు లాటరీ నిర్వహించనున్నారు. ఆగస్టు 19 సాయంత్రం 5 గంటల్లోపు ధరావతు చెల్లించాలి. వీటివిక్రయంతో దాదాపు రూ.96.44 కోట్ల ఆదాయం రావొచ్చని అంచనా. బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లో నిర్మించిన టవర్లలోని ఫ్లాట్లను కూడా విక్రయించనున్నారు. బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లో జూలై 30న, పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌లోని 2-బీహెచ్‌కే ఫ్లాట్ల కోసం ఆగస్టు 1న, ఇతర క్యాటగిరీలకు ఆగస్టు 2న లాటరీ నిర్వహించనున్నారు. సహభావన ఫ్లాట్లకు ఈ నెల 29, సద్భావన ఫ్లాట్లకు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ధరావతు చెల్లించాలి. వీటి విక్రయంతో దాదాపు రూ.127.73 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వనరుల సమీకరణల కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇటీవల నిర్వహించిన సమావేశంలో హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ పరిధిలోని ఆస్తులను విక్రయించేందుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. హౌసింగ్ బోర్డు పరిధిలో హైదరాబాద్ కేపీహెచ్‌బీ ఫేజ్-4లోని 7.33 ఎకరాల స్థలాన్ని, ఇదే ప్రాంతంలో మరోచోట 4,598 చదరపు గజాలు, 2,420 చదరపు గజాలు, నాంపల్లి ఎంజే రోడ్‌లో 1,148 చదరపు గజాల ప్లాట్లకు ఈ నెల 30న వేలం నిర్వహించనున్నారు.

కేటీఆర్‌కు సవాల్ చేసే అర్హత లేదు: చామల

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సవాల్ చేసే అర్హత లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉత్తర కుమారుడి ప్రగల్భాలు బంద్ చేయాలని కేటీఆర్‌కు హితవు చెప్పారు. కేటీఆర్ గతంలో కూడా సవాళ్లు విసిరి తప్పించుకున్నారని విమర్శించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల కరెంటు, 500 రూపాయలకే సిలిండర్ తదితర పథకాలు వచ్చాయా లేవా అనేది ప్రజలు చెప్తారన్నారు. కాగా, రాష్ట్రంలో 30 లక్షల రైతు కుటుంబాల జీవితాలను విదేశీ కంపెనీ చేతిలో పెట్టి... వారి జీవితాలతో కేసీఆర్, కేటీఆర్ ఆడుకున్నారని రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు వరి వేస్తే ఉరేనన్నట్లు చెప్పిన బీఆర్ఎస్‌కు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చనగాని దయాకర్ పేర్కొన్నారు.

తెలంగాణ రైతుల ఉసురు తీసింది మీరు కాదా?

వరి తప్ప ఇతర పంటల మద్దతు ధరపై ఆలోచించారా?.. బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన తుమ్మల

ఎరువులు సరఫరా చేయండన్నా రాజకీయమేనా?.. పేరెత్తకుండానే బీజేపీపై పరోక్ష విసుర్లు

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుల ఉసురు తీసింది మీరు కాదా? అని బీఆర్ఎస్ నేతలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. వరి తప్ప ఏనాడైనా ఇతర పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలన్న సంగతి ఆలోచించారా? అని ప్రతిపక్ష పార్టీ నేతలను నిలదీశారు. ఒకసారి వరి, మరొకసారి మొక్కజొన్న, ఇంకొకసారి పత్తి సాగు వద్దని.. ఏది పడితే అది చెప్పి అన్నదాతలను గందరగోళంలో పడేశారన్న తుమ్మల.. గత పాలకుల మాట విని సాగు చేసిన పంటలకు మార్కెట్ లేక విలవిల్లాడిన రైతుల గోస ఏనాడైనా వినిపించుకున్నారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు.



హుజూరాబాద్ ఉప ఎన్నికలో గెలుపు కోసం రాష్ట్ర దళితులందరికి దళిత బంధు ఇస్తామని ప్రచారం చేసి.. ఎన్నిక పూర్తి కాగానే చేతులెత్తేసిన సర్కారు బీఆర్ఎస్‌దని తుమ్మల శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక మునుగోడు ఉప ఎన్నిక వేళ.. ఆ నియోజకవర్గ రైతుల ఖాతాల్లో రూ.50 వేలు జమ చేసి గెలుపొందాలని ఆలోచించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. నాడు రూ.లక్ష రుణమాఫీని నాలుగు దఫాల్లో అమలు చేయాల్సిన అగత్యం ఎందుకు ఏర్పడిందో వారికే తెలియాలని వ్యాఖ్యానించారు. రెండోసారి ఎన్నికల్లో గెలవడానికి సగం మంది రైతులకే రుణమాఫీ చేశారని ఆరోపించారు. కానీ, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం.. ఎన్నికల లబ్ధి కోసం నిధులు విడుదల చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించడం వారి విజ్ఞతకే అద్దం పడుతుందని పేర్కొన్నారు. వరి వేస్తే ఉరి అని మీరు చెబితే.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇచ్చి, ఎకరానికి రూ.10,000- 15,000 చొప్పున అన్నదాతకు లబ్ధి చేకూరుస్తోందని ఆయన అన్నారు.

ఎరువులు ఇవ్వండన్నా రాజకీయమేనా?

రాష్ట్రానికి కేటాయించిన ఎరువులు సకాలంలో ఇవ్వాలని అడిగితే, దాన్ని కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు రాజకీయం చేస్తున్నారని తుమ్మల విమర్శించారు. ఎరువుల గురించి లెక్కలతో సహా రాస్తున్న లేఖలను చూడకుండా ఏ రాజకీయ ప్రయోజనం కోసం వారు మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని ఆయన అన్నారు.

న్యాయమంటే శిక్షలే కాదు..

బాధితులకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. దీనికి అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలూ అందిస్తున్నాం" అని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న భరోసా కేంద్రం చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిందని, ఈ సేవలను అందిస్తున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందని తెలిపారు. లైంగిక దాడులకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా ఆయా చిన్నారులకు సంపూర్ణ రక్షణ కల్పించి, వారిలో విశ్వాసాన్ని పెంపొందించి మళ్లీ సాధారణ జీవితానికి అలవాటు పడేలా ఈ కేంద్రాలు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాయని తెలిపారు. "పోక్సో, జువైనల్ చట్టాలు ప్రగతిశీల సాధనాలుగా పని చేస్తున్నాయి. అయితే, ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు, రక్షణకు సంపూర్ణ సహాయకారిగా ఈ చట్టాలు ఉండాలి" అని సూచించారు. చైల్డ్ పోర్నోగ్రఫీ కేసుల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు నిర్దేశించారు. 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్ర స్థాయి సమావేశం అవసరమని అంటూనే.. ఎంతో కీలకమైన అంశంపై ఈ సదస్సు నిర్వహించిన తెలంగాణ పోలీసులకు, ఇతర నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు.

పోక్సో కేసుల్లో 90 శాతం శిక్షలు: సీతక్క

పోక్సో చట్టానికి సంబంధించి 90 శాతం కేసుల్లో నేరగాళ్లకు శిక్షలు వేయించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు చాలావరకు గంజాయి లాంటి మత్తుమందులు కారణమవుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని, అందుకే తెలంగాణను 'డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రం'గా మార్చడానికి సీఎం రేవంత్ రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నారని ఆమె వివరించారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం, మహిళా శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర న్యాయ సేవా సాధికార సంస్థ సంయుక్తంగా ఈ సదస్సును ఏర్పాటు చేశాయి. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్, మహిళా భద్రతా విభాగం అదనపు డీజీపీ చారు సిన్హా, యునిసెఫ్ భారత ప్రతినిధి క్యాథినా తదితరులు సదస్సులో పాల్గొన్నారు.



స్టేట్‌లెవెల్ స్టేక్ హోల్డర్స్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాలల భద్రత జాతీయ బాధ్యత: జస్టిస్ సూర్యకాంత్

బాలల భద్రత కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదని, నైతిక, జాతీయ బాధ్యత అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నల్సార్ అధ్యక్షుడు జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులకు సంబంధించి అశ్రద్ధ, వ్యవస్థాగత వైఫల్యం కేవలం నేరపరమైన లోపం మాత్రమే కాదని, బాల్యానికి చేస్తున్న తీవ్ర ద్రోహమని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని భరోసా కేంద్రాలు చట్టపరంగానే కాకుండా వైద్య, మానసిక సంరక్షణను సమగ్రంగా అందించే జాతీయ బాలల రక్షణ ఫ్రేమ్‌వర్క్‌ను సాకారం చేస్తున్నాయని ప్రశంసించారు. పోక్సో కేసుల సంఖ్య పెరుగుతుండడంపై హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. పోక్సో కేసు నిందితుల్లో 98% కుటుంబ సభ్యులు, బంధువులు లేదా ఇరుగుపొరుగు ఉంటున్నారని తెలిపారు. ఇలాంటి కేసులను చూస్తున్న అన్ని శాఖల సిబ్బంది తమ వద్దకు వచ్చే బాధితుల విషయంలో సానుభూతి, సున్నితత్వంతో వ్యవహరించాలని సూచించారు.

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మంగళవారం కూడా అక్కడే ఉంటారని తెలిసింది. పార్టీ అధిష్ఠానంతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది. రేషన్‌కార్డుల సమస్యకు పరిష్కారం చూపేలా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి కొత్తవి మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సభకు రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను ఆహ్వానించనున్నట్లు తెలిసింది. మెట్రో రెండో దశ విస్తరణ డీపీఆర్, ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగం అంశాలపై కేంద్ర మంత్రులను కలిసి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

12 నుంచి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

▸ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 18వరకు అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలు, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శనివారం ప్రజాభవన్‌లో మహిళా సంఘాలకు ఆర్టీసీ నుంచి రావాల్సిన అద్దె చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. ఈ రుణాలతో ఏ వ్యాపారాలు చేయాలి అనే అంశంపై ఈ నెల 7 నుంచి 9 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మహిళా సంఘాలు సమావేశమై చర్చించుకోవాలని ఆయన సూచించారు.

సీఎం రేవంత్‌ను ప్రశ్నించే హక్కు నీకు లేదు

▸ ప్రశ్నించాలనుకుంటే కేసీఆర్‌తో విపక్ష నేత పదవికి రిజైన్ చేయించు

▸ ఆ పదవి తీసుకుని ప్రశ్నించు.. అప్పుడు నీ మాటను పరిగణిస్తాం

▸ కేటీఆర్‌కు జగ్గారెడ్డి సూచన

▸ రేవంత్ గురువు బాబు అని కేటీఆర్ మాట్లాడుతున్నారు

▸ కేసీఆర్‌కూ ఆయన గురువే

▸ ఎన్టీఆర్‌ను పదవి నుంచి దించేప్పుడు.. వైస్రాయ్ హోటల్ ఇన్‌చార్జిగా పని చేసింది కేసీఆర్ కాదా?

▸ కేసీఆర్‌కు బాబు మంత్రి పదవి ఇచ్చింది అందుకు కాదా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించే హక్కు, స్థాయి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. కేటీఆర్, ఆయన బావ హరీశ్‌రావు సెకెండ్ బెంచ్ లీడర్లని పేర్కొన్నారు. చర్చ కోసం అసెంబ్లీ పెడతాను సభకు రావాలంటూ ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను రేవంత్ కోరితే.. ప్రతిపక్ష నేత మాట్లాడకుండా మధ్యలో ఈ సెకెండ్ బెంచ్ లీడర్లు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. రేవంత్‌ను ప్రశ్నించాలని, సవాల్ విసరాలని కేటీఆర్‌కు ఉంటే.. ముందుగా కేసీఆర్‌తో ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయించాలని సూచించారు. ఆ పదవిని కేటీఆర్ తీసుకుని సవాల్ విసరాలని, అప్పుడే ఆయన మాటకు విలువ ఉంటుందని, తామూ పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. అంతేగానీ.. అనవసరంగా రేవంత్‌కు సవాళ్లు విసిరి పలుచన కావొద్దని సూచించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. సహజంగా ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు పెట్టాలంటూ ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేస్తుందని, కానీ తెలంగాణలో మాత్రం దానికి రివర్స్‌గా ఉందన్నారు. "అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ పిలుస్తుంటే.. బోట్స్ క్లబ్‌కు, ప్రెస్ క్లబ్‌కు రమ్మని కేటీఆర్ అంటుండు. ఇంకా రెండు రోజులైతే కల్లు దుకాణానికి రమ్మంటాడేమో!" అంటూ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలు ఎక్కడ చర్చిస్తారో సాధారణ పౌరుడిని అడిగినా చెబుతాడన్నారు. బీఆర్ఎస్ అధికారంలో దుర్మార్గంగా పాలించారని, రేవంత్ ఇంట్లో ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. "రేవంత్‌ను పట్టుకుని చంద్రబాబు శిష్యుడంటూ కేటీఆర్ మాట్లాడుతున్నడు. మరి.. కేసీఆర్ ఎక్కడి నుంచి వచ్చిండు? ఆయనకు గురువు కూడా చంద్రబాబు కాదా? ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టినప్పుడు కీలకంగా పని చేసింది.. వైస్రాయ్ హోటల్ ఇన్‌చార్జిగా ఉన్నది కేసీఆర్ కాదా? అందుకనే కేసీఆర్‌కు చంద్రబాబు.. మంత్రి పదవి ఇచ్చింది నిజం కాదా?" అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు, కేసీఆర్‌లు యూత్ కాంగ్రెస్ నేతలుగా ఉన్నప్పుడు వారిద్దరూ వి. హన్మంతరావు కింద పనిచేశారన్నారు. రవాణా మంత్రిగా ఉన్నప్పుడు.. చిన్న రాష్ట్రాలతో ఉపయోగం లేదన్న కేసీఆర్.. ఆ తర్వాత ఆంధ్రావాళ్లను తిట్టారని, మళ్లీ గ్రేటర్ ఎన్నికలు రాగానే ఆంధ్రావాళ్ల కాలికి ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తానని మాట్లాడారన్నారు. ఏ పూటకు ఆ మాట మాట్లాడే వారు కూడా తమకు రాజకీయాలు చెప్పేవారయ్యారని విమర్శించారు. అసలు నీటి పంచాయతీని తెచ్చిందే బీఆర్ఎస్ సర్కారు అని ఆరోపించారు. నీళ్ల దొంగతనం చేసిన వారిని ఇంటికి పిలిచి మీటింగ్ పెట్టింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. కవిత.. రైల్ రోకో కాకుంటే.. ఫ్లైట్ రోకో చేసుకోవచ్చునన్నారు.




గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

పదవులు శాశ్వతం కాదు

▸ నిర్ణయాలతో పది మందికి మేలుచేయాలి

▸ మంత్రి పొంగులేటి నర్మగర్భ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పదవులు శాశ్వతం కాదని రాష్ట్ర రెవెన్యూ, పౌర సరఫరాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. పదవిలో ఉన్నప్పుడు చేపట్టిన సంస్కరణలు, నిర్ణయాలతో పది మందికి మేలు జరగాలన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేష్ కుమార్‌తో కలిసి శనివారం ఆయన ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. వీఆర్‌వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి సామాన్యులకు రెవెన్యూ సేవలు దూరం చేసిందన్నారు. అందుకే ప్రజలకు రెవెన్యూ సేవలను చేరువ చేసేందుకు మళ్లీ గ్రామ పాలనాధికారుల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పొంగులేటి చెప్పారు. గతంలో పని చేసిన వీఆర్‌వో, వీఆర్ఏలకు జీపీవోలుగా అవకాశం కల్పించడానికి గత మార్చిలో పరీక్ష నిర్వహిస్తే 3,454 మంది అర్హత సాధించారని, రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు గతంలో పని చేసిన వీఆర్‌వో, వీఆర్ఏలకు మరో విడత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ట్రెసా, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గింపు

(మొదటిపేజీ తరువాయి)

అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లకు స్టాంప్ డ్యూటీ ప్రస్తుతం ఒకే విధంగా ఉందని, పాత అపార్ట్‌మెంట్ల ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకుని స్టాంప్ డ్యూటీ తగ్గించే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు. భారతీయ స్టాంప్ చట్టం-1899ని అనుసరించి త్వరలో తెలంగాణ స్టాంప్ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. సవరణ బిల్లు-2025పై శనివారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ స్టాంప్ చట్టం-1899 ప్రకారం తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లు, 26 ఆర్టికల్స్‌ను సవరించేందుకు 2021లో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు. ఈ బిల్లుపై కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలపై సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో సవరణ బిల్లును వెనక్కి పంపిందన్నారు. ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాత బిల్లు స్థానంలో కొత్త బిల్లు తెస్తున్నామని పేర్కొన్నారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిబంధనలు ఉండాలని, కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడమే లక్ష్యంగా బిల్లును రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే.. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని మంత్రి పొంగులేటి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది..? అక్కడ హేతుబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది? వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి ఆర్. తిరుపతి, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సవరణ వల్ల ఉపయోగం ఏంటి..?

భారతీయ స్టాంప్ చట్టం-1899 ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం తన అవసరాలకు అనుగుణంగా కొన్ని సవరణలు చేసేందుకు సిద్ధమైంది. ఈ సవరణల వల్ల ప్రభుత్వానికి, వ్యాపార వర్గాలకు వచ్చే ఉపయోగాలు ఏంటనే చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచుకునేందుకు చట్ట సవరణ దోహదపడుతుందని రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ముద్దా వెంకట రాజేష్ తెలిపారు. సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పొరేట్ సేవలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీ పెంచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. రియల్ ఎస్టేట్, ఇతర వాణిజ్య ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడంతోపాటు ఆయా వర్గాల నుంచి ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని ఆర్జించేందుకు సవరణలు దోహదపడతాయని పేర్కొన్నారు. సవరణల ద్వారా ఈ స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తేవచ్చని, నకిలీ స్టాంప్ పేపర్లు, డూప్లికేట్లు, స్కామ్‌లను నివారించేందుకు ఈ విధానం సహాయపడుతుందని చెప్పారు. కొత్త ఒప్పందాలపైనా స్టాంప్ డ్యూటీ విధించడం, కొత్త ఒప్పందాలు, కొత్త రకం లావాదేవీలకు సంబంధించిన (ఉదాహరణకు షేర్ల బదిలీ, ఫ్రాంచైజీ ఒప్పందాలు,) అంశాలను స్టాంప్ డ్యూటీ పరిధిలోకి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. స్టాంప్ డ్యూటీ చెల్లింపు ప్రక్రియను సులభతరం చేయడం(ఆన్‌లైన్ విధానం, బ్యాంక్ ఆథరైజ్డ్ సెంటర్లు) ద్వారా పౌరులకు, వ్యాపార సంస్థలకు ప్రయాస తగ్గుతుందని, అయితే ఈ విధానాన్ని ఇండియన్ బ్యాంకర్ల సంఘం వ్యతిరేకిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ తెలిపారు. కేంద్రం ఆమోదం తప్పనిసరి ఉన్న అంశాలను మినహాయించి.. రాష్ట్ర పరిధిలో సవరణకు వీలున్న అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని కొత్త బిల్లును తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం మీద ఈ సవరణల వల్ల రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పెరుగుతుందని, స్కామ్‌లు తగ్గుతాయని, ఈ గవర్నెన్స్ బలోపేతం అవుతుందని, పౌరులకు సులభతరమైన సేవలందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ తరహా సవరణలను ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో అమలులో ఉన్నాయని, దీని వల్ల ఆయా రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగిందని వారు పేర్కొంటున్నారు.



కాల్పుల విరమణకు హమాస్ అంగీకారం

గాజా, టెల్‌అవీవ్, జూలై 5: ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ అంగీకారం తెలిపింది. ఈమేరకు తన సమ్మతిని ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులకు తెలియజేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన ఈ కాల్పుల విరమణ ఒప్పందం 60రోజులు అమలులో ఉంటుంది. హమాస్ తన దగ్గరున్న ఇజ్రాయెలీ బందీల్లో పది మందిని తొలి రోజే వదిలిపెడుతుంది. అలాగే బందీలుగా ఉంటూ మరణించిన వారి 18 మృతదేహాలను హమాస్ అప్పగిస్తుంది. ప్రతిగా గాజాలో ఇజ్రాయెల్ దాడులు, సైనిక చర్యలు నిలిపివేయాలి. ప్రజలకు నిత్యావసరాల సరఫరాలో ఆటంకాలు కలగకుండా చూడాలి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికాలో వచ్చేవారం పర్యటించనున్న సందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందంపై తుదినిర్ణయం ప్రకటిస్తారని సమాచారం.

అమెరికాలో నీరవ్ మోదీ తమ్ముడి అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 5: పరారీలో ఉన్న ఆర్థికనేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ తమ్ముడు నెహాల్ దీపక్ మోదీ (46)ని అమెరికాలో అరెస్టు చేసినట్టు శనివారం అధికారవర్గాలు తెలిపాయి. అతడిని భారత్‌కు పంపించాలని ఈడీ, సీబీఐలు చేసిన విజ్ఞప్తి మేరకు శుక్రవారం అమెరికా పోలీసులు అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. అతడిని అదుపులో తీసుకునే విషయమై ఇంటర్‌పోల్ ఇదివరకే రెడ్ నోటీసు జారీ చేసింది. నెహాల్ మోదీ కేసుపై ఈ నెల 17న కోర్టులో తదుపరి విచారణ జరగనుంది. వజ్రాల వ్యాపారంలో మోసం చేశాడన్న కేసులో దాదాపు మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన నెహాల్ గురువారమే విడుదలయ్యాడు. వెంటనే మనీ లాండరింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.13వేల కోట్ల మేర మోసగించిన కేసులో నీరవ్‌మోదీతో పాటు ఆయన మేనమామ మెహుల్ చోక్సీ ప్రధాన నిందితులుగా ఉన్నారు. వారికి సహకరించారంటూ నెహాల్‌పైనా కేసు నమోదైంది.

ఉగ్రవాదులను అప్పగిస్తాం: బిలావల్ భుట్టో

ఇస్లామాబాద్, జూలై 5: భారత్ కోరుతున్న కొంతమంది ఉగ్రవాదులను అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి, విపక్ష పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో సహకరించేందుకు భారత్ సిద్ధపడితే, పరస్పర విశ్వాస కల్పన చర్యల్లో భాగంగా పాక్ అలాంటి చర్య చేపడుతుందన్నారు. భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణ కోసం లష్కరే తయిబా చీఫ్ హఫీజ్ సయిద్, జైషే మహ్మద్ అధినేత మసూద్ అజార్‌లను అప్పగిస్తారా అని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన ఆ విధంగా సమాధానం చెప్పినట్లు డాన్ పత్రిక వెల్లడించింది. మసూద్ అజార్, హఫీజ్ సయిద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన అన్నారు. హఫీజ్ సయిద్ పాకిస్థాన్ కస్టడీలో ఉన్నాడని, మసూద్ అజార్ ఎక్కడున్నాడో తమకు తెలియదన్నారు.

విమానంలో ఫైర్ అలారం.. రెక్కపైనుంచి దూకేసిన ప్రయాణికులు

న్యూఢిల్లీ, జూలై 5: విమానం కొద్ది క్షణాల్లో టేకాఫ్ అవుతుందనగా ఫైర్ అలారం మోగింది. భయాందోళనతో ప్రయాణికులు ఆగమాగమై విమానం రెక్క పైనుంచి కిందికి దూకేశారు. స్పెయిన్‌లోని మయాక ఎయిర్‌పోర్టులో ఇది జరిగింది. ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు. స్పెయిన్‌లోని పాల్మా డే మయాక నుంచి ఈ నెల 4న ర్యాన్ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 విమానం మాంచెస్టర్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇంతలో విమానంలో అగ్నిప్రమాద హెచ్చరికగా అలారం మోగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు విమానంలోకి వచ్చి ఎమర్జెన్సీ ద్వారం గుండా ప్రయాణికులను బయటకు పంపే ఏర్పాట్లు ప్రారంభించారు. కానీ, కొందరు భయంతో విమానం రెక్క మీద నుంచి దూకేశారు. ఇదిలా ఉండగా, విమానంలో అగ్నిప్రమాదం ఏమీ జరగలేదని, అలారం పొరపాటున మోగిందని ఆ తర్వాత సిబ్బంది చెప్పారు.

టెక్సాస్‌లో వరద బీభత్సం.. 27 మంది మృతి

కెర్విల్, జూలై 5: కొన్ని నెలల పాటు కురవాల్సిన వర్షం కొన్ని గంటల్లో కుండపోతగా కురవడంతో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో 27మంది దుర్మరణం పాలవగా.. మరో 23మందికిపైగా బాలికల ఆచూకీ గల్లంతయింది. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కెర్ కౌంటీలో శుక్రవారం రాత్రి ఏకధాటిగా 25 సెంటీమీటర్ల వర్షం కురవడంతో హంట్ ప్రాంతంలోని గ్వాదలూప్ నది ఉగ్రరూపం దాల్చింది.

బిహార్‌లో ఓటర్ల జాబితాపై సమీక్షపై సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సమీక్ష (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్‌ఐఆర్) రాజ్యాంగ వ్యతిరేకమని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దానివల్ల లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతారని తెలిపింది. గతేడాది అక్టోబర్ 29 నుంచి ఈ ఏడాది జనవరి 6 తేదీల మధ్య ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఇప్పటికే జరిగిపోయిందని గుర్తు చేసింది. వలస వెళ్లిన వారి ఓట్లు, మరణించిన వారి ఓట్ల విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించారని తెలిపింది. ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో ఉండగా ఇంత తక్కువ సమయంలో మరోసారి విస్తృత సమీక్ష జరపాలంటూ జూన్ 24న ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు ఎలాంటి కారణాలు లేవని ఏడీఆర్ అభిప్రాయపడింది. తన పౌరసత్వం గురించి మాత్రమే కాకుండా తన తల్లిదండ్రుల పౌరసత్వాన్ని కూడా పత్రాల ద్వారా నిరూపించాల్సి ఉంటుందని, లేకపోతే ఓటరు పేరును జాబితా నుంచి తొలగిస్తారని తెలిపింది. తమ అంచనా ప్రకారం ఈ ప్రక్రియ మూలంగా ఎస్సీ, ఎస్టీలు, వలస కార్మికులు వంటి అణగారిన వర్గాలకు చెందిన మూడు కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోతారని ఏడీఆర్ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది.

వక్ఫ్ ఆస్తులకు పోర్టల్.. నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 5: దేశంలో ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహించేందుకు, అభివృద్ధి చేసేందుకు, వక్ఫ్‌కు మరింత సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం ప్రత్యేక పోర్టల్, డేటాబేస్ ద్వారా వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, ఆడిట్, అకౌంట్ల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చిన 2025, వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపరిచిన 1995నాటి చట్టంలోని సెక్షన్ 108బీ ప్రకారం ఈ నిబంధనలు తీసుకువచ్చినట్టు కేంద్రం పేర్కొంది. ఆయా నిబంధనల అమలు, పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖలోని సంయుక్త కార్యదర్శికి అప్పగించారు. వక్ఫ్ పోర్టల్ సహా డేటాబేస్‌కు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు, కేంద్రంతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు, సహాయకారిగా ఉండేందుకు వీలుగా ప్రతిరాష్ట్ర ప్రభుత్వం ఓ నోడల్ అధికారిని నియమించాలి. ఈ అధికారి రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాను కలిగి ఉండాలని కేంద్రం వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించే నోడల్ అధికారి.. తన పరిధిలోని వక్ఫ్ ఆస్తులను గుర్తించి జాబితాను అధికారికంగా ప్రచురించాలి. అనంతరం 90 రోజుల్లో దీనిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పోర్టల్, డేటాబేస్‌లపై ముతావలికే నియంత్రణ ఉంటుంది. అయితే, జిల్లా కలెక్టర్‌కు కూడా పోర్టల్, డేటాబేస్ యాక్సెస్ ఉంటుంది.

దేశ రక్షణ మరింత బలోపేతం

సిద్ధమవుతున్న 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు.. అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో

న్యూఢిల్లీ, జూలై 5: అత్యాధునిక ఆయుధాలతో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వివిధ రకాల 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు రెడీ అవుతున్నాయి. దాడి చేయడం, రక్షణ సామర్థ్యాలపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ఈ హైపర్‌సోనిక్ మిసైల్ టెక్నాలజీని వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టు విష్ణులో ఈ మిసైళ్ల తయారీని ప్రధానంగా చేపట్టారు. వీటితో పాటు మరిన్ని అత్యాధునిక ఆయుధాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో ఓ హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికిల్ (హెచ్‌జీవీ), హైపర్‌సోనిక్ క్రూజ్ మిసైల్స్, హైపర్‌సోనిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయడంలో ప్రధాన లక్ష్యం.. అత్యంత వేగవంతమైన దాడి సామర్థ్యాలలో స్వావలంభన సాధించడం, అలాగే ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం వాడే శత్రువులను ఎదుర్కోవడానికి బలమైన రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడం అని నిపుణులు చెబుతున్నారు. 2024 నవంబరులో డీఆర్‌డీవో తొలి హైపర్‌సోనిక్ మిసైల్ పరీక్షను నిర్వహించడం ఓ మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దేశీయ స్క్రామ్‌జెట్ ఇంజిన్ అభివృద్ధిలో ఇదో ఘన విజయంగా నిలిచింది. దీంతో స్క్రామ్‌జెట్ హైపర్‌సోనిక్ వ్యవస్థలను అభివృద్ధి చేసిన అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ నిలిచింది. దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ సామర్థ్యం ఉన్న శక్తిమంతమైన దేశాల్లో మనదేశం ఒకటిగా నిలిచింది. మాక్ 5 (ధ్వని కన్నా ఐదు రెట్లు వేగం) కన్నా ఎక్కువ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఆయుధాలను హైపర్‌సోనిక్‌గా పేర్కొంటారు.



ప్రస్తుతానికి ఇలాంటి హైస్పీడ్ క్రూయిజ్ మిసైళ్లను అడ్డుకునే రక్షణ వ్యవస్థ ఏదీ ప్రపంచంలో లేదు. అలాంటి అత్యాధునిక 12 హైపర్‌సోనిక్ ఆయుధాలను ఆర్మీ, నేవీ, వాయుసేన కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. దీనిలో మొట్టమొదటగా ఎక్స్‌టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్(ఈటీ-ఎల్‌డీహెచ్‌సీఎం)ను ప్రాజెక్టు విష్ణులో భాగంగా రూపొందిస్తున్నారు. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో మాక్ 8 స్పీడ్‌ను అందుకునేలా దీనికి రూపకల్పన చేశారు. 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న పరిధిలోని లక్ష్యాలను ఇది ఛేదించగలదని చెబుతున్నారు. 2030 కల్లా దీనిని సాయుధ బలగాల అమ్ములపొదిలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక మరో ప్రధానమైన ఆయుధం హెచ్‌జీవీ. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ మిసైల్‌ను నవంబరు 2024లో డీఆర్‌డీవో పరీక్షించింది. యుద్ధనౌకలపై దాడి చేసేందుకు రూపొందించిన ఈ మిసైల్ రేంజ్ 1,500 కిలోమీటర్లు. 2030 కల్లా దీనిని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయంలో ప్రాజెక్టు కుశ కింద ప్రత్యేక హైపర్‌సోనిక్ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి భారత్ కృషి చేస్తోంది. దాడి చేసే ఆయుధాలను రూపొందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి సంకల్పించారు. ఇక ఇండో-రష్యన్ బ్రహ్మోస్ క్రూయిజ్ మిసైల్‌కు హైపర్‌సోనిక్ వెర్షన్ బ్రహ్మోస్-2 అభివృద్ధిపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. భూమిపై నుంచి 1500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపైకి మాక్ 7 నుంచి 8 వేగంతో దూసుకుపోయేలా దీన్ని డిజైన్ చేశారు.

హైపర్‌సోనిక్ డ్రోన్లు కూడా..

యుద్ధ విమానాలు, నౌకల నుంచి కూడా ప్రయోగించే హైపర్‌సోనిక్ మిసైళ్లను డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వర్షన్ కూడా ప్రతిపాదనలో ఉంది. అంతేకాకుండా హైపర్‌సోనిక్ డ్రోన్లు, డెకాయ్‌లు కూడా రూపొందిస్తోంది. 2030 కల్లా సమగ్ర హైపర్‌సోనిక్ మిసైల్ అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

సామాజిక సమానత్వంలో 4వ స్థానంలో భారత్!

'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక సంక్షేమ శాఖ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 5: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచిన భారత్.. అత్యంత సామాజిక సమానత్వం ఉన్న దేశాల్లోనూ నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సహా 167 దేశాల కంటే మెరుగైన స్థానం సంపాదించింది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక, సంక్షేమ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించే చర్యలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోనే ఈ సమానత్వం సాధ్యమైందని పేర్కొంది. మొత్తం 171 దేశాలతో కూడిన జీని ఇండెక్స్‌లో భారత్ 25.5 పాయింట్లతో స్లొవాక్ రిపబ్లిక్ (24.1), స్లొవేనియా(24.3), బెలారస్ (24.4) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. భారత స్కోరు 2011లో 28.8 పాయింట్లుగా ఉండగా.. 2022 నాటికి 25.5 పాయింట్లకు మెరుగుపడిందని వివరించింది (తక్కువ స్కోరు ఉంటే తక్కువ అసమానతలు). జీని ఇండెక్స్‌లో యూకే (32.4) చైనా (35.7), యూఎస్‌ఏ (41.8) మనకన్నా వెనుకబడ్డాయని పేర్కొంది. "భారత ఆర్థిక పురోగతి పౌరుల మధ్య సమానంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. పేదరికం తగ్గింపు, విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, జన్‌ధన్ యోజన, ఆధార్ వంటివాటితో నేరుగా సంక్షేమ పథకాల నగదు బదిలీ, ఆయుష్మాన్ భారత్‌తో వైద్య సదుపాయం వంటివి దీనికి కారణం. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలో 2011 నుంచి 2023 మధ్య 17.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం 16.2 శాతం నుంచి 2.3 శాతానికి తగ్గింది" అని సామాజిక సంక్షేమశాఖ ప్రకటనలో పేర్కొంది.

మళ్లీ ఏకమైన ఠాక్రే సోదరులు

- మరాఠీ విజయోత్సవ వేడుకల్లో వేదిక పంచుకున్న ఉద్ధవ్, రాజ్
- మహారాష్ట్రపై హిందీని రుద్దితే సహించబోమంటూ కేంద్రంపై తీవ్రస్వరం
- 'మహా' రాజకీయాల్లో ఆసక్తికర మలుపు



ముంబై, జూలై 5 : మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఠాక్రే సోదరులు (సోదరుల కుమారులు) ఉద్ధవ్, రాజ్ తొలిసారి ఒకే వేదికను పంచుకున్నారు. మరాఠీ భాష అస్తిత్వం కోసం ఐక్యమవుతామని, ముంబై, మహారాష్ట్రలను చేజిక్కించుకుంటామని ఇరువురు నేతలూ ప్రతినబూనారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేసిన త్రిభాషా సూత్ర విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ సందర్భంగా శనివారం ముంబైలోని వర్లీలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం), మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన 'ఆవాజ్ మరాఠీచా' పేరిట విజయోత్సవ సభ నిర్వహించాయి. కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిన సభలో ఈ పార్టీల తరఫున ఉద్ధవ్, రాజ్ వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ కలయికపై వస్తున్న అనుమానాలను తొలగించేందుకు ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నించారు. "బృహత్ ముంబై కార్పొరేషన్ (బీఎమ్‌సీ) ఎన్నికల వరకైనా మేమిద్దరం కలిసి సాగుతామో లేదోనని అనేకమందికి అనుమానాలు ఉన్నాయి. మేమిక్కడ మరాఠీ కోసం ఉన్నాం. మరాఠీ కోసమే కలిసి ఉంటాం." అని తెలిపారు. మరో అడుగు ముందుకేస్తూ...ముంబై స్థానిక సంస్థల ఎన్నికలను, మహారాష్ట్రను కూడా మేం గెలుచుకుంటామని ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించారు. బీఎమ్‌సీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో లేక వచ్చే ఏడాది మొదట్లో జరగొచ్చునని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరగనున్నాయనే సంకేతం అందించాయి. రాజ్ ఠాక్రే కూడా సుమారుగా అదే సూచనను తన ప్రసంగంలో చేశారు. "మా ఇద్దరిని బాలాసాహెబ్ కలపలేకపోయారు. కానీ, ఆ పని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ చేయగలిగారు" అని రాజ్ అనడంతో సభ నవ్వుల జల్లులతో నిండిపోయింది. 'కలిసి ఉండాలనుకుంటున్నాం కాబట్టే కలిశాం" అని వ్యాఖ్యానించారు. హిందీని రుద్దాలనే ప్రయత్నాన్ని ఎన్నటికీ సఫలం కానీయబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులపై రాజ్ ఠాకే తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. విచ్ఛిన్న రాజకీయాలు చేస్తూ, రాజకీయాలను వ్యాపారంగా మార్చివేశారంటూ ఆగ్రహించారు.

అదొక ఏడుపుగొట్టు సభ : ఫడణవీస్

ఠాక్రే సోదరులిద్దరు కలిసి.. విజయోత్సవ సభను కాకుండా, ఒక ఏడుపుగొట్టు సభను నిర్వహించారని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ఎద్దేవా చేశారు. బాలాసాహెబ్ కలపలేకపోయిన తామిద్దరిని దేవేంద్ర కలిపారన్న రాజ్ ఠాక్రే వ్యాఖ్యలపై స్పందిస్తూ... తనకు ఆ ఘనతను కట్టబెట్టినందుకు రాజ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వాన్ని కూలదోసి తిరిగి పదవిలోకి ఎలా రావాలన్న యావ తప్పించి వారిద్దరి సభలో మరాఠీ గురించి ఒక్క మాట కూడా వినిపించలేదన్నారు.

సీయూఈటీ-యూజీ లోపభూయిష్ఠంగా?

పరీక్ష పత్రం సరళిపై ఆందోళనలు

న్యూఢిల్లీ, జూలై 5: దేశంలోని వివిధ కాలేజీలు, యూనివర్సిటీల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ-యూజీ) వ్యవస్థ లోపభూయిష్ఠంగా మారిందన్న విమర్శలొస్తున్నాయి. ఈ నెల 4న సీయూఈటీ-యూజీ ఫలితాలు విడుదలయ్యాయి. అయితే పరీక్ష పత్రం సరళి, మూల్యాంకనంలో తప్పులు, ఒక స్ట్రీమ్ నుంచి మరోదానిలోకి మారడంలో అడ్డంకులు, సహేతుకంగా లేని నార్మలైజేషన్ ప్రక్రియ తదితరాలపై విద్యార్థులు, నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. స్కోరింగ్ విధానం, వ్యవస్థాగత వైఫల్యాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎకనామిక్స్ (ఆనర్స్), బీఎంఎస్ వంటి కోర్సుల్లోకి మారాలని భావించే సైన్స్ విద్యార్థులను సీయూఈటీ-యూజీ 2025 స్వరూపం తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ప్రశ్నపత్రం సరళి సబ్జెక్టు మారడాన్ని కఠినతరంగా మార్చింది. తమ కోర్ సబ్జెక్టులు మినహా మిగిలిన వాటిలో రాణించాల్సి రావడం వారికి ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ఇక ఐదు సబ్జెక్టులే ఎంచుకోవాలన్న నిబంధన విద్యార్థులకున్న ఆప్షన్లను పరిమితం చేస్తోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుత విధానంలో పరిమితులెన్నో...

- క్లిష్టత స్థాయితో సంబంధం లేకుండా ఒకే సంఖ్యలో ప్రశ్నలు ఇవ్వడం, పరీక్ష వ్యవధిని అందరికీ ఒకేలా వర్తింపజేయడం అన్యాయమనే వాదన ఉంది.
- విద్యార్థులకు వచ్చిన పర్సంటైల్‌ను కాకుండా మొత్తం మార్కులను పరిగణనలోకి తీసుకోవడం కూడా స్ట్రీమ్ మారాలని భావించే సైన్స్ విద్యార్థులకు ప్రతికూలంగా మారుతోంది.
- రాష్ట్ర బోర్డులు, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల కంటే సీబీఎస్‌ఈ విద్యార్థులు ముందంజలో ఉంటారు. ఈ నేపథ్యంలో సమాన అవకాశాల కోసం 'ఒకే దేశం ఒకే సిలబస్'ను అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.
- సీయూఈటీ-యూజీ పరీక్షను దాదాపు నెల రోజుల పాటు, వేర్వేరు షిఫ్టుల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో నార్మలైజేషన్ ప్రక్రియ అసంబద్ధంగా మారిందని, ఇది చాలావరకూ దుర్వినియోగమవుతోందని ఆరోపణలొస్తున్నాయి.


నాసిరకం హెల్మెట్లపై కేంద్రం సీరియస్

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను వినియోగించడం గణనీయంగా పెరిగినా.. నాణ్యమైన హెల్మెట్ల వినియోగం తక్కువే ఉంటోంది. ఈ నేపథ్యంలో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నాసిరకం హెల్మెట్ల తయారీ, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాహనదారులు ఐఎస్ఐ మార్కు, బీఐఎస్ సర్టిఫికేషన్ ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని, ఇందుకు తనిఖీలు నిర్వహించడంతోపాటు వినియోగదారులకు అవగాహన కల్పించాలని దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మేజిస్ట్రేట్లకు లేఖలు రాసినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలో 21 కోట్లకుపైగా ద్విచక్ర వాహనాలున్నాయని, వాహనదారుల భద్రత అత్యంత ముఖ్యమని కేంద్రం తెలిపింది.

భారత సంతతి ప్రజలకు ఓసీఐ కార్డులు

- ఆరో తరం వరకు ఉదారంగా ఇస్తాం
- ట్రినిడాడ్, టుబాగో పర్యటనలో మోదీ
- ఐరాసలో భారత శాశ్వత సభ్యత్వానికి ఆ దేశం సంపూర్ణ మద్దతు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 5: ట్రినిడాడ్, టుబాగో దేశంలో నివసిస్తున్న భారత సంతతి ప్రజల్లో ఆరో తరం వారికి కూడా ప్రవాస భారతీయ పౌరసత్వ(ఓసీఐ) కార్డులు ఇవ్వనున్నట్లు ఆ దేశ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. ద్వీప దేశమైన ట్రినిడాడ్, టుబాగోలో 40 శాతం మంది భారత సంతతి వారే. అయితే వీరంతా బ్రిటీషు వారి పాలనా కాలంలో అక్కడికి వెళ్లారు. దీంతో ప్రస్తుతం వారి వద్ద ఎటువంటి భారతీయ గుర్తింపు కార్డులు లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోదీ ఈమేరకు ప్రకటించారు. కాగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వానికి ట్రినిడాడ్, టుబాగో పూర్తి మద్దతు ప్రకటించింది. ఈమేరకు రెండు దేశాలు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ.. ట్రినిడాడ్, టుబాగో ప్రధాని కమ్లా పెర్సాద్ బిసెస్సర్ మధ్య జరిగిన చర్చల్లో రెండు దేశాల మధ్య ఆరు అంశాలపై ఒప్పందాలు జరిగాయి. రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, డిజిటల్ సాంకేతికత, ఏకీకృత చెల్లింపుల వంటి వాటిలో సహకరించుకోవాలని నిర్ణయించారు. ఆ దేశ మహిళా క్రికెటర్లకు భారత్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మోదీ ప్రకటించారు. 2027-28 సంవత్సరానికి ఐరాస భద్రతా మండలిలో ట్రినిడాడ్, టుబాగో సభ్యత్వానికి, 2028-29 సంవత్సరానికి భారత సభ్యత్వానికి మద్దతు ఇవ్వాలని ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నివారించాల్సిందేనని ఇరు దేశాలు నిర్ణయించాయని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇండియా-కారికోమ్ భాగస్వామ్యం మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. కారిబ్బియన్ ప్రాంతంలోని 15 సభ్య దేశాలతో కూడినదే కారికోమ్. మోదీ తన పర్యటనలో ద్వీప దేశ అధ్యక్షురాలు క్రిస్టిన్ కార్లా కాంగలూను కూడా కలుసుకొన్నారు. కాగా మోదీ తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం(స్థానిక కాలమానం ప్రకారం) అర్జెంటీనా చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్నారు.



అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్‌తో మోదీ



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.